భీమన్న నఖక్షతాలు

# గిల్లి చెప్తున్నా

(మినీ కవితల కదంబం)

బోయి భీమన్న

ప్రథమ ముద్రణ : 1996

ప్రతులు : 1000

హక్కులు : రచయితవి

వెల : రూ॥ 116/-

కాపీలకు : భీమన్న సాహితీ నిధి
ఐసి 85, ఇరమ్ మంజిల్ కాలనీ
హైదరాబాదు - 82

కంపోజింగ్ : ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్
ముద్రణ : బాగ్‌లింగంపల్లి
హైదరాబాదు - 44
ఫోన్: 660000

ఆదర్శ క్రియాదక్షులు, ఆత్మీయులు

## బిళ్లవేదయ్యగారికి

భిల్లుడు ధర్మ వ్యాధుడు,
భిల్లుడు వాల్మీకి, శివుడు భిల్లుడు; ఆంధ్రన్
భిల్లయు బిళ్లయు నొకటే;
బిళ్ల కుటుంబ ప్రముఖ్య! వేద య్యాఖ్యా!

ప్రతిభకును, ప్రజ్ఞకును, ప్రాభవమ్మునకును,
శక్తి సామర్థ్యములకు, విధ్యుక్త ధర్మ
నిర్వహణ ధురీణతకు, సాంస్కృతిక కళల
సద్విలాసమ్ములకు విలాసమ్ము నీవు!

నైజ నిజ జీవితమున, రంగ స్థలమున
స్వచ్ఛతరము నీ పాత్ర, రాజస్వ వరము;
గిల్లి చెప్పెడి నా నఖాంకిత మనోజ్ఞ
కావ్య మంజరి గొను రక్తి కలదు నీకు!

అందుకె నా కావ్య కుమా
రిం దమి నీ కిత్తు గొనుము! ప్రీతిన్ గనుమా!
ఇందున సుందర కృతు లై
దొందల పై గలవు రసమయూఖా కృతులన్!

బిల్ల వేదయ్యగా సామ వేద మూర్తి
నాకు దొరికిన సంతృప్తి నాకె కలదు,
లభ్యమౌ గాక లోక వాల్లభ్య కలశి
నీకు నీ వంశమునకు సుశ్లోక మధువు!

ఆది కాల మందు వేదాలవలె నేటి
కాలమునకు తగిన కవిత లివ్వి;
వచన కవిత లయ్యు వరణీయములు, భార
తీయ ధృతికి మానవీయ కృతులు!

-భీమన్న

# ధర్మసేన

కాలాన్ని ఆరు రుతువులుగా గిల్లాను
అది ఇంకా సాగిపోతూ వుంటే – దాన్ని
అలా పునర్వసంతంగా వదిలేశాను
కాలం ప్రకృతి, నిరంతర శృంగార వతి!

గ్రంథానికీ, పీఠికకూ, వ్యాఖ్యకూ వేరు వేరు పేర్లు ఉంచడం మన సాహిత్య సంప్రదాయంలో ఉంది.

ఒకే లక్ష్యం, ఒకే మార్గం, ఒకే శిక్షణ, ఒకే సిద్ధాంతం, ఒకే నాయకత్వం – ఈ పంచ సూత్రాలకూ కట్టుపడి, ముందుకు సాగే క్రమానుబద్ధ సమూహమే సేన అంటే.

సృష్టి ప్రణాళికలో పనికిరాని దంటూ ఏదీ లేదు. నిషిద్ధ మేదీ లేదు. దేని పరిధిలో అది ప్రతీదీ ధర్మ సేనే.

ప్రపంచంలోని అనేక సమాజాలలో కామం నిరసించబడింది. నిరసిస్తూనే అనుభవించే ఆత్మ వంచకత్వం, హిపోక్రసీ అనేక ప్రపంచ సమాజాలలో వుంది.

ఒక్క భారతీయ సమాజమే కామానికి గౌరవ స్థానం ఇచ్చి, ధర్మకామానికి దైవత్వం కల్పించింది.

అనేక ప్రపంచ సమాజాలలోని భావ ధోరణిలో దైవం ఏక వ్యక్తి. భారతీయ భావధోరణిలో దైవం బీజాంకురం.

అర్ధ నారీశ్వర తత్వం పరిధిలో లక్ష్మీ నారాయణులు, సరస్వతీ చతుర్ముఖులు, శివపార్వ తులు సంపూర్ణ దైవ భావానికి రూప కల్పనలు.

వృక్ష, జంతు వర్గాలలో కామానికి ఋతు నియమాలు వున్నై. మానవ వర్గానికి లేవు. సృష్టి సహజమైన ఈ కామప్రవృత్తిలో మానవులలో వచ్చిన ఈ విలక్షణతను కంట్రోలు చెయ్యడానికి ధర్మ కామాన్ని అంగీకరిస్తూ, స్వేచ్ఛా కామాన్ని నిషేధించారు సంఘ పెద్దలైన మన రుషులు.

అందువల్లనే మానవ సమాజం ఒక క్రమంలో వికసించగలిగింది.

మధ్య మధ్య రౌడీలూ, రాక్షసులూ సమాజాన్ని అల్లరి పెడుతూవున్నా, వాళ్ళందర్నీ అణచివేస్తూ, మెజారిటీ సమాజం మెజస్టిక్‌గా పురోగమించగలుగుతున్న దందువల్లనే.

మానవాత్మ మహితాత్మగా వికసించడానికి మూలభూతం ఈ ధర్మ కామమే. ఒక ప్రక్క జ్ఞాన విజ్ఞానాలతో కూడిన మేధావిత, మరో ప్రక్క ప్రేమ సౌందర్యాలతో కూడిన హార్దికత సమానంగా ప్రవర్ధమైనై మానవతలో.

హృదయానికి సంబంధించిన ప్రేమ, సౌందర్యాలే సంగీత సాహిత్య చిత్ర శిల్పాది కళ లన్నిటికీ ఆధారాలు. ప్రేమ సౌందర్యాలతో జ్ఞాన విజ్ఞానాలు ఒరుసుకొన్నప్పుడు మెరుపులు వెలువడత్తై. ఆ మెరుపులే వ్యంగ్య వైభవాలు. అవే పరమాత్మీయ సౌందర్య నిశ్రేయ సానందం లోకి ద్వారాలు. ఎంత సూక్ష్మాలో అంత సువిశాలాలు.

## మధుర బాధ

బాధలు అనేకం. అసలు శరీరమే ఒక బాధల రాశి. అనేక బాధల కలయికతో ఏర్పడ్డ రూపం.

ప్రతి జీవీ, ప్రతి క్షణమూ ఏదో బాధతో, బాధలతో సతమతమవుతూనే వుంటుంది. అది సహజం.

నామం, రూపం, గుణం - ఇందులో ఏ ఒక్కటైనా సరే అది పుట్టిందంటే, దానికి కారణం ఏదో ఒక సంఘటనమే. ఏ ఘటనాఘటన సంఘటన కైనా హేతువు రెండు శక్తుల ఘర్షణమే. స్నేహ శక్తుల ఘర్షణ సృష్టి. వైరశక్తుల ఘర్షణ లయం.

(వైజ్ఞానిక భాషలో చెపితే - స్నేహ శక్తులంటే ఒక పాజిటివు, ఒక నెగిటివు. వైర శక్తులంటే రెండూ ఒకే ముఖానికి చెందిన పాజిటివు లేక నెగిటివు.)

జీవితంలో బాధలు ఎన్నెన్ని రకాలుగా వున్నా, ప్రేమ శృంగారాలకు చెందిన బాధలనే మధుర బాధ లంటాం.

ఇతర బాధలకు మన అధీనంలో లేని దేశ కాల పాత్రాదులు కారణం కావచ్చు. మధుర బాధలకు మాత్రం కారణం మనమే. ఇవి మనం కోరి తెచ్చుకొన్నవే. ఈ

మధుర బాధలు రెండు విధాలు. సంభోగ శృంగారంలోని అష్టోపరతులు, విప్రలంభ శృంగారంలోని దశవిధావస్థలు. ఈ పద్దెనిమిదీ కూడ మధుర బాధలే.

ప్రసవ వేదన వంటిదే మరణ వేదన. ఒకటి ప్రవేశ ద్వారంలోని ఒరపిడి. రెండోది నిష్క్రమణ ద్వారంలోని తోపిడి. జగన్నాటక రంగంలోకి ప్రవేశం కనుక మొదటిది మధుర బాధ.

## మరణం మూడు విధాలు

ఒకటి: సహజ మరణం. ఇది వృద్ధాప్యంలో ముగ్గిన పండులా రాలిపోవడం.

రెండు: దుర్మరణం. ఇది అనేక విధాలు, ప్రమాదాలు, పొరపాట్లు, వ్యాధులు, దురల వాట్లు, సాహసాలు, శత్రుత్వాలు, దౌర్జన్యాలు వగైరాల వల్ల మరణం సంభవించవచ్చు. హత్యలు, మానభంగాలు, బలులు వంటివన్నీ ఈ తరగతి కిందికే వస్తాయి.

మూడు: మధుర మరణం. విప్రలంభ శృంగారంలోని దశమావస్థ యిది. ప్రేమ కోసం ఆత్మార్పణ చేసుకోవడం, ఆమరణ నిరశన వ్రతం, బెంగపెట్టుకొని చచ్చిపోవడం, బ్రహ్మరంధ్ర భేదనం, జీవ సమాధి వంటి స్వచ్ఛంద మరణాలు ఈ కోవలోని.

ధర్మ సేన లక్ష్యం సమాజాన్ని, వ్యక్తిని, వ్యవస్థను ధర్మ మార్గంలో నడపడం. ఎక్కడైనా, ఎప్పుడైనా అధర్మం సంక్రమించినప్పుడు దాన్ని తొలగించడం. ఈ ధర్మ సేనను రసరంగం నుంచి రాజకీయ రంగానికి మార్చాలన్న నా ప్రయత్న రూపమే ఈ నఖక్షతాలు. గిల్లినందుకు కోపించకండి. గిల్లి హెచ్చరిస్తున్నందుకు సంతోషించండి.

## నఖక్షతం

నఖక్షతం అనే మాట శృంగార శాస్త్రానికి చెందిన సాంకేతిక పదం.

సెక్సును పాఠ్యాంశంగా బోధించాలని ఈనాడంటున్నాం. జ్ఞానం, విజ్ఞానం దృష్టిలో మానవ శరీరానికి సంబంధించి రహస్యంగాని, అసభ్యంగాని ఏమీ లేదు.

మనోజాడ్యాలతోను, శారీరక వికారాలతోను బాధపడే వృద్ధ సన్యాసు లెంతగా గోల పెడుతూ వెనక్కి లాగుతున్నా, సమాజం ముందుకు పోతూనే వుంది. దిగంబరోద్యమాలు మొత్తం మీద అన్ని దేశాలలోను కొనసాగుతూనే వున్నై.

బహుశా వాటన్నిటికీ మన శ్రీశుక, వేమన యోగులే గురువులేమో పరిశోధించవలసి వుంది.

"తల్లి కడుపు నుండి తా వచ్చి నప్పుడు
మొదల బట్ట లేదు, తుదను లేదు
నడుమ బట్టకట్ట నగుబాటు కాదొకో" అన్నాడు వేమన.

వేమన మహాయోగి. మహాకవి. మహాపురుషుడు. మహాప్రవక్త. వేమన మరో దేశంలో మరో జాతిలో పుట్టివుంటే – ప్రపంచ ప్రవక్త లంతా ఆయనలో లయించిపోయి, ఆయనొక్కడే పరమప్రవక్తగా విరాజిల్లే వాడు. మతాలన్నీ ఆయనలో విలీనమైపోయి, లోకంలో ఒక్క వేమన మతమే నిలిచివుండేది. మానవజాతికి అదృష్టం లేక, ఆయన కులవ్యవస్థా దూషితమైన నేటి హిందూ సంఘంలో పుట్టాడు.

అన్నాన్ని బ్రహ్మ స్వరూపంగా ప్రకటించి, యజ్ఞం ద్వారా అన్నంపై సమస్త జనులకూ సమాన హక్కుల్ని ప్రసాదించిన వాళ్ళూ, కామానికి పురుషార్థాలలో సముచిత స్థానం కల్పించిన వాళ్ళూ మన ఆర్ష ఋషులే. జీవితంపట్ల వాళ్ల దృక్పథం అంతటి వాస్తవికమూ, హేతు బద్ధమూను.

సంభోగ శృంగారం కంటె విప్రలంభ శృంగారమే ఉత్తమమైనదని చెపుతూ కూడ, మొత్తం మీద దేనికైనా ఆనందస్థాయి రతే కనుక, దానిని చేరుకొనే సోపాన క్రమాన్ని నిరూపించి చెప్పారు. భావప్రాప్తికీ, బ్రహ్మైక్యానికీ మార్గం చూపారు.

నఖం అంటే గోరు. క్షతం అంటే గాటు, నరుకు, గాయం. నఖక్షతం అంటే గోరు గుచ్చుకోవడం వల్ల అయిన గాయం.

అయితే – పిల్లలో, విరోధులో గిచ్చుకోవడం, రక్కుకోవడం, పీక్కోవడం వల్ల అయే గాయాలను నఖక్షతా లనం.

నఖక్షతా లంటే – ప్రేయసీ ప్రియులు ఒకరి నొకరు అనుభవించే కోరికతో, మైమరిచిన పెనుగులాటలో, ఉద్రేకోత్సాహాల పట్టు విడుపుల కారణంగా కలిగే గోటి గాటులు.

అవి అర్ధచంద్రాకారంలో పడే నెలవంకలు కావచ్చు. నెత్తురు చిందే గోరు వంకలూ కావచ్చు. వీటిని ఇంగ్లీషులో నెయిల్ మార్క్స్ (Nail marks) అనీ, హిందీలో నఖోంకె నిశాన్ అనీ అంటారు.

## మిత్ర ధర్మం

మిత్రుణ్ణి ఒక ప్రమాదం నుంచి రక్షించాలనుకొన్నప్పుడు, శత్రువును సాధించాలను కొన్నప్పటి వలెనే, చతుర్విధోపాయాలనూ ప్రయోగించవలసి రావచ్చు.

మానవులు అనేక రకాలు, వాళ్ల వాళ్ల మెదళ్లు చెందిన పరిణతిని బట్టి ఆయా రకాలు వుంటై. అందులో మెజారిటీ వేళ్లు, ఆకులు, కొమ్మలు, ముళ్లు, మొగ్గలుగానే వుండి పోతుండగా – కొందరు పువ్వులుగా, మరికొందరు ఫలాలుగా వికసించడం, ఫలించడం జరుగుతూ వుంటున్నది.

ఈ వాస్తవం వికాసానికి సంబంధించిందే కాని, ప్రయోజనానికి సంబంధించింది కాదు. ప్రయోజనం, ప్రాధాన్యం వేళ్లకూ పుష్ప ఫలాలకూ సమానమే. వేళ్లు లేకుండా కందమూలాలు లేవు. మూలికల రూపంలో కూడ వేళ్లకు ప్రత్యేక ప్రయోజన ముంది.

ఈ అనేక రకాల మనుషులలో, మెదడు పరిపక్వతను బట్టి, ఒకోరకం మనుషులను ఒకో ఉపాయం ద్వారా సక్రమ మార్గంలో పెట్టవచ్చు. మరీ మూర్ఖుల విషయంలో దండోపాయం తప్పదు. ఈ నాలుగో ఉపాయాన్ని ప్రయోగించడం తప్పనప్పుడు అది రెండు విధాలు. మిత్ర పద్ధతి, శత్రు పద్ధతి.

ఒక మిత్రుణ్ని దుర్మార్గం నుంచి మళ్లించాలనుకొన్నప్పుడు, అతడు మంచి సలహాలను వినగలిగి లేనప్పుడు – బెదిరించో, నిందించో, గాయపరిచో, నిర్బంధించో అతణ్ని సరిదిద్ద యత్నించడం మిత్రధర్మం.

గాయపరిచి అయినా సరే మిత్రుణ్ని కాపాడక తప్పదు. అయితే అట్టివాడు ఏ ఆయుధంతో అయితే తన మిత్రుణ్ని గాయపరచదలిచాడో, ఆ ఆయుధానికి గాయాన్ని మానిపే మందును కూడ పూస్తాడు. ఆయుధానికి శత్రువు విషం పూస్తే, మిత్రుడు మాను మందు పూస్తాడు.

ఈ మాను మందునే సాహిత్యంలో ధ్వని, వ్యంగ్యం, వక్రోక్తి, వగైరా పేర్లతో పిలుస్తారు. అందుకే మిత్రుడిలా సలహా చెప్పే పురాణాలు అంత జనామోదం పొందాయి. ప్రియకాంతలా ఉపదేశం చేసే కావ్యాలు సహృదయ రంజకాలైనై.

"అయితే – ఇది పాతకాలపు మాట" అంటాడు, మా యూత్ లీగ్ లీడరు.

"మరి, కొత్త కాలపు మాట ఏది?"

## ఏది ఆధునికత

ఆజ్ఞాపించే వేదాలను, సలహా చెప్పే పురాణాలను, హృదయ పరివర్తన కలిగించే కావ్యాలను పాత చెత్తకుండీలో పారేద్దాం. సరే పారేద్దాం. చాలవరకు పారేశాం కూడ. ఎవరో కొద్ది మంది నాలాంటి వాళ్లు తప్ప, ఈ నాడెవరూ వాటి పేర్లెత్తడం లేదు. మంచిది.

పాతను రాల్చేస్తూ, కొత్త అందాలను విరబూస్తూ ముందుకు పోవడం ప్రగతి.

తరం వెంట తరంగా యువకులు పుట్టుకొస్తూనే వున్నారు కదా? ఈనాటి తరం యువకులు, నిన్నటి తరం యువకుల కంటె ఎంత ముందుకు పోగలిగారు?

ఆలోచించ గలిగిన వాళ్లెవరైనా వుంటే, ఆలోచించి చెప్పండి!

సాధారణ అవగాహన ప్రకారం తరం అంటే ముప్పై సంవత్సరాలు. మూడు తరాలు ఒక జీవితం. తొంబై యేళ్ల తాతకు అరవై యేళ్ల కొడుకు, ముప్పై యేళ్ల మనుమడు వుండాలి.

ఈ ప్రణాళిక ప్రకారంచూస్తే – ఒక మనిషి జీవిత కాలంలోనే మూడు తరాల కృషి కనిపిస్తుంది. కొడుకుతరం ముగింపుకు రాగా, మనుమడి తరం ఉజ్వలంగా వెలిగిపోతూ ఉంటుంది. ముని మనుమడు (వుంటే) పదేళ్ల లోపువాడుగా వుంటాడు.

ఇప్పుడు నేనడుగుతున్న ప్రశ్నలను అర్థం చేసుకోండి.

1. ఒక తొంబై యేళ్ల తాతగారు తన యౌవనంలో సాధించిన ఫలితాలకంటె ఆయన కొడుకు తన యౌవనంలో సాధించిన ఫలితాలు గొప్పవిగా వుండాలి. ఎక్కువ అభ్యుదయ కరమైనట్టివిగా వుండాలి. పాత కొత్తల మధ్య, భూత వర్తమానాల మధ్య

జనరేషను గేపు (Generation gap) స్పష్టంగా కనుపించేలా ఉండాలి. మరి అవి అలా వుంటూన్నయా?

2. సమాజాభివృద్ధి కోసం తండ్రి కంటె కొడుకు, తాత కంటె మనుమడు సాధిస్తున్న అధికతర విజయాలేమిటి?

3. మానవజాతి ఒక వ్యవస్థగా ఏర్పడి పురాణాలకు అందినప్పటి నుంచి దానిని పరిశీలించి చూచినా – నాటి నుంచి నేటి వరకు సాధించబడిన అభ్యుదయం ఏమాత్రం?

4. సహజంగా కాలానుగుణంగా పరిసరాలలో, పద్ధతులలో వచ్చే మార్పులను అలా వుంచితే – మానవ స్వభావంలో నాటికి నేటికి ఏమాత్రమైనా ఉత్తమత్వం, ఔన్నత్యం, సర్వజనీ నత్వం కనిపిస్తున్నదా?

5. ఉదాహరణకు రామాయణ కాలం తీసుకుందాం. ఆనాటి మానవ గుణశీలాలతో ఈనాటి మానవ గుణ శీలాలను పోల్చి చూద్దాం, స్త్రీ లోలత్వం, వాగ్దాన భంగం, పుత్ర వ్యామోహం, పక్షపాతం, మోసం, దగా, పగా వగైరా దుర్గుణాలలోనూ, స్త్రీ అపహరణలు, రేపులు, దొంగదెబ్బలు, అధర్మ యుద్ధాలు, శీల శంకలు, బంధు మిత్ర భ్రాతృ ద్రోహాలు వగైరా దుర్మార్గాలలోనూ ఈనాటి ప్రజాస్వామిక రాజకీయ పెత్తందార్లు ఆనాటి రామాయణ ప్రముఖ పాత్రల కంటె ఏం తక్కువ?

6. వేల సంవత్సరాల పూర్వపు రామాయణ కాలం నాటి మనుషుల కంటే ఈ నాటి ప్రజాస్వామికంలోని మనుషులు ఏ విధంగా ఉత్తములు?

సూక్ష్మంగా పరిశీలించి చూస్తే, గుణ శీల ప్రవర్తనల స్వభావంలో ఆదిమ కాలపు అనాగరిక మానవు డే స్థాయిలో వుండేవాడో, ఈనాటి అణు విజ్ఞానపు నాగరిక మానవుడు అదే స్థాయిలో వున్నాడనేది వాస్తవం. మౌలికమైన మార్పు ఏదీ రాలేదు.

అవే భావాలు, అవే స్వార్థాలు, అవే ఆవేశాలు, అవే రాగద్వేషాలు, అవే మోసాలు, అవే పోరాటాలు, అవే స్వపర భేద పక్షపాతాలు. ఏ మార్పూ లేదు.

ఆదిమ కాలానికీ, అణు యుగానికీ, సనాతనత్వానికీ, ఆధునికతకూ, ఆనాటి అహ ల్యకూ, ఈనాటి అంజనమ్మ (నిమజ్జనం సినిమా హీరోయిను)కూ ఏమిటి తేడా?

ఆయుధం అదే. దాని రూపంలోనే తేడా! మానవ హింస అదే. ఆయుధ ప్రయోగం లోనే తేడా!

కాగా, ఏ దేశంలోకాని, ఏ కాలంలో కాని, తరం తర్వాత తరంగా – వృద్ధుల కంటె యువకులు సాధిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకొనే అభ్యుదయం ఏముంది? ఏం లేదు.

తాతగారి అడుగుజాడల్లోనే మనుమడు నడుస్తున్నాడు. అవ్వగారి ఆచారాలనే మనుమరాలు అనుసరిస్తున్నది. వేల సంవత్సరాల క్రితం పుట్టి పోయిన ప్రవక్త గారి తెలిసీ తెలియని సూత్రాలనే ఈనాటి అత్యాధునిక సైన్సు విద్యార్థి పట్టుకు వేలాడుతున్నాడు. ఇంకెక్కడి ప్రగతి. ఇంకెక్కడి అభ్యుదయం?

ఇక్కడ నేను చెప్పదలచిన విషయం క్లుప్తంగా ఇది–

(1) సనాతనత (Orthodoxy), ఆధునికత (Modernity) అనేదేం లేదు.

(2) జ్ఞాని, అజ్ఞాని, శక్తి, అశక్తి, బలవంతుడు, బలహీనుడు, క్రూరుడు, దయాళువు, స్వార్థపరుడు, దానశీలుడు, కలవాడు, లేనివాడు అనే భేదాలు తప్ప, మనిషికి జాతి మత వర్గ వర్ణ పరమైన భేదాలేం లేవు.

(3) మానవ బీజాణు నిర్మాణంలోనే సహజ సిద్ధమైన మౌలిక పరిణామం ఏర్పడ కుండా, మానవుడి గుణశీల ప్రవర్తనలు మారవు. దేశకాల పరిస్థితుల కనుగుణంగా తన ముట్టడి, రక్షణ, వ్యూహ, కుచాదుల్ని మార్చుకొంటూ వుంటాడంతే.

(4) మనిషి మారాలంటే అతడి జీవ లక్షణమే మారవలసి వుంది. అంతవరకు మనిషి మనిషే. అతడి మనుష్యత్వంలోని ఉద్దేశాలు, ఆవేశాలూ (feelings & emotions) అలానే వుంటాయి.

(5) మనిషి పరిణామ క్రమంలో తరువాతి మెట్టు మహేశ్వరత్వం. అది ఎప్పుడో, పరిణామ క్రమంలోనో, హఠాత్తుగానో జరగవలసి వుంది. సర్వజీవ సములూ, దయాధర్మ నిధులూ, జ్ఞాన జ్యోతిర్మయులూ, లోక సామస్త్య కళ్యాణ కాములూ అయిన

పరమ సాధువుల నుంచి అట్టి మహేశ్వర జీవజాతి మొగ్గదొడగ వలసి వుంది. అట్టి పరమోత్తమ జీవజాతి సృష్టికి మార్గం సరళతరం చెయ్యడం మొత్తం మీద నా సాహిత్య కృషికి లక్ష్యం. ప్రధానంగా ఈ వ్యంగ్యాత్మక మినీ కవితల ప్రకటనకు తక్షణ ప్రయోజనం అదీ.

## మనిషి మనిషే

లోకంలోని వివిధ మానవుల గుణకర్మలను పరిశీలిస్తూ వున్నప్పుడు నాకొక సత్యం గోచరిస్తూ వుంటుంది. అది – డార్విను మహాశయుడి పరిణామ సిద్ధాంతం సవరించవలసి వున్నదనేది.

ఎంతో పరిశీలన తర్వాత, నేను ప్రతిపాదిస్తున్న సిద్ధాంతం ఇది –

మానవ జాతి అంతా ఏదో ఒక్క జంతు (మర్కట) జాతి నుంచి పరిణమించిన జాతి కాదు. ఏదో ఒక్క ప్రాంతంలో పుట్టిందీ కాదు.

ఒక్కొక్క జాతి జంతువు నుంచి ఒక్కొక్క జాతి మానవుడు పరిణమించాడు. వాళ్ల వాళ్ల గుణ కర్మలను, చేష్టలను, ప్రవర్తనలను, ఆలోచనలను పరిశీలించి చూడండి. ఒకో మనిషి ఒకో జంతువుకు వారసుడైనట్టు స్పష్టపడుతుంది.

ఇక్కడ జాతి అంటే నా ఉద్దేశం ట్రైబ్ (tribe) అని గాని, రేస్ (race) అని గాని కాదు. జాతి అంటే ఒకొక జంతు జాతి అని నా ఉద్దేశం. ఏ ట్రైబుకు, ఏ రేసుకు చెందిన వాడైనా సరే, ఒకో మనిషి వ్యక్తిగా ఒకో జంతు జాతికి చెందిన వాడని నా సిద్ధాంతం.

ఒక తల్లిదండ్రులకు పది మంది సంతానం వుంటే, ఆ పది మందీ పది జంతు జాతులకు చెంది వుండే అవకాశం వుంది. ఒకడు కుక్కలా ఎవరికో విశ్వాస పాత్రుడుగా బ్రతుకుతాడు. మరొకడు పులిలా రౌడీగా తిరుగుతాడు. వేరొకడు ఎద్దులా కాయకష్టం చేసుకుంటూ గడుపుతారు. ఇంకొకడు మనిషిలా పరోపకారిగా జీవిస్తాడు. ఈ మనిషిలా బ్రతికే వాడే నిజమైన మానవుడు. జంతుస్థితి నుంచి మానవ స్థితికి సంపూర్ణంగా పరిపూర్ణంగా పరిణమించిన వాడు.

తక్కిన వాళ్లంతా ఆయా జంతు వాసనలు వదలని వాళ్లే. అయితే ఈనాడు ఈ జంతు ప్రకృతులే మెజారిటీ కనుక - సిసలైన మానవుడు నూరు కాకుల్లో ఒక కోకిల వలె ఉపేక్షకు, హింసకు, అవమానానికి గురవుతున్నాడు.

జంతు సహజమైన ఉద్రేకాలు, దురాక్రమణలు, హింసలు, కామాంధతలు, పాము పగలు, హత్యలు ఇవన్నీ అందరు యువకుల్లోనూ, అన్ని కాలాల యువకుల్లోనూ వుంటున్నై.

వాళ్లు క్రమంగా వృద్ధులైపోతూ వున్నారు. కొత్త యువకులు పుట్టుకొస్తూ వున్నారు. మిడిసి పడుతున్నారు. వాళ్లూ వృద్ధులైపోతూన్నారు. పుట్టడం, విర్రవీగడం, వృద్ధులు కావడం, చావడం తప్ప ఇన్ని యుగాలుగాను ఈ నెత్తురు వుండే యువకులంతా ఏం వుద్ధరించినట్టు?

కొన్ని వేల సంవత్సరాల పూర్వం, కృతయుగంలో, ఇంద్రుడు అహల్యను రేపు చేశాడు. రావణుడు రంభను రేపు చేశాడు. మరి ఈనాడు? ఈ రకమైన దురంతాలు మరీ ఎక్కువై పోలేదా? మనం రామాయణ కాలంనాటి కంటె నైతికంగా ముందుకు వెళుతున్నామంటారా? వెనక్కి వెళుతున్నామంటారా?

నెత్తురు పొంగులెత్తే ఆ కొద్ది సంవత్సరాల పాటు తోకలెత్తి గంతులేస్తూ అనుభవజ్ఞులూ, జ్ఞాన వృద్ధులూ అయిన మేధావులను ముసలి తాతయ్యలంటూ అవహేళన చేస్తూ - క్షణికా వేశాలతో బస్సుల మీదా, గురువుల మీదా, అమ్మాయిల మీదా రాళ్లు విసురుతూ పరుగులు తీసే యువకులు తమ యౌవనంలో సాధించిందీ, సాధిస్తున్నదీ ఏమిటి?

నవనాగరిక విద్యావంతుడైన నేటి యువకుడు ఈ ఒక్క ప్రశ్నా వేసుకొని జవాబు చెప్పుకోవాలి. ''నా తండ్రి కంటె, తాత కంటె, ముత్తాత కంటె నేను సాధించిన మానవాభ్యు దయం ఏమిటి?''

తన తండ్రి తాతకు తద్దినం పెడుతున్నాడు. తాను తండ్రికి తద్దినం పెడతాడు. అంతే కదా?

ఈ దేశంలో - పిచ్చిపనులూ, వెర్రి కేకలూ తప్ప, ఇన్ని శతాబ్దాలుగా మన యువకులు సాధించిందేమీ లేదు. ఈ సత్యాన్ని గుర్తింప జేయడం కోసమే ఇంతగా చెప్పుకొచ్చాను.

యువకులు తమాయించుకొని, ఆలోచనతో ముందుకు సాగవలసి వున్నదనేదే నా ఉద్బోధ.

ధనార్జనకూ, దర్పానికీ, అధికారానికీ, అవినీతికీ పరిమితులున్నై. తస్మాత్ జాగ్రత్త!

వేద యుగం నుంచి నేటి దాక మనిషి ప్రవర్తనలో, ప్రకృతిలో, ఆలోచనలో, ఆచరణలో ఏవిధమైన మార్పూ లేదు. మానవుడు ఉత్తమ మానవుడుగా పరిణమించాలి. అందుకు విప్లవాత్మకమైన మార్పు రావాలి. అందుకోసం ధర్మసేన ఏర్పడాలి.

నీతి సూత్రాలు, సుభాషితాలు, సామెతలు, నానుడులు మొదలైన జీవితానుభవ నిత్యసత్యాలు వేలకొలదీ, లక్షల కొలదీ వున్నై మన వాఙ్మయం నిండా. అందులో ఒక్కటైనా అమలు జరుగుతున్నదా అనేది నా ప్రశ్న.

సమాజం కొన్ని హద్దులకు కట్టుబడి వున్నదంటే, మానవుడు కొన్ని నియమాలను పాటిస్తున్నాడంటే, అందుకు కారణం ప్రతి క్రియా భయం మాత్రమే.

తా నొకటి కొడితే అవతలి వాడు రెండు కొడతాడనే భయమే మనిషిని అదుపులో వుంచుతున్నది. అదే సమాజ వ్యవస్థకు పునాది అయింది. మనిషి ఒక్క భయానికి మాత్రమే లొంగుతాడు. ఈ సత్యాన్ని పురస్కరించుకొని ఏర్పడినట్టివే పోలీసు, మిలిటరీ వ్యవస్థలూ, శిక్షా స్మృతులూ.

సారాంశం ఏమిటంటే - ఎంతమంది మేధావులు, ఋషులు ఎన్నెన్ని జీవిత సత్యాలను, సుభాషితాలను ప్రకటించి హెచ్చరించినా, మానవుడు ఇంతవరకు నైతిక జీవి కాలేకపోయాడు. ధర్మజ్ఞాని కాలేక పోయాడు. జంతు ప్రవృత్తిని వదులు కోలేక పోయాడు. పైపెచ్చు - జన సంఖ్య పరిమితిని దాటి పెచ్చరిల్లడం వల్ల - తిండి కోసం, తిండిని కొనగల డబ్బు కోసం నీతి నియమాలన్నిటినీ వదిలేసుకొని ఏ గడ్డినైనా కరవడానికి సిద్ధపడుతున్నాడు.

అందుకే నేను హెచ్చరిస్తున్నాను. ఆగండి! ఆగి ఆలోచించండి! మనం ముందుకు పోతున్నామా? మళ్లీ పశు దశలోకి తిరోగమిస్తున్నామా?

## వర్ణాశ్రమాలు - నాడు, నేడు

రాజరికం, సార్వభౌమత్వం, నియంతృత్వం ప్రజాపాలన చేసినప్పుడు - పరిపాలించే ప్రభు సింహుడు, ప్రజా గోవుల మంద మధ్య విగ్రహంతో అయినా నిలువ గలిగాడు కాని-

ఈనాడు ప్రజాస్వామికంలో గోవుల మంద మధ్య విహరిస్తున్నది ఒక్క సింహరాజే కాదు. వందలకొలదీ ఉప సింహాలు! వేల కొలదీ తోడేళ్లు! లక్షల కొలదీ నక్కలు!

ఆశ, స్వార్థం, ధనసేకరణ - తప్ప ఈనాడు పాలకులకు మరో ధ్యాస లేదు. మరో పని లేదు. దేశ శ్రేయస్సు, ప్రజా సంక్షేమం, పరోపకారం, ఔచిత్య జ్ఞానం, సహృదయత, మానవత్వపు విలువల పరిగణన - ఏం లేవు.

దేశాన్ని, దైవాన్ని, జ్ఞానాన్ని సొంతం చేసుకొని, వాటిని ప్రజలకు లేకుండా చేశారు బలవంతులైన దురాక్రమణదారులు. వేద కాలంలో వర్ణ వ్యవస్థ లేదు. ప్రకృతి శక్తులను ఆరాధిస్తూ ఋషులు ఎవరికి తోచిన భావాలతో వారు గానం చేశారు. ఆ భావాలు వారి వారి ధ్యాన సమాధి నుంచి వచ్చినందువల్ల, వాటిని అపౌరుషేయాలన్నారు.

ఆ తర్వాత - ప్రకృతికి అతీతమైన, ప్రకృతినే నడిపిస్తున్న ఒక పరమ శక్తి ఉన్నదన్న సత్యాన్ని అరణ్యాలలో తపస్సు చేసుకుంటున్న ఋషులు గుర్తించారు. ఆ పరమ శక్తే పురుష శక్తి, సృజన శక్తి, బ్రహ్మ అన్నారు. బ్రహ్మను గుర్తించడమే బ్రహ్మ జ్ఞానం. బ్రహ్మ జ్ఞానం కల వాళ్లను బ్రాహ్మణులు అన్నారు.

బ్రాహ్మణము, బ్రాహ్మణ కులము, బ్రాహ్మణ మతము మొదలైనవన్నీ "బ్రహ్మ" అనే మాట నుంచి పుట్టినవే. అర్థాలు మాత్రం వేరు వేరు. బ్రాహ్మణము అంటే బ్రహ్మ జ్ఞానం గురించి చెప్పే శాస్త్రం. బ్రాహ్మణ కులం అంటే ఈనాడు హిందూ సమాజంలో వున్న అనేక కులాలలో ఒకటి. బ్రాహ్మణ మతం అంటే వర్ణాశ్రమ ప్రాతిపదికగా కల ఒక మతం.

బ్రాహ్మణుడు అంటే పూర్వకాలంలో వుండే అర్థం బ్రహ్మజ్ఞానం కలవాడు అని. అందుకే ఆ కాలంలో ఎక్కడ ఎలా పుట్టిన వాడైనా, బ్రహ్మజ్ఞానం కల ప్రతివాడూ బ్రాహ్మణు డైనాడు. తపస్సు చేసిన ప్రతివాడూ ఋషి అయినాడు. పుట్టుకతో కులం ఏర్పడడమనేది లేనే లేదు. కుల వ్యవస్థ, వర్ణ వ్యవస్థ ఆనాడు లేనే లేవు.

వర్ణ ధర్మాలంటే వృత్తి ధర్మాలు. ఎవరు ఏ వృత్తిని చేబట్టిరో వాళ్లు ఆ వృత్తి నీతి నియమాలను పాటిస్తూ, అందులో పూర్తి నైపుణ్యాన్ని సాధించాలి. సాధారణంగా వృత్తిని మార్చగూడదు. తాను ఎన్నుకొన్న వృత్తిలో విఫలుడై, మరొక వృత్తిలో ప్రబలుడైన వ్యక్తి వృత్తిని మార్చుకోవచ్చు. అంటే వర్ణాన్ని మార్చుకోవచ్చు.

అలాంటి మార్పిడులు అసాధారణ ప్రతిభావంతులైన వ్యక్తుల విషయంలోనే జరుగు తుండేవి. కాలేజీలు, ప్రభుత్వోద్యోగాలు లేని ఆనాటి గ్రామ స్వరాజ్యపు రోజులలో సామాన్య ప్రజలకు అలవాటైన కులవృత్తే ఫలప్రదంగా, సుభద్రంగా వుండేది. గొప్ప ప్రతిభావంతులు, సాహస వంతులు, మహర్షులు మాత్రమే కులవృత్తిని ధిక్కరించి అతీత శక్తితో భాసించ గలిగే వాళ్లు.

ఆశ్రమ ధర్మాలు సాంఘిక జీవితానికి సంబంధించి నట్టివి. వర్ణ ధర్మాలను, అంటే వృత్తి కర్తవ్యాలను అనుసరించి జీవిస్తూ, ప్రతి వ్యక్తీ కూడ తన సాంఘిక కర్తవ్యాలను యథావిధిగా నిర్వహించవలసి వుండేది.

చదువు, శిక్షణ పూర్తయ్యేదాకా ప్రతి యువకుడూ నిష్ఠగా బ్రహ్మచారిగా జీవించ వలసి వచ్చేది. అది చాల గొప్ప పద్ధతి. విషయ వాంఛలు మనస్సును చలింప చేస్తాయి. ఏకాగ్రత కుదరదు. చదువు నాశన మవుతుంది. బ్రతుకు సాఫీగా నడవదు. చెడుదారులు తొక్కుతాడు. సామాజిక శాంతి సౌఖ్యాలలో తన భాగస్వామ్యాన్ని పోగొట్టుకుంటాడు.

చిన్నతనంలోనే అమ్మాయిల మీదకు దృష్టి మరల్చే వాడు చదువును పోగొట్టుకుంటాడు. లేత వయసులోనే సెక్సులో పడేవాడు పడుచుదనంలోనే ముసలివాడై, నపుంసకుడై యౌవన దివ్య సుఖాలకు దూరమైపోతాడు.

చదువుకొని, వ్యాయామం చేసి, మానసికంగానూ, శారీరకంగానూ బలపడవలసిన టైంలో కర్తవ్యాన్ని వదిలి చెడు తిరుగుళ్లు తిరగడం పిచ్చిగా ఆత్మహత్య చేసుకోవడమే. అలా చేసుకొన్న మూర్ఖులే ఆ తర్వాత పెళ్లంటే భయపడేవాళ్లూ, పెళ్లామంటే భయపడే వాళ్లూ.

ఇరవై ప్రాంతపు వయసులో ఎవతె వెంటనో పడి రేప్ చెయ్యాలనుకొన్నవాడు (లేక, చేసిన వాడు) ఆ తర్వాత అందమైన సొంత పెళ్లాంను ఏమీ చెయ్యలేక ఏడుస్తాడు. ఎందు కని? బ్రహ్మచర్య ఆశ్రమ ధర్మాలను పాటించనందువల్ల.

యథావిధిగా బ్రహ్మచర్య వ్రత విధిని పాటించి చదువు ముగించుకొన్నవాడు గృహస్థు అవుతాడు. అతడి గృహస్థాశ్రమ ప్రవేశం అర్జునుడి కురుక్షేత్ర యుద్ధ రంగ ప్రవేశం లాంటిది. సర్వ సన్నద్ధమైనట్టిది. అపజయమే లేనట్టిది.

లౌకిక సుఖాలన్నీ అనుభవించిన తర్వాత, రిటైరు కావడం వాన ప్రస్థం. మోక్ష సాధనకు చేసే సర్వసంగ పరిత్యాగం సన్యాసం.

ఈ వర్ణ ఆశ్రమ ధర్మాలను వ్యక్తి యొక్క గుణ, కర్మ భేదాలను బట్టి అనుసరించాలి.

కుబేరుడూ, రావణుడూ ఒకే తండ్రి బిడ్డలు. గుణ కర్మలను బట్టే కదా ఒకడు దేవత అయితే, మరొకడు రాక్షసుడైనాడు?

శంకరాచార్యుడు ఎనిమిది సంవత్సరాల బాల వయస్సులోనే సన్న్యాసి అయినాడు. దశరథుడు పండు ముసలితనంలో కూడ పుత్రవాత్సల్య విమోహితుడై చచ్చిపోయాడు.

గుణ కర్మలను బట్టే వర్ణాశ్రమ ధర్మాలుంటై. వ్యక్తి స్వేచ్ఛకు భారతీయ వైదిక విజ్ఞానం యిచ్చిన విలువ ఇది. వేద, ఉపనిషత్, ఆరణ్యక (బ్రాహ్మణ) సాంప్రదాయం ఎంత కాలం నడిచిందో చెప్పలేం.

ఆ తర్వాత మానవ పరిణామ క్రమంలో ఏం జరిగిందో ఏమో! పూర్వ విజ్ఞానం అంతా మరిచిపోబడి, స్మృతి కర్తల పేరిట అమానుష, ఆత్మ వంచక, జాతి విద్రోహక

రచనలు పెచ్చురేగి, ఆర్ష వమౌలిక విజ్ఞానం మట్టి గొట్టుకు పోయింది! ప్రగతి మూర్ఛపోయింది. ఈ నాటికీ మేలుకోలేదు!

స్మృతుల పుట్టుక నాటి పరిస్థితి ఈ 1996 నాటి పరిస్థితిని పోలి ఉండి వుంటుందని నేననుకొంటున్నాను. అదే స్వార్థం. అదే పరహింస, అదే అవ్యవస్థ.

"ఎంత చదువు చదివి ఏ నీతి విన్నను
హీను డవ గుణమ్ము మాన లేడు"

అనే వేమన్న పద్యంలోని రెండవ చరణాన్ని కొంచెం మార్చి "మనుజు డవగుణమ్ము మానలేడు" అంటే సత్య సమ్మతంగా వుంటుందని నా వుద్దేశం. హీనుడు అనేది సాపేక్షక (రిలెటివ్) పదం.

భూస్వామి దృష్టిలో వ్యవసాయ కూలీ హీనుడు. వ్యవసాయ కూలీ దృష్టిలో భూస్వామి హీనుడు. విభూతిరేఖలో, పంగనామాలో పెట్టుకొని కూర్చునే బ్రాహ్మణ పురోహితుల దృష్టిలో ఈ శూద్రులిద్దరూ హీనులే.

నిజానికి ఆంగ్లేయుడైన బ్రౌను మహాశయుడు పూనుకొనే నాటి దాకా బ్రాహ్మణ పండితుల దృష్టిలో వేమన్న కూడ హీనుడుగానే వుండి పోయాడు కదా!

ఉత్తమ జాతి–హీనజాతి, ఉత్తమ కులం–హీనకులం, ఉత్తమ వృత్తి–హీన వృత్తి అనే విభజన స్వార్థంతో కూడుకొన్నట్టిది. అధికార దౌర్జన్యం కారణంగా మానవ సమాజంలో బలవంతంగా ప్రవేశించిన అధర్మం అది. అందుకే హీన శబ్దం సముచితం కాదు. మనుజ శబ్దమే అక్కడ అతికేది.

మానవ జాతి పుట్టుక మొదలు నేటి దాకా ఏ విధంగానూ మారలేదు. అభివృద్ధిని సాధించలేదు. ఒక మహావృక్షంలా ఎదుగుతూ విస్తరిల్లుతూ వస్తున్నది. భూమికి, సృష్టికి భారంగా తయారవుతూ వున్నది.

ఇది ఇక నాశనమైపోవడమైనా జరగాలి. దీని నుంచి మరో నవ ఉత్తమ దివ్య జీవి ఉద్భవించడమైనా జరగాలి. ఇప్పుడున్న మానవుడు – వున్నవాడు వున్నట్టుగా ఏమీ చెయ్య లేడు. ఏ పనికీ పనికి రాడు. స్వభావంలో ప్రవృత్తిలో ప్రవర్తనలో మార్పు రావలసి వుంది.

# ఏమిటి కథ?

ఈ నఖక్షతాలకు ఒక కథా లేదు, ఒక క్రమమూ లేదు.

సహజమే కదా!

ఉత్సాహం, ఉద్రేకం, ఆవేశం, ఆవేగం – ఈ విధంగా రసోద్వేగం పెరిగే కొలదీ ఏ నఖం ఎక్కడ గుచ్చుకొంటుందో ఎలా చెప్పడం? క్రమరాహిత్యమే నఖక్షతాల సహజ క్రమం.

ఏదో మానసిక ధోరణిలో, ఏదో సన్నివేశంలో ఏదో ఒక ఛలోక్తి విసురుతాం. అది కొందరికి హాస్యోక్తి అవుతుంది. కొందరికి మర్మ భేదకం అవుతుంది. తన రహస్యం ఏదో తెలిసే అతడలా అన్నాడని అలాంటి గురివింద గింజ అనుకుంటాడు. అలాంటి గురివింద గింజలలో సహృదయులు ఆ ఛలోక్తి తమకి గుచ్చుకొన్నా నవ్వేసి వూరుకుంటారు. ఆత్మ పరిశీలన చేసుకొని తమను తాము సరిదిద్దుకోడానికి ప్రయత్నిస్తారు. కనీసం పట్టుపడకుండా వుండేందుకైనా జాగ్రత్త పడతారు. అప్పుడా ఛలోక్తి వ్యంగ్యోక్తి అవుతుంది. మిత్ర సమ్మితమో, కాంతా సమ్మితమో అవుతుంది. ఇక్కడ ఈ నా కావ్య పరంగా నఖక్షతం అవుతుంది.

అలాంటి గురివింద గింజలలో పగబట్టే పాపగుణం గల రాజకీయ గ్రహాలు వున్నారనుకోండి. అప్పుడు నఖక్షతాలు దంతక్షతాల తీవ్రతను కూడ దాటిపోయి కత్తులూ, బరిసెలూ, తుపాకి గుళ్లూ కూడా అవుతాయి. అందుకే విరసులకూ, అరసికులకూ, అధికార మత్తులకూ, ధన గర్వాంధులకూ, కుల మత వ్యాపార కుక్షింభరులకూ కవిత్వం వినిపించ వద్దనేది రుషి వాక్కు. అయితే, వినిపించకుండా వుండడం న్యాయమా? వాళ్లు మాత్రం మారవద్దా? మానవులు కావద్దా? మానవుణ్ణి దివ్యత్వానికి ఎత్తే సాహిత్యాన్ని, సంస్కృతిని, కళలను, రసా నంద భాగధేయాన్ని, కుల మత ధన అధికార మాత్రోప జీవులై మిడిసి పడుతున్న వారి నుంచి దూరంగా వుంచి వేయడం మంచిదా?

''పంది ముందు ముత్యాలు పోసినట్లు'' అనేది ఒక ఇంగ్లీషు సామెత. ''ఆకలితో చస్తున్న వాడికి వేదాంతం చెప్పడం'' అనేది మరొక ఇంగ్లీషు సామెత.

ఈ నఖక్షతాలు ముత్యాలూ కావచ్చు. బ్రహ్మ సూత్రాలూ కావచ్చు. నా దృష్టిలో మానవులంతా ఒక్కటే కనుక, ఇవి ప్రతి మానవుడి ఆత్మ వికాసానికీ అవసరమైన అన్నం మెతుకులు కావాలని నా ఆకాంక్ష.

ఇవి వ్యంగ్య వైభవాలు కనుక, బి కాంప్లెక్సు బిళ్లల వలె మానవ జాతి సర్వతోముఖ అభివృద్ధికి ఉపయోగపడగలిగితే, నేను ఇంకా ఎక్కువగా సంతోషిస్తాను.

ఈ నఖక్షతాలకు ఒక క్రమం లేదు. అక్కర లేదు. సరే, మరి, కథ మాట?

ప్రతి మానవ జీవిత కథా ఈ నఖక్షతాలకు ఒక కథే. ఒక ఇతి వృత్తమే.

ఒకో నఖక్షతం ఒకో జీవితం అని కూడ చెప్పవచ్చు. విశ్లేషించి వివరించి చెప్పగలిగితే, ఒకో నఖక్షతం ఒకో జీవిత కథే అవుతుంది. మౌలిక ప్రతిభా వ్యుత్పత్తులు కల పండితులు ప్రయత్నించి చూడవచ్చు. (కుల తత్వ విద్వేష సైంధవు డెవడైనా అడ్డం కాకపోతే).

## ఏ నఖ క్షతమైనా తీసికోండి

(1) దానిలోని వ్యంగ్యంవల్ల రసానందం కలిగితే ఆ వ్యక్తి స్వచ్ఛమైన ఉత్తమ జీవితం కలవాడన్నమాట.

(2) ఆ వ్యంగ్యం ఏ విధంగా నైనా మర్మ భేదకమై, తనలోని లోపాన్ని లేక అక్రమాన్ని ఎత్తి చూపితే, అతడు ఆత్మ పరిశీలన చేసికొని తనను తాను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తే – ఆ వ్యక్తి ఉత్తమ మానవ లక్ష్యం కేసి పయనిస్తున్న మధ్యముడన్న మాట.

(3) అది మర్మ భేదకమై గుచ్చుకొన్నప్పుడు, అతడు కోపోద్రేకంతో కన్ను మిన్ను కానని విధంగా చిందులు తొక్కాడంటే – ఆ వ్యక్తి పులితోలు కప్పుకొన్న గాడిదలా, గోముఖ వ్యాఘ్రంలా మానవ శరీరంలో బ్రతుకుతున్న ఏదో జాతి జంతువున్నమాట.

ఇందులోని ఒకొక్క నఖక్షతాన్ని ఈ విధంగా విశ్లేషిస్తూ, వ్యాఖ్యానిస్తూ సమకాలీన ప్రముఖ వ్యక్తుల జీవితాలను నిర్భయంగా ఉదాహరిస్తూ ఏ సాహితీ బ్రహ్మ అయినా కలం పట్టి రంగంలోకి దూకితే – ఈ నఖక్షతాలు ఒకొక్కటి ఒకొక్క వాస్తవ రసావిష్కారక జీవిత చరిత్రే అవుతుంది.

ఆధునికతా దృక్కోణం నుంచి చూస్తే – ఈ నఖక్షతాలకు కథా లేదు, కమామీషూ లేదు. వీటికే కాదు, ఏ నఖక్షతాలకూ ఈ కాలంలో కథ లేదు. కమ్మదనం లేదు. మనోజ్ఞత లేదు. మధుర బాధ లేదు. పాశవికమ్మైన సెక్సు తప్ప, రాగ మధురమ్మైన శృంగారం లేదీనాడు.

ఈనాటి యువకులలో అధిక భాగం రాజకీయులు, కోడి పుంజులు. ఆరాటాలు, పోరాటాలూ తప్ప మరేవిధమ్మైన ఉన్నత విలువలూ లేని వాళ్లు. ఉద్రేకాలు ఎక్కువ. ఉద్యోగాలు తక్కువ.

నిజమే మరి. బ్రతుకు తెరువు కోసం ఉరుకులూ, పరుగులూ మధ్య ప్రశాంతత ఎక్కడుంటుందీ? సరదాగా, తీరికగా సౌందర్యారాధనకూ, శృంగార క్రీడలకూ, రసాస్వాద నకూ, అవకాశం ఎక్కడుంటుందీ?

పాపం ఆధునికులు! కాలం గడుస్తున్న కొలదీ మానవులలో, ముఖ్యంగా యువకు లలో ఆనందానుభవ అవకాశాలు పలచబడిపోతున్నై. తిండి కోసమే బ్రతుకుతున్నారా అని పిస్తున్నది.

తిండి కోసం డబ్బు కావాలి. ఎన్ని దురంతాలకైనా పాల్పడి డబ్బు గడించడం అనేదే జీవిత పరమార్థంగా కనకపు సింహాసన మెక్కేసింది.

ఈ దుస్థితి నంతా క్లుప్తంగా తేట తెలుగులో చెప్పాలంటే – మానవ జాతి మధుర జీవితానికి భావ కవుల యుగమే క్లైమాక్సు. అక్కడి నుంచి పతనం ప్రారంభమ్మై, అతివేగంగా పాశవిక దశకు పడిపోతున్నది!

ఈ పాతిత్యాన్ని నిగ్రహించగల మహాశివుడు ఏడీ? ఎక్కడ?

జీవితంలో ప్రతి పదార్థమూ రెడీమేడ్‌గా కావలసి వస్తున్న కాలమిది. అన్నం పొట్లాలు, కుట్టిన దుస్తులు, ఇన్‌స్టెంట్ కాఫీలు వలెనే సెక్సు కూడ యాంత్రికంగా

అక్కడికక్కడ కావలసి వస్తున్నది. అది రక్తమాంస మానసాలు కల స్త్రీయో, రేబట్టో, రబ్బరు బొమ్మో వివేచన అక్కర లేదు. తన ఉద్రేకం చల్లారడం నేటి పురుషుని లక్ష్యం!

తాను, తన ఆకలి, అది తీరడం – ఇదే ఈనాటి మానవుడి జీవిత చరిత్ర.

చస్తున్న ముసలి వాడికి పడుచుపిల్ల ముఖారవిందం దేనికి? ఏ నిమిషంలో పదవి పోతుందో అని భయపడుతున్న నాయకుడికి నీతితో పనేమిటి?

అందుకే ఈనాడు రాజకీయ క్షేత్రంలోకి దూకి అందిన కాడికి నొల్లుకొంటున్నాడు ప్రతి ఒక్కడూ – విద్యార్థి, ఉపాధ్యాయుడు, ఉద్యోగి, వ్యాపారి, కంట్రాక్టరు, నాయకుడు అనే భేదం లేకుండా!

దోపిడీ హడావుడిలో మంచి చెడ్డలకు, మాన మర్యాదలకు, అభిరుచులకు, ఆనందాలకు తావుండదు.

నిజమే, ఈనాడు ప్రతి వాడి బ్రతుకూ అస్థిరంగానే వుంది. అరక్షితంగానే ఉంది. రామాయణ కాలంలో మునిపల్లెలకు రాక్షసమూకల దాడుల బెడదలా ఈనాడు ప్రజలకు రాజకీయాల పీడ దుర్భర మవుతూ వుంది. నిజమే. అయితే ఈ దుస్థితి ఎంతకాలం ఇలా కొనసాగుతుంది? మరణశయ్య మీద రోగి ఎంత కాలం అలా వుండగలుగుతాడు?

## దృక్పథమే మారాలి

బ్రతకడం కోసం చచ్చేదాకా పోరాడడం జీవ లక్షణం. పుట్టుక నుంచీ కూడ జీవికి చావు అనేది నీడ, ఎల్లప్పుడూ కూడానే వుంటుందది. అందుకే జీవి నిత్య జాగరూకుడై తన రక్షణలో తాను వుంటూ వుంటాడు. బ్రతకడానికి ప్రధానంగా కావలసింది ఆహారం. కోటి విద్యలైనా కూటి కోసమే. కోటి దోపిడీలైనా కూటి కోసమే. కోటి పన్నులైనా కూటి కోసమే.

కూడు దొరకడం ఒక పెద్ద సమస్య కానప్పుడు కళలూ, కాంతులూ, జ్ఞానమూ, విజ్ఞానమూ వికసిస్తై. వాటికి ఏకాంతమూ, ఏకాగ్రతా, ధ్యానమూ, తపస్సూ అవసరం. ప్రయత్నం లేకుండా ఆహారమూ, అవసర సౌకర్యాలూ లభించిన ప్రతిభావంతులే అట్టి

ఉన్నత విద్యలను సాధించగలుగుతారు. మానవ సమాజాన్ని ముందుకు నడిపించ గలుగుతారు.

ఎవరెన్ని చెప్పినా, ఎవరెంత అరిచినా సత్యం సత్యమే. ఇదిగో అది.

(1) నీవు గొడ్డలి పుచ్చుకొని నరుకుతానని మోర సాచి నిలబడి భయపెట్టినా, నిమ్మ చెట్టుకు మామిడి కాయలు కాయవు.

(2) ఏ పూట తిండిని ఆ పూట కాయకష్టం చేసి సంపాదించుకోవలసిన పార్థివ మానవుడు ఏ విధమైన అభ్యుదయాన్నీ సాధించలేడు.

(3) కార్మికుడు, కర్షకుడు, వర్తకుడు, పారిశ్రామికుడు, పదవీ పాలుడు, పైరవీ కారుడు – వీళ్లెవళ్లూ మానవ మిత్రులు కారు. స్వలాభం కోసమే ఆయా పనులు చేస్తున్న వాళ్లు.

(4) తిండి దొరక్క మాడవలసి వస్తుందేమో అన్న భయమూ, బెంగా వుండి కూడ – కళలనూ, కాంతులనూ, జ్ఞానాన్నీ, విజ్ఞానాన్నీ సృష్టించి, ఉద్ఘాటించి, ప్రకటించి, మానవ జాతిని మరో మజిలీకి చేర్చాలన్న ఆత్రంతో, దీక్షతో, మనోమగ్న తన్మయత్వంతో కృషిచేసే తపస్వులే మానవ మిత్రులు. అట్టి వాళ్ల కృషి వల్లనే మానవ సమాజం ఈ మాత్రమైనా పెరుగుతూ వచ్చింది.

(5) కోట్ల ప్రజల మనుగడలను శాసించే రాజ్యాధినేతల కంటె అలసిన హృదయాలను సేద దీర్చగల ఒక పద్యాన్ని వ్రాసిన కవీ, ఒక పాటను పాడిన గాయకుడూ, ఒక యంత్రాన్ని కనిపెట్టిన విజ్ఞానీ గొప్పవాళ్లు.

(6) ఏ రౌడీ అయినా పట్టపగ్గాలు లేకుండా స్వైర విహారం చేస్తున్నాడంటే అందుకు కారణం అతడి భగ్న హృదయమే. ఏదో ఒక జీవిత సన్నివేశంలో, పరీక్షలో ఓడిపోయిన వాడు అట్టి ఓటమిని స్పోర్టివ్ (విక్రీడితం)గా తీసుకోలేనంత హీన బలుడైతే, అట్టివాడు అవమానం ఫీలయి, అసూయ పెంచుకొని క్రూరుడవుతాడు. మాన మర్యాదలు విడిచి రౌడీ అవుతాడు. అట్టి వాళ్లంతా ఓడిన వాళ్లే. బలహీనులే. వాళ్లు సమాజానికి విష వ్రణాలు. కేన్సర్లు.

# మృత గతారాధన

Flattery, Corruption, Misappropriation, భజన, అవినీతి, ప్రజాధన దుర్వినియోగం - ఇవి సాధారణంగా మానవ నైజ దుర్గుణాలే అయినా, ప్రత్యేకంగా భారతీయులకు, అందులోనూ మన తెలుగుజాతికి ఇవి పవిత్ర సంప్రదాయ గుణాలుగా తయారైనై. మన పాటలలో, కార్యాలయాలలో, పూజా మందిరాలలో నిత్యం మనం ఆరాధిస్తున్నట్టివివే. అందుకు ఉదాహరణలు అసంఖ్యాకం.

ఒక్క రామదాసు వ్యవహారమే చూడండి -

ఆయన ప్రభుత్వోద్యోగిగా వుంటూ భద్రాచలంలో రామచంద్రుడికి ఆలయం కట్టించాడు. ఆ రామలక్ష్మణులకు, సీతమ్మకు పేరు పేరున ఆభరణాలు చేయించాడు. బాగానే వుంది. కాని ఆ డబ్బంతా ఎక్కడిది? ప్రభుత్వానిదే కదా! Misappropriation జరపబడిందే కదా!

''నీకు కలికి తురాయి చేయిస్తి! దాన్ని ధరించి కులుకుతూ తిరుగుతున్నావు. అది ఎవడబ్బ సొమ్మని వచ్చిందనుకున్నావు?'' అంటూ రామచంద్రుడ్ని ప్రశ్నిస్తాడాయన! ఆలయ నిర్మాణానికి, ఆభరణాలకు అయిన మొత్తం ఖర్చంతా కక్కమంటాడు!

ఈ రోజుల్లో అధికార పదవుల్లో ఉన్న గొప్ప గొప్ప వారికి జరుగుతున్న స్వాగతాలకు, సన్మానాలకు, విందులకు, వినోదాలకు ధనం ఎక్కడి నుంచి వస్తున్నది? రామదాసు మార్గం లోనే కదా? రామదాసు మార్గమంటే స్వాగత సత్కారాలు అందుకొన్న నాయకుడు అందుకయిన ఖర్చును తానే భరించడం. రామదాసు మార్గమంటే ప్రజాధనాన్ని దుర్వినియోగం చెయ్యడం.

ఏ అధికారి అయినా పొగడ్తకు, లంచానికి కూడ లొంగకపోతే, ఇక ఆయన భార్యను ఆశ్రయించి పని చెయ్యించుకొనే సంప్రదాయం మనకుంది. అందుకు కూడ రామదాసే మనకు ఆదర్శం. ''నీ అబ్బ సొమ్మా?'' అని అడిగినా కూడ రాముడు పలక్కపోయే సరికి, దిక్కుతోచక ఆయన సీతమ్మ వారిని ఆశ్రయించాడు. ''నను బ్రోవమని చెప్పవే'' అంటూ!

పైగా తన గురించి చెప్పే ఆ సిఫారసును సీతమ్మ తల్లి శ్రీరామ చంద్రుడితో ఎటువంటి సమయంలో చెప్పాలో కూడ వివరిస్తాడు రామదాసు. శ్రీరాముడు "మరుకేళి దేలి" తృప్తి పడి వున్నప్పుడు చెప్పాలట! పరమ పతివ్రత, పవిత్ర చరిత్ర, జగన్మాన్య అయిన తల్లితో అంటున్నాడీ మాట రామదాసు. ఎంతటి దుస్సాహసం!

అంత అసభ్యంగా పైరవీలకు దిగే వాళ్లు నిజంగా వుంటారో వుండరో తెలియదు గాని, ఈ ప్రక్రియకు కూడ రామదాసే మనకు ఆదర్శం అనడానికి సందేహించక్కర లేదు. అయితే ఇంకా ఎంతకాలం ఈ దుష్టారాధన? ఇలాంటివే ఎన్నో. ఈ నిష్ప్రయోజక, మృత గతాచారాలన్నిటినీ మనం విదలించి వేసుకోవలసి లేదా?

పొగడ్త, పైరవీ, లంచగొండితనం, ప్రజాధనం దుర్వినియోగం వంటి వాటిని మానవ నైజగుణాలుగా గుర్తించి, వాటికి అనుగుణంగా మన చట్టాలను నిర్మించుకోవడం మంచిదేమో. వాటిని నేరాలుగా ప్రకటించడం గులాబి చెట్టుకు ముళ్లుండగూడ దనడమే.

మానవుడు జీవించడానికి వెలుగెంత అవసరమో, చీకటి కూడ అంతే అవసరం కదా.

ప్రకృతి నైజాన్ని సరిదిద్దలేం. కనుక మన చట్టాలను, సాంఘిక ప్రవర్తనా నియమాలను సరిదిద్దుకోవాలి.

స్వాభివృద్ధి, పరహింస, స్వాతిశయం, పరాక్రమణ, అసూయ, వంచన, దోపిడీ, ద్రోహం వంటి దుష్ట గుణ కర్మలన్నీ ఒక్క మానవ జీవిలో తప్ప మరే జంతువులోనూ లేవు. ఎన్ని విధాల, ఏ దృక్కోణం నుంచి పరిశీలించినా – జీవ సృష్టిలో మానవ జీవిని మించిన అధమ సృష్టి మరొకటి లేదనిపిస్తున్నది. విజ్ఞులు నిష్పక్షపాతంగా పరిశీలించి నిజం చెప్పండి!

మానవాతీతమైన దివ్య జీవన సృష్టి మానవుడి నుంచే పరిణమించవలసి వున్నదని ఏ మహాత్ముడైనా అంటే – అవునని నేనూ అంటాను. అయితే – అలాంటి ఆదర్శ మానవులీనాడు ఎక్కడున్నారు? ఏరీ? ఎంత మంది?

అలాంటి మానవుల కోసమే ఈ నక్షత్రాలు! వీటి నుంచైనా అలాంటి వాళ్లు పుట్టుకొస్తారేమో చూడాలి.

## పరిష్కారం

"నీతి శాస్త్రాల కుప్పపై నిల్చి, ధర్మ
నిర్ణయము కోరుచున్నాడు నేడు నరుడు.
రేపు తిండి యెట్లను బెంగ బాపకుండ
దేవి! సంఘమ్ము నెటు చక్కదిద్ద లేవు!" –దీపసభ

నేను మొదటి నుంచీ నా సాహిత్యం నిండా ఇదే సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ వస్తున్నాను.

వేదకాలంలో నీతులు లేవు. ప్రబోధాలున్నై. భద్రంగా ఎలా బ్రతకాలో చెప్పబడింది. హిపోక్రసీ లేదు. తమకు పోటీ వచ్చేవాళ్లను నిర్దాక్షిణ్యంగా నిర్మూలించి పారెయ్యమన్నారు వాళ్లు. ఈనాటికీ జరుగుతున్న దదే కదా!

"ఆత్మవత్ సర్వభూతాని" అనే నీతి ఎప్పుడు అమలు జరిగింది?

మానవుడు సాంఘిక భద్రతతో సుఖంగా బ్రతకడానికి కొన్ని నీతి నియమాలను ఏర్పరచుకొన్నప్పటి నుంచీ కూడ, వాటిని బలహీనులకు వ్యతిరేకంగా బలవంతులు వాడు కొంటూనే వున్నారు.

శాంతి భద్రతలు, సుఖ సంతోషాలు, భోగభాగ్యాలు, గౌరవ సన్మానాలు అన్నీ అధికార బల దర్పాల తోడివి. అందుకే ధనవంతులు, సాహసవంతులు వాటికోసం అంతగా ఆరాట పడడం.

శాంత జీవన కాములైన నిరాడంబర మౌన కార్మికుల ప్రతిభను, క్రియా యోగశక్తులను ఉచితంగా, లేక చవగ్గా సొంతం చేసుకొనడానికి వాళ్లు అంతగా పోటీపడడం కూడ అందుకే!

అవినీతి, హింస, అతిశయం, అధికార దర్పం ఒక ప్రక్క విజృంభిస్తూ వుంటే మరో ప్రక్క కేవలం ఆత్మరక్షణ కోసం, బ్రతికి వుండడంకోసం వినయం, విధేయత,

సహనం, దాస్యం బలహీనులైన మానవులకు తప్పనిసరి అవుతూ వున్నై. ఈ బలహీనులే మానవ లోకంలో మెజారిటీ కావడంవల్ల ఇదొక సమస్య అయింది.

మానవ గుణ వర్తనలలో వ్యక్తికీ వ్యక్తికీ మధ్య ఎన్ని తేడాలైనా వుండవచ్చు. నేను చెప్పేది కనీసావసరాలు సమస్త ప్రజలకూ ఉచితంగా అందాలనేది.

తిండి, బట్ట, వసతి, శిశుపోషణ, వైద్యం, విద్య, వృద్ధ సంరక్షణ - ఈ ఏడు అవసరాలూ ఎవరికి కావలసినంత వారికి ఉచితంగా లభించాలి. అందుకు ప్రజలందరూ ఎవరికి సాధ్యమైనంత సేవను వారు ప్రభుత్వానికి అందజెయ్యాలి. ప్రభుత్వంలోని వ్యక్తులెవ రైనప్పటికీ, వాళ్ల కర్తవ్యం ప్రధానంగా ఇదే అయి వుండాలి.

ప్రభుత్వం అనేది ఒక తప్పని సరి వ్యవస్థ. అది వ్యక్తి స్వేచ్ఛను అరికట్టగూడదు. అది చెయ్యవలసిన పనులు రెండే. ప్రజలందరూ పనిచేసేటట్టు చూడడం, ప్రజలందరికీ తత్ఫల సాయాన్ని పంచి పెట్టడం. ఇది జరిగిన తర్వాతనే ఏ విందులైనా, ఏ వినోదాలైనా. ఇదీ నేను గిల్లి చెపుతున్న సత్యం. ప్రపంచ సమస్యలన్నిటికీ పరిష్కార మార్గం.

## నైరం తర్యం

చంద్రగతిని అనుసరించి భూమి మీది ప్రకృతికి ప్రతినెలా ఒక రుతువే. ప్రతి రుతువూ ఒక మార్పే.

దర్శన, స్పర్శన మొదలైన అష్టవిధ క్రియల ద్వారా కళా స్థానాలను పీడించి, కళలను మేల్కొల్పి తృప్తి పరుస్తూ, ఆనంద శిఖరాన్ని అధిరోహించడం శృంగార ప్రయోజనం. అట్టి పనులలో నఖక్షతం ఒకటి.

ఆక్యుపంక్చర్ (occupuncture) అనే పేరు గల వైద్య విధానం ఒకటుంది. మన గ్రామీణ మైన సూది, పచ్చబొట్టు, గురి, వాత వగైరా చికిత్సా పద్ధతుల వంటిదే ఆక్యుపంక్చర్ కూడ. అయితే మన గ్రామీణ పద్ధతులు ప్రోత్సాహం లేక మూలపడిన్నై. ఆక్యుపంక్చర్ పద్ధతి (ఇది కూడ సూది వైద్యమే) చైనీయులచే తమ జాతీయ వైద్యవిధానంగా అభివృద్ధి చేయబడింది.

నా కనిపిస్తుంది -

కామ కళా ప్రేరణకు సంబంధించినంత వరకు మన నఖక్షతం ఆక్స్యపంక్చరు వంటిదే నని.

ధర్మ, అర్థ, కామ, మోక్ష పురుషార్థాలు నాలుగింటిలోనూ కామం ఒకటి. కామానికి అంతటి గౌరవ స్థానం ఇచ్చారు మన పూర్వ ఋషులు. వాత్స్యాయన మహర్షి దానికొక శాస్త్రీయతనే కల్పించాడు.

నా ఈ నఖక్షతాలు వ్యంగ్య విమర్శలు. వీటికి ఆలంబన సమాజం. కళాస్థానాలు సమాజంలోని జీవ కేంద్రాలు. జీవితంలోని కీలక స్థానాలు. వాటిని గిచ్చి హెచ్చరించడం ఈ మినీ కవితల పరమార్థం.

నేను అప్పుడప్పుడు సరదాగా వ్రాసుకొంటూవచ్చిన చిన్నచిన్న కవితలన్నిటినీ పోగుచేసి, నఖక్షతాలు అని పేరు పెట్టి, పధ్నాలుగు సంవత్సరాల క్రితమే, 1982లో గ్రంథ రూపంలో ముద్రించాలి అనుకొన్నాను. ఈ పీఠిక కూడ అప్పుడు వ్రాసిందే.

## కంట్రోలు రేటుకు పేపరు

1981లో, మలేషియాలో రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. మన విద్యాశాఖ సెక్రటరీ మామిడిపూడి గోపాలకృష్ణగారు ఆ సభలలోనే నాకు మిత్రులైనారు.

ఆ కాలంలో గ్రంథ ముద్రణ కోసం అడిగిన వాళ్లకు ప్రభుత్వం పేపరును ఫేక్టరీ రేటుకు సప్లయి చేసేది. అప్పుడు సిరిపూర్ వైట్ ప్రింటింగ్ పేపరు టన్ను ఖరీదు నాలుగు వేల రూపాయలుండేది.

నేను 1982లో, నా గ్రంథాలు ముఖ్యంగా నఖక్షతాలు ముద్రణ కోసం రెండు టన్నుల పేపరు కోసం అప్లయి చేశాను.

నా అప్లికేషను ఏమయిందో కనుక్కోడానికి ఒక రోజు నేను సెక్రటేరియటుకు వెళ్లినప్పుడు, విద్యాశాఖ సెక్రటరీగా గోపాలకృష్ణగారే వున్నారు. ఆయన నన్ను నవ్వుతూ ఆహ్వానించి అన్నారు -

"మరి, దంత క్షతాలు ఎప్పుడు ముద్రిస్తారు?"

"ముందు నఖక్షతాలు కావాలి కదా?"

"వాటికి మీ రడిగిన రెండు టన్నులూ ఇస్తున్నాను. దంతక్షతాలు కూడ రెడీగా వుంటే-" ఆగారాయన, ఏదో ఫైలు చూచుకొంటూ.

"రెడీగా వుంటే ఏంచేస్తారు?"

"రెండును మూడు చేస్తాను"

"అమ్మో, వద్దు. రెండు టన్నుల బరువే మోయలేను!"

"మీ యిష్టం! తర్వాత పశ్చాత్తాపపడే స్థితి రావచ్చు" అని, కొంచెం ఆగి, "సరే, ప్రింటు అయిన తర్వాత ఒక ప్రతిని నాకిస్తారుగా?" అంటూ నాకు వీడ్కోలిచ్చారు.

సెక్రటరీ గారి దగ్గర జరిగిన దంతా చూచిన ఆయన పర్సనల్ సెక్రటరీ, నాకు మిత్రులూ అయిన రాఘవయ్యగారన్నారు, "మీరు మూడు టన్నులూ తీసుకోవలసింది" అని.

"ఎంత చెట్టు కంత గాలే క్షేమం" అన్నాను నేను.

ఆ రెండు టన్నుల పేపరు 1983లో జరిగిన నా సాహితీ షష్టిపూర్తి ఉత్సవ ప్రచురణ లకు ఖర్చయిపోయింది. నఖక్షతాలు అలానే అముద్రితంగా వుండి పోయాయి!

గోపాలకృష్ణ గారన్నట్టు, ఆ తర్వాత నేను నిజంగానే విచారించాను. ఎందుకంటే, ఆ తర్వాత ప్రభుత్వ విధానాలే మారిపోయాయి. సరస్వతీ, సారస్వతోపాసకులూ క్లోజ్డు ఫైల్సే అయిపోయారు.

ఈలోగా ఈ నఖక్షతాలు ఎక్కడివక్కడే పడి వుండిపోలేదు. సంఖ్యలో పెరుగుతూ, ఇప్పటికి 523 అయినై.

ఆకాశవాణిలో ప్రసారమైనై.

"నఖోం కే నిశాన్" అనే హిందీ పేరుతో జ్ఞానపీఠ్ వారి వివిధ భాషా కవితా సంకలనంలో చేర్చుకోబడినై.

అనేక కవి సమ్మేళనలలో హర్షధ్వానాలతో ఆస్వాదించబడినై.

అన్నిటినీ మించి నాకు చాలా చాలా ప్రియమైనై!

మీరు కూడ ఆస్వాదించండి. మారండి. జాతిని మార్చండి. అభ్యుదయం కేసి మరల్చండి!

## అంకితం గురించి

మిత్రులకు, సహృదయులకు, అభిమానులకు, నా గ్రంథాలను అంకితాలిస్తూ వుండటం నా అలవాటు. ఇందులో కొందరు రసజ్ఞులూ వుంటారు. ఏదో బలవంతపు పెళ్లిగా భావించేవాళ్ళూ వుంటారు. కృతి స్వీకర్తల స్వభావాలెలాంటివైనా, నేను మాత్రం ఎంతో ఆప్యాయతతో, ప్రేమతో, కొందరిపట్ల భక్తితో కూడ అంకితాలిస్తూ వుంటాను.

ఈ "నఖక్షతాలు" కావ్యకదంబాన్ని స్వీకరిస్తున్న బిళ్ల వేదయ్యగారు సమస్త సద్గుణ సంపన్నుడు. స్నేహం, సద్భావం, వదాన్యత పరోపకార పారీణతా, కార్యదక్షతా, సాంస్కృతిక కళాక్షేత్ర కృషీవలత వగైరా సమస్త ప్రజ్ఞలూ కలిగిన మిత్రుడు.

ఈయన పుట్టింది నెల్లూరు జిల్లా, కొడవలూరు మండలంలోని రామాపురం గ్రామంలో. తండ్రి అంకయ్యగారు, తల్లి చెన్నమ్మగారు. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందో లేదో గాని, వేదయ్యగారు మాత్రం శైశవం నుంచి కూడ తన ప్రజ్ఞాదీధితులతో మాతాపితరుల్ని అలరిస్తూ వచ్చిన వాడు.

విద్యార్థిగా ఆయా స్కూళ్ళు, కాలేజీల సాంస్కృతిక సంఘాలకు లిటరరీ అసోసియేషన్లకు కార్యదర్శిగా, అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి, ఆయా సంస్థలకు కీర్తి ప్రతిష్ఠలు సాధించిపెట్టినవాడు ఈయన.

అకౌంటెంటు జనరల్ ఆఫీసులో పనిచేసినప్పుడు అక్కడి (హైదరాబాద్) తెలుగు నాటక సమితికి వైస్ ప్రెసిడెంటుగాను, కమర్షియల్ టాక్సెస్ డిపార్టుమెంటులో పనిచేసినప్పుడు అక్కడి సాంస్కృతిక సంఘానికి ఉపాధ్యక్షుడిగాను ఉండిన

వేదయ్యగారు సాంస్కృతిక రంగానికి, ముఖ్యంగా నాటక రంగానికి చేసిన సేవ అపారమైనట్టిది.

నటుడుగా ఈయన ప్రతిభ సాటిలేనట్టిది. ముఖ్యంగా "తుఫాను" నాటకంలో రాఘవరెడ్డి పాత్రలో ఈయన తెలుగు లోకానికి రాఘవరెడ్డిగానే నిలిచిపోయాడు. ఎన్నోసార్లు ఉత్తమ నటుడిగా నిర్ణయించబడి అవార్డులు అందుకున్నాడు, సన్మానాలు స్వీకరించాడు. రేడియో శ్రోతలకు ఈయన "పిట్టలదొర"గా సన్నిహితుడు.

హైదరాబాదులో గౌతమ కళాసమితిని, గుంటూరులో అంబేడ్కర్ కళా సమితిని నెలకొల్పి నడిపిన వాడీయన. కమర్షియల్ టాక్సెస్ డిప్యూటి కమీషనర్‌గా గత సంవత్సరం రిటైర్ అయిన తరువాత, గుంటూరులో సాహితీ మిత్రమండలికి అధ్యక్షుడిగా వివిధ కార్య క్షేత్రాలలో కృషిచేస్తున్నాడు.

ఇలా వ్రాసుకుంటూ పోతే వేదయ్యగారి చరిత్ర ఒక పెద్ద జీవిత చరిత్రే అవుతుంది. నా కావ్య స్వీకర్త ఎటువంటి వాడో చెప్పడం మాత్రమే ఇక్కడ నా ఉద్దేశం.

ప్రచారమంటే ఇష్టం వుండదు. రంగస్థలం మీద తప్ప, వేదిక మీద తరచు కనిపించడు. ప్రజోపకార సేవాతత్పరుడైన ఉత్తమ పురుషుడి ఉత్తమోత్తమ లక్షణం ఇది. అయితే, ఈయన రిటైరైన తర్వాత, ఇప్పుడు సాంస్కృతిక రంగంలో తన ప్రతిభను పూర్తిగా వినియోగించదలిచాడు. శుభం.

86వ జన్మోత్సవం
భాగ్యనగరం

బోయి భీమన్న
19-9-1996

# వసంత నఖం

ఆ వసంతోత్సవ మహాసభలో ఎవరో నీవు
నన్నలా రాసుకు పోయి నప్పుడు
నా కళ్లద్దాలు కిందపడి పగిలి పోయినై!

అప్పటి నుంచీ నాకు ఓ చెలీ!
నీవు తప్ప మరేదీ కనిపించడం లేదు!

## 2. దానిమ్మ పండ్లు

ఈ దానిమ్మ పండు బుగ్గపై ఒక్క నఖ క్షతంతో
ఎన్ని దంతక్షతాలు ఆవిష్కరించావు దాని నిండా!
నీ నఖాగ్రానికే ఇంత గమ్మత్తుంటే
దాని తను లతాంతానికి ఎంత మహత్తుందో!

ఈ బ్రహ్మాండా లన్నీ నీలాంటి
ఎవరి నఖక్షత పులకాంకు రాలో!

## 3. స్పర్శ

నాకు నీ స్పర్శ తగలక ముందు
ఒక నిస్తరంగ సరోవరంలా
ఎంత ప్రశాంతంగా బ్రతికాను నేను!

నీవు నాలో దిగి ఈత కొట్టినా
నా కేమీ అయేది కాదు, కాని
నీ వెక్కడో గట్టు మీద కూర్చొని
నాలో కేలు గుచ్చి మీటావు!

ఓహో, చిరు తరంగ వలయాలా అవి?
నా ఆత్మనే చుట్టు ముడుతున్న వలలు!

## 4. పర ప్రియులు

కోకిల మధుప్రియ, తుమ్మెద పుష్పప్రియ,
గాలి గంధప్రియ, రేయి రాజ ప్రియ;
ఆ ఎవరూ నా జోలికి రాలే దింత వరకూ!

కాని, ఆ సాయంత్రం నీ కళ్ళు నన్నలా
వెంటాడి గిచ్చి పోయి నప్పటి నుంచీ
ఆ పరప్రియ లంతా నా చుట్టూ చేరి
ఒకటే గిచ్చడం! గిల్లడం! గీరడం!

## 5. ఆకర్షణ

కోకిలకు మామిడి ఇష్టం.
గొంగళి పురుగుకు మునగ చెట్టు ఇష్టం.
పనస పండుది వేసవి కాలం
సీతా ఫలానిది వాన కాలం.
కలువ చంద్రప్రియ
కమలం సూర్య ప్రియ.

పరస్ప రాకర్షణే ప్రణయం
ప్రణయ ఫల రసాస్వాదనే జీవితం.

## 6. నా నా ముఖాలు

కొండపై ఒకే చోట కురిసిన వర్షమే
ప్రవహించవచ్చు నానా ముఖాలుగా;
అయినా కలుస్తా యవన్నీ మళ్లీ ఎక్కడో,
ఏ మేఘాలయంలోనో!

సృష్టిలో ఏదీ సమా నాంతర సరళ రేఖ కాదు,
మనమూ అంతే!
నీ పట్ల నాకున్న ఆశ అదే!

## 7. దేవత

ఒకొక్క అందం ఒకొక్క దేవత!
అన్ని అందాలూ కలిసిన పూర్ణ దేవతవు నీవు!
నీ మూర్తిని ఋగ్వేదమే వర్ణించ లేనప్పుడు
కేవలం ఉపనిషత్ సేవకుణ్ని నేను
ఏ వ్యంగ్యంతో నిన్ను నిరూపించ గలను?
ఏ విగ్రహంలో నిన్ను నిబంధించ గలను?

ఏ ఋతువూ లోప రహితం కాదు
సర్వర్తు రాగ మధు రసాన్ని
ఏ కలశంలో నింపుకు రాగలను?

## 8. సౌందర్య

ఏది సౌందర్యం?
అది నీ ఇష్టం తోడిది!
సౌందర్యం ఎక్కడుంది?
అది నీ హృదయంలో వుంది!
ఏ దైనా నీవు సుందర మనుకొంటే సుందరం
కాదను కొంటే కాదు!

## 9. సందేహం

నిన్ను మించి పోవా లన్నది నా కోరిక.
కనీసం అందుకోగలనా అన్నది సందేహం!
కోరిక నీకేసి పరుగులు తీస్తుంటే
సందేహం నన్ను వెనక్కి గుంజుతున్నది!

కోరికకు నీ చిరునామా అయినా దొరక్కపోతే
సందేహానికి నా దేహం లొంగిపోక తప్పదు!

## 10. ఇజాలు

వసంతుడి కొలువులో, మామిళ్ల సదస్సులో
కోకిల పాడుతున్నది;
అది కోకిలకు రియలిజం
మనిషికి సి(ర్రియలిజం!
మామిళ్లకు ఎగ్జిస్టెంషియలిజం!

ఎన్ని ఇజాలైనా గానీ, నిజానికి
అవన్నీ నీ ఇమేజికి తేజీలే!

## 11. ఇష్ట వస్తువు

ఆపాద మస్తకం సత్య సుందరంగా
నేను వర్ణించగల ఇష్ట వస్తువు
ప్రియా, నీ ఒక్కతెవే!
నాలో కనిపించే వైరుధ్యాలు
నీ వెనక ముందులు, నీ వెలుగు నీడలు
నీ బహుముఖ భావ భంగిమలు.

## 12. పుట్టిన రోజు

ప్రతి అమావాస్యా నా పుట్టిన రోజే,
ప్రతి పూర్ణిమా నా కళా ప్రపూర్ణత్వమే!
ఈ అర్ధనారీశ్వరతా పూర్ణ మూర్తిత్వంలో
శుక్ల పక్షార్ధం నీవు!
మిగిలిన కృష్ణ పక్షార్ధం
శివార్పణం!

## 13. నీ విలాసాలు

వికసిస్తూ, వాడిపోతూ వుంటాను నేను
ఎన్నడూ వాడిపోని నీ తోటలో;
నీ అడుగు జాడల వెలుగు నీడల్లో ఎల్లప్పుడూ
న న్నిలాగే ఆడుకోనీ!
నీ విలాసాలు పాడుకోనీ!

## 14. నా తాహతు

నాకు రాజకీయాలు లేవు
ఏ ఇజంతోనూ పొత్తు లేదు,
నేను పదవులిచ్చే నాయకుణ్ణో
మార్కులిచ్చే ఆచార్యుణ్ణో కాదు;
నేనొక మామూలు తోటమాలిని
నీకు నచ్చిన పూలుంటే కోసుకొంటూ వుండు!
ఇష్టమైతే ఇక్కడే వుండు!

## 15. నగ్నత

ఏ వర్గానికీ చెందిన వాణ్ణి కాను నేను.
విశ్వశ్రేయమే నా కవితాదర్శం,
అయితే - నిజం నా సహచరి కావడంతో
నిష్ఠూరాలు నన్ను వేధిస్తూనే వున్నె,
నిజం నగ్నసుందరి కదా
రౌడీ మూకలు వెంటబడవా మరి?

## 16. నిలువు గీత

నా గురించి నీకు ముందే చెప్పు కోవాలి -
నాకు లోకం తెలియదు.
సమాజం లేదు
రాజకీయం గిట్టదు
సంపాదకుణ్ని కాదు
నిర్భీతీ నిర్మొగమాటమూ నా గుణాలు!

ఇవన్నీ మైనస్ పాయింట్లే,
నా మధూన్మత్తత మరో పెద్ద మైనస్!
ఇదీ నా బయోడేటా!

ఇప్పుడు చెప్పు-
నా ఈ మైనస్ అడ్డ గీతకు మధ్యగా
నిలువు గీతవై నిలవగలవా?

## 17. మెరుపులు

మానవ మన శ్శిఖరాలకు
ఎన్నో మెరుపు తీగలు ఒరుసుకు పోతుంటై,
అందులో మనం పట్టుకొనే వెన్ని?
నాటి పెంచి కొనే వెన్ని?
పూచే వెన్ని? ఫలించే వెన్ని?

## 18. నీవు

నా కంటి నిండా కాంతి
ఒంటి నిండా పరిమళం
గుండె నిండా అనురాగం
నింపుతున్న దెవరో నీవు?
కలిసి ఆడుకోడానికి
నీవు నా చుట్టూ లేకుండా
ఈ ఆనంద మఠాధి పత్యం నా కెందుకు?

## 19. పతంగ సూత్రం

నీ పాట వింటున్నాను బహు రాగాలలో
నీ ఆట చూస్తున్నాను వివిధ భంగిమలలో
నీ కోసం నా మనస్సు అన్వేషిస్తున్నది
నా హృదయం నిరీక్షిస్తున్నది!

ఒకే రాగంలో ఇమడ లేవా?
ఒకే భంగిమలో నిలవ లేవా?
ఎందుకంటే – నా జీవన పతంగ సూత్రం
చలిస్తున్న నీ చేతిలో వుంది!

## 20. ఏక శయ్య

నీ నా మధ్య దూర మెంత?
నీవు అనుగ్రహిస్తే – శూన్యం
ఆగ్రహిస్తే – అనంతం!

శూన్యానంతాలు ఏక బిందుగతాలు కదా?
మరి, ఏక శయ్యపై
ఈ విరహార్తి ఏమిటి?

## 21. అభిముఖ

నేను తూర్పుకూ, నీవు పడమటికీ తిరిగి
పరస్పర విరుద్ధంగా బ్రతకడం
ఏ విధంగానూ తప్పక పోతే
వెన్నుకు వెన్నే ఆనించుకోవాలా?
పెదవికి పెదవీ చేర్చుకోవచ్చు!

## 22. ఏకనారి

నీవూ, నేనూ - అటూ, ఇటూ
ఒకే నారికి వంచి కట్టిన రెండు విల్లులం!
నా ఉత్తరార్ధానికీ, నీ దక్షిణార్ధానికీ
ఏకనారి భూమధ్య రేఖే కదా?

మనం ఒకరి నొకరం కొట్టుకోక పోతే
నీవు నా మీదకు కొంచెం ఒరగగూడదా?

## 23. సరుదుకుపో

నీ వొక పట్నవాసపు కరెంటు దీపానివి
ఎప్పుడు వస్తావో, ఎప్పుడు పోతావో తెలీదు!
నా నిత్యావసర కార్యదర్శిని ఈ కొవ్వొత్తి,
దీని ప్రాణ పేటిక నా జేబులోనే వుంది
కంగారు పడి కల్లెర్ర జేసుకోకు!
సత్యాన్ని గుర్తించి
సరుదుకు పో!

## 24. చేతనైనంత

వీలైనంత దీర్ఘకాలం బ్రతకడం కాదు
చేతనైనంత సమగ్రంగా బ్రతకాలి మనిషి!
వెలుగు చీకట్ల కష్ట సుఖా లేమిటో తెలిస్తేనే
నీ వెవరో తెలిసేది!

నిన్ను సేవించ గలది -
అడయారు మర్రి చెట్టే కాదు,
సంక్రాంతి బంతి చెట్టు కూడా!

## 25. వినబడని తావు

నేను గాయకుణ్ని కాదు, అయినా
పాడు కోవడం నా సరదా!
నేను పాడు కొనేది నీ గురించే, అయినా
నీవు వింటున్నా వేమోనని భయం!

అయినా, నా పిచ్చి గాని -
ఒంటరిగా పాడు కోడానికి
నీకు వినబడని తావెక్కడుంది నాకు?

## 26. నీ ఉనికి

ఊహలో వాస్తవాలో
అనుభూతులే కలలు!
అందులో నీ వుంటే, అది జీవితం!
లేకపోతే అది అన్వేషణ!

## 27. రిజల్టు

ప్రతి వాడూ జూద గాడే,

ప్రతి పనీ జూదమే,

జీవితమే ఒక పోటీ పందెం.

దాని రిజల్టు తెలిసేది ముగింపు వద్ద.

నిజానికి రిజల్టే ముగింపు

అంతవరకు అందరిదీ తెగింపే!

## 28. నీ వెవరో

లోకం నిండా ఎన్నో దేశాలు

ఒక్కో దేశంలో ఎన్నో నగరాలు

ఒక్కో నగరంలో ఎన్నెన్నో షాపులు

ఒక్కో షాపులో ఎన్నెన్నో చీరలు

ఒక్కో చీర చుట్టూ ఎందరో లతాంగులు!

అందులో నీ వెవరో

ఎలా పట్టుకోవడం?

## 29. ఎంచుకోవడం

అభిరుచులు వ్యక్తిగతం
ఒకొక్క వ్యక్తికి, ఒకొక్క అభిరుచి;
నీవు నా అభిరుచివి
అందుకే నీ కోసం ఈ తపన!

ఈ చరాచర వస్తు ప్రదర్శనంలో
అన్నీ అందరి కోసమూ కాదు,
ఇష్టాన్ని బట్టి ఎంచుకోవటం కోసం!

## 30. బ్రతుకు జూదం

ఎన్నికలు, పరీక్షలు, ఇంటర్వ్యూలు
పేకాటలు, రేసులు, పైరవీలు
వ్యాపారాలు, క్రీడలు, రాగ ద్వేషాలు
అంతా జూదమే, గేంబ్లింగే!

మనస్సులు కలిసి, శరీరాలు బెడిస్తే
ఫేవరిట్ గుర్రం బోర్డుకు రాక పోవడమే!

## 31. కలర్ ఫోటో

మనస్సూ, శరీరమూ
పూర్ణ జీవితానికి ఈ రెండూ అవసరమే!
ఇందులో ఏదో ఒక్కదానినే ఎంచుకోమంటే
నేను శరీరాన్నే కోరుకుంటాను!

అందేం అంటావా?
మనస్సు పరమాత్మకు కలర్ ఫోటో,
అదొక నిరంతర పరంపర
శరీరం ఒకసారి పోతే - మళ్లీ రాదు మరి!

## 32. నిజ వైభవం

ఆ రాలిన ఆకుల్ని అలా తొక్కుకు పోకపోతే
పోగు చేసి కొంచెం నిప్పంటించ రాదా,
అప్పుడు దర్శించవచ్చు ఆ మంటల్లో
గత వసంతపు నవ పల్లవ రుచుల్ని!
ఆ పొగల్లో గత లక్ష్యాల వేడి నిట్టూర్పుల్ని!
ఆ బూడిదలో నిజ వైభవ చితా భస్మాన్ని!

## 33. రసాలంకారాలు

రసాలూ, అలంకారాలూ, వక్రోక్తులూ, ధ్వనులూ
ఈ సరంజామా అంతా ఎందుకోసం?
ఆర్ద్రతనూ, ఆనందాన్నీ కలిగించడం కోసం.
హింస, దోపిడీ, స్వార్థం చీకట్ల నుంచి విడిపించి
మనిషిని ఉద్యానాలలోకి నడిపించడం కోసం.

## 34. అన్నీ కావాలి

సుఖం, సౌందర్యం, ధనం, భోగం
అన్నీ కావాలి నాకు సమగ్రంగా;
తనువు క్షణ భంగుర మని తెలియక కాదు
ఆ క్షణమైనా సార్థకం చేసుకోవా లని!

## 35. దళితుడు

నా జీవితం ఒక సహస్రదళ పద్మం,
నా ప్రతి పూర్ణిమా నీ పూజలో ఒక దళం;
నా జీవ దళాలన్నీ నీ పాదాలపై దళితాలై పోగా
నన్ను దళితు డంటున్నా రంతా!

## 36. శిల్పం

అసిత, అస్మిత
లోకము, వ్యక్తి
దృశ్యము, దృక్కు
నీవు, నేను!

నీవు లేనప్పుడు నేను శిలను,

నీతో కలిసి నప్పుడు శిల్పాన్ని!

## 37. మెరుపు

నా చుట్టూ ఎండలు, మంటలు!

పైని మబ్బులు, తుపానులు, పిడుగులు!

మధ్య మధ్య ఆ మెరుపులే లేకపోతే

ఈ అంధకార అగాధాల్ని

నేనెలా దాటి రాగలుగుతున్నాను?

## 38. ప్రజాస్వామికం

నాకు నూరేళ్ల పాటు దాహం తీర్చే సరస్సును
పది మంది చేరి కలగ్గొట్టి పారవేయడమే
ప్రజాస్వామిక నీతి అయితే -
అది నాకు వద్దు, వద్దే వద్దు!

## 39. సైన్యాలు

ఆ నీ కముల వనం మీదకు
నా చకోర సైన్యం దండెత్తి నప్పుడు
అక్కడ తుమ్మెదలు పారి పోతున్నై!

అవి ధైర్యం తెచ్చుకొని
నా కలువ తోటపై విరుచుకు పడ్డప్పుడు
ఇక్కడి చకోరాలు తోక ముడుస్తున్నై

మన రెండు సింహాసనాలు బాగానే వున్నై,
మధ్య - సైన్యాలే కొట్టుకు చస్తున్నై!

## 40. పెండ్లి

నేనే రాధను అంటుం దొక ఏనుగు,
నేనే కృష్ణుణ్ని అంటూ డొక పీనుగు!
అసలు రాధాకృష్ణులు పెళ్లి చేసుకోరు
వీళ్లు మాత్రం పెళ్లి కోసం ఏడ్చి చస్తారు!

## 41. వేల కోర్కెలు

నా దగ్గర వందల వేల కోర్కె లున్నై
అవన్నీ నానా ముఖ శిలీ ముఖాలై
బహు ముఖాలుగా నిన్నే వెతుకు తున్నై!
ఈ రిరంసా రసోదయ విశ్వోద్యానంలో
పట్టు పడకుండా ఎలా వుండగలవో చూస్తా!

## 42. బ్రతుకు రేసు

బ్రతుకు రేసులో ఒకొక్కప్పుడు
నీ ఫేవరిట్ గుర్రం గెలవక పోతే
గుర్రానికి పరిగెత్తే మూడ్ లేక పోవచ్చు
జాకీ పొరపాటో, మోసమో చేసి వుండవచ్చు
ఓనరు, ట్రైనరు వుద్దేశాలు వేరై వుండవచ్చు!

కారణా లెన్నైనా వుంటై
నీకు నష్టం వస్తే
భరించాలి, అంతే!

## 43. సుఖం

జీవితానికి పరమార్థం సుఖంగా జీవించడం;
సుఖం ఎక్కడ లభిస్తుంది?
సుఖం నీ లక్ష్య సిద్ధిలో వుంది
సుఖం నీ సంతృప్తిలో వుంది
నీ సుఖం నీలోనే వుంది.

## 44. రాజకీయ జూదం

తాను కాసిన గుర్రం గెలవక పోతే
తానొక్కడే నష్టపోతాడు
తన పార్టీ అభ్యర్థి గెలవక పోతే
మొత్తం పార్టీయే నష్టపోతుంది!
జూదాలలో రాజకీయ జూదమే రారాజు!
తాను ఓడినా పార్టీ గెలవా లనేదే ధర్మరాజు.

## 45. కవిత్వం

నా దేదో కవిత్వ మంటూ నిరాదరించకు,
అసలైన కవిత్వం అలసిన బ్రతుక్కు అమృత కలశం;
కవి అతిశయోక్తులు పలక వచ్చు,
అబద్ధా లాడడు!

తరులతాంగి ఒకర్తు తల మీద జల కలశంగా
ముక్కంటిని మోసుకు వచ్చిం ిందంటే-
అది అబద్ధం కాదు, పరమ నిజం!

## 46. నూపురం

మానవ ప్రగతికి అవసరమైన విద్యలు
అయి దన్నాడు నోబెల్ మహాశయుడు
భౌతిక, రసాయనిక, వైద్య శాస్త్రాలు,
సాహిత్యం, శాంతి!

మొదటి మూడూ భౌతిక ప్రగతికి
తక్కిన రెండూ ఆత్మ వికాసానికి!
అందులో శాంతి నా అంతః పురం
సాహిత్యం నీ నూపురం!

## 47. లేదు - ఉంది

నాకు దేవుడు లేదు
అయినా ధ్యానిస్తాను,
నాకు విగ్రహాలు లేవు
అయినా పూజిస్తాను,
నాకు భక్తి లేదు
అయినా ప్రార్థిస్తాను!
ఎందువల్లనో తెలుసా?
నీ వుండడం వల్ల!

## 48. ద్వైతాద్వైతం

రెండు తీరాల మధ్య ప్రవహించి నప్పుడే
అది నది!
రెండు హృదయాల మధ్య స్పందించి నప్పుడే
అది ప్రణయం!
రెండు సేనల మధ్య జీవించి నప్పుడే
అది గీత!
రెండు కత్తుల మధ్య కొనసాగి నప్పుడే
అది సమైక్యత!
రెండు బాహువుల మధ్య ద్రవించి నప్పుడే
అది రసాద్వైతం!

## 49. అందడం

మహితమైన కృషీ, శ్రమా లేకుండా
మధురమైన అనుభూతులు లభించవు;
అందని ద్రాక్ష పళ్లు పులుపంటే -
పులుపు వట్టి చేయికి,
చేతిలోని రాయికి కాదు!

## 50. సమయజ్ఞత

మొగ్గ ఎంతకాలం వికసించకుండా వుంటుంది?
పువ్వు ఎంతకాలం వాడకుండా వుంటుంది?
అందుకే ఏ కాలంలో సుఖాన్ని
ఆ కాలంలోనే అనుభవించాలి!

త్వరపడీ లాభం లేదు
తడవు చేసీ లాభం లేదు.

## 51. తెలివికి వెలి

నీ వెవరో, ఎక్కడున్నావో నాకు తెలుసు;
తెలియని వాళ్లు నీ కోసం వెతుకుతూ
నన్ను కూడ చేర మంటున్నారు తమతో!

వాళ్లతో ఎందు కని, ఎక్కడకని పరిగెత్తేది?
పరిగెత్తక –
ఎంత కాలమని ఇలా వెలిగా
విడిగా వుండి పోయేది?

## 52. మందిలో నేను

శ్రుతి సుందర మధు మందిరం నీ స్వరం,
వాళ్ల కెందుకు వినిపించదో!
నవ పల్లవ పీతాంబర దీపం నీ రూపం,
వాళ్ల కెందుకు కనిపించదో!

పరిగెడుతూనే వున్నారు వాళ్లంతా
నిన్ను వెతుక్కొంటూ –
నేనూ పరిగెడుతున్నాను వాళ్ల వెంట
నా ప్రతి అక్షరంలోనూ నీ
కలర్ ఫోటోకు ఫ్రేం బిగించు కొంటూ!

## 53. కొత్త చేయి

నేను పట్టుకొని నడిపించు కొచ్చిన చేయి
నా కవసర మైనప్పుడు
నన్ను వదిలేసి పోతుంది!

నే నెరగని మరేదో ఒక కొత్త చేయి
నా చేయి పట్టుకొని ముందుకు నడిపిస్తుంది!
ఇది నా జీవితానుభవం!
నిజానికి – నేను తీసి ఫ్రేం కట్టు కొంటున్నవి
నీ నెగిటివులు మాత్రమేనేమో?

## 54. మెదడు

సామాన్యుడి మెదడు రేడియో,
మేధావి మెదడు టెలిఫోను!
కవి మెదడు వైర్‌లెసు!

నా మెదడు మాత్రం నీ లాలసకు
నిరంతరం శ్రుతి చేయబడి వున్న
ఒక చిరు చాండాలిక!

## 55. నా కేమవుతావు

నిన్ను ముఖాముఖి దర్శించిన భక్తులకు
కోటి సూర్య ప్రభవు నీవు,
నిన్ను వెనక నుంచి చూచిన యోగులకు
నిర్వికల్ప సమాధివి నీవు!

నేను భక్తుణ్నీ కాను, యోగినీ కాను -
మరి, నీవు నా కేమవుతావో, నీ దయ!

## 56. స్వభావం

పోకిరీ అవుతాడేమో అని
పాలివ్వడం మానుతుందా తల్లి?
ఏ గయ్యాళి తుంచుకు పోతుందో అని
పూయడం మానుతుందా మల్లి?

నీవు నాకు లభించ వేమో అని
ఆరాధన మానుకొంటానా నేను?

## 57. పై చేయి

నా కున్నన్ని అంద చందాలు, సుఖ శాంతులు
లోకంలో ఎవరి కున్నై నీకు తప్ప?
నీ దెప్పుడూ పై చేయే –
పైకి రావాలన్న నా కోరికకు హేతువదే!

నేను ముందుకు దూకడం
నీవు నా కంటె ముందుండడం వల్లనే!

## 58. నీ కొరకే

నా సృజన –
నిన్ను పూర్తిగా ఆవిష్కరించే వరకే,
నా ఉబలాటం –
నిన్ను నిండుగా చూచే వరకే,
నా ఆర్తి నీవు దొరికే వరకే,
నా మూర్తి నీవు మురిసే వరకే!

## 59. ప్రేమ, తృప్తి, విశ్రాంతి

లఘు దేవతలు, గురు దేవతలు, గణ దేవతలు
వీరే నేను పూజించే దేవతలు,
రసం, భావం, శిల్పం, ఆనందం
ఇవే నన్ను పోషించే తీర్థ ప్రసాదాలు
ప్రేమ, తృప్తి, విశ్రాంతి
ఇవే నేను కోరుకొన్న వరాలు!

## 60. ఊహాపోహలు

మానవ లోకం మృత్స్న,
మనోలోకం జ్యోత్స్న,
పంజరంతో పాటు చిలుక చస్తున్నది
బల్బుతో పాటు వెలుగు పోతున్నది,
ఇంతటి విజ్ఞానానికీ పర్యవసానం
మృత్యువేనా అనిపిస్తున్నది!
అలా అనిపించకపోతే
ఇన్ని ఊహాపోహలకు ఆస్కారమేది?

## 61. దినమణులు

ఈ జనం అందరికీ నా పేరు తెలుసు
నన్ను తెలిసిన వాళ్లు మాత్రమే లేరు.
తెలుసు నంటారు కొందరు,
తెలుసు ననుకొంటారు మరికొందరు!
అందరివీ అపోహలు
వాళ్లందరూ దిన మణులే కావచ్చు
వెన్నెల చల్లదనాన్ని ఎలా పొందగలరు?

## 62. ప్రతి నక్కా

రాజ్యపాలన చెయ్యా లనుకొంటున్నావా?
కోట్లాది మంది పాలితులు సిద్ధంగా వున్నారు.

ఇద్దరు పెట్టుబడి దొరల్ని సంపాదించి
నలుగురు రౌడీలను మేపగలిగితే
ప్రతి నక్కా నరేంద్రుడు కాగల డీ దేశంలో!

## 63. వ్యక్తిగతం

ప్రతి మనిషికీ వ్యక్తిగత జీవితం వుంది,
అది ఎంత రహస్యమైన దైతే
అంత ఆనంద రస ఫలంగా వుంటుంది;
ఆనందో బ్రహ్మ అనబడే దదే!
మనిషికి జన్మ కారకం అదే!
వృద్ధి స్ఫోరకమూ అదే!

## 64. విశ్వాత్మ

నీవు ఏ రూపంలో నన్ను ఆరాధిస్తే
ఆరూపంలో సాక్షాత్కరిస్తా నన్నది పరమాత్మ
వివిధ సంప్రదాయాల ఆరాధనలే
వివిధ మతాల అధి దేవుళ్లు!
మన అభిలాష ప్రతి బింబాలే
మనం కొలిచే దేవతా మూర్తులు!
గుడికి వెళ్లినా, గదిలో కూర్చున్నా ఒక్కటే,
కావలసింది ఆరాధనలో ఏకాగ్రత!

## 65. వారసత్వం

నా జన్మకు, నా జీవిత వికాసానికి
నా తల్లిదండ్రులు కారకులు కాదు.
కేవల నిమిత్త మాత్రులు మాత్రమే.
ప్రకృతి పురుష ద్వైతాద్వైత పరమాత్మ నుంచి
నా వారసత్వాన్ని నా కందజేసిన వాళ్ళు.
నీ విషయం కూడా అదే
మన ఇద్దరి కర్తవ్యమూ అదే
ఏ వారసత్వానికైనా మూలనిధి ఒక్కటే,
సంపదలోని వైవిధ్యం
సంపాదించే పద్ధతిలోది!

## 66. పులి, నక్క, గొర్రె

పులి, నక్క, గొర్రె –
అనేది నా సాంఘిక సిద్ధాంతం!
గొర్రెల నుంచే నక్కలు పుడుతున్నై,
నక్కల నుంచే పులులు పుడుతున్నై!
పులులూ, నక్కలూ కలిసి
గొర్రెల్ని భోంచేస్తూ కూర్చున్నై!

## 67. భయమే బ్రతుకా?

క్షణ క్షణం భయం భయంగా బ్రతకడమే
నిజంగా బ్రతకడం అంటాడు గద్దర్!
నిజమే నేమో! కాకపోతే -
నక్కలూ, పులులూ పిచ్చి పిచ్చి ఆకళ్ళతో
వెర్రెత్తి తిరుగుతున్న ఈ అడవిలో
ఇన్ని అమాయకపు గొర్రెలు ఎలా బ్రతుకుతున్నై!
తమను తినేస్తున్న నక్కల కంటే, పులుల కంటే
శతాధిక శాతంలో ఎలా విస్తరిల్ల గలుగుతున్నై!

## 68. ఆత్మ, శరీరాలు

కవిత్వం ఆత్మ -
సాహిత్యోద్యమాలు శరీరాలు.

అజరామరమ్మై నట్టిది ఆత్మ,
వస్తూ పోతూండేవి శరీరాలు.
శరీరాలు పేర్లతో ఆత్మను పిలుస్తున్నావా?

కట్టుకొన్న చీర్ల పేర్లతో పిలుస్తూ
సరస్వతిని వేధిస్తున్నావా?

# 69. సరస్వతి చీరలు

భావ కవిత్వం, అభ్యుదయం కవిత్వం
సంప్రదాయ కవిత్వం, విప్లవ కవిత్వం
పద్య, గేయ, వాక్య, వచన కవిత్వాలు

అన్నీ రకరకాల దుస్తులతో, అలంకారాలతో
సరస్వతి కనిపించే రూపాలు!

సనాతన కాలంలో సరస్వతి
కంచి పట్టు చీరలు కట్టింది!
అధునాతన కాలంలో ఇపుడు
అమెరికా జార్జెట్లు, రష్యా మిడీలు,
జపాను జీన్సూ ధరిస్తున్నది!

అంతమాత్రం చేత ఆమెను
"ఏ రిక్షా! ఏ టాక్సీ!" అన్నట్టు
దుస్తుల పేర్లతో పిలవ వచ్చునా?

# 70. కవిత్వం ఉద్యమాలు

కవిత్వం వేరు
ఉద్యమ సాహిత్యాలు వేరు.
కవిత్వం జీవనది,
ఉద్యమ సాహిత్యాలు దాని లంకలు,
శాఖలు, వరదలు, వెల్లువలు!

జీవనది ఒక నిత్య నిరంతర ప్రవాహం,
వెల్లువలు వస్తుంటై, పోతుంటై!

మానవుడా!
ఇరవై వరకు, అరవై పైనీ
నీవు జీవ నదివి, కవితా ధారవు!
నడుమ నలభై యేండ్లా నీ జీవితం
ఎండలు, తుఫానులు, హిమపాతాలు, ఉద్యమాలు!
కంకర రాళ్లు, రాత్రి విగ్రహాలు!
శ్రమ, స్వేదం, నెత్తురు!

## గ్రీష్మ నఖం

ప్రియురాలు గిచ్చితే నఖ క్షతం
విషకన్య గిచ్చితే నఖా ఘాతం,
నఖ క్షతం స్వ పక్షం
నఖా ఘాతం పర పక్షం.
నఖం మాత్రం నిష్పాక్షిక సమ పక్షం!

## 2. తన కోసమే

మానవుడి కార్య కలాపా లన్నీ
సొంత సుఖ సంతోషాల కోసమే!
అది కళా సృష్టి కానీ, ప్రజాసేవ కానీ,
మత బోధ కానీ, రాజ్యపాలన కానీ.

## 3. ఇక్కడే వున్నా

నీ కోసం వెతుకుతూ
అందా లన్నీ చూశాను
ఆనందా లన్నీ అనుభవించాను
నిన్ను తల దాల్చిన అందాలు
నిన్ను మరిపించిన ఆనందాలు!

తిరిగి తిరిగి, వెతికి వెతికి, గుండ్రంగా
బైలు దేరిన చోటికే వచ్చినట్లున్నాను -
గుమ్మంలోనే నిలబడి వున్నావు నీవు
నా పూల సజ్జతో!

అవును, ఎక్కడికి వెళ్లాను నేను?
లేదు, ఇక్కడే వున్నాను
ఇక్కడే! నీ తోనే! నీ వున్న చోటే!

## 4. దృక్కోణం

ఉగాది ఒడలి నిండా -
నఖ క్షతాలా అవి?
మామిడి చిగు ళ్లంటాడు కాళిదాసు,
నెల వంక లంటాడు వాత్స్యాయనుడు,
ప్రభుత్వం ప్రకటించిన కొత్త పన్నుల
కాట్లంటాడు ప్రతి పక్ష నాయకుడు.
ఎవరి దృక్కోణం వారిది!

## 5. దూరమే అందం

సూర్యుడు అంత దూరంలో వున్నప్పుడే
అతడు లోక బాంధవుడు,
ముఖంతో పోల్చబడేది
దూరస్థ చంద్ర బింబమే!

నీవు గౌరవించే వ్యక్తి దైనందిన జీవితాన్ని
మరీ దగ్గరగా పరిశీలించకు,
ఎంత గొప్ప వెండి కొండైనా
దూరానికే అది నునుపు!

## 6. సహ జీవనం

భక్తి, నీతి, ప్రేమ, కామం -
సహ జీవనం చెయ్యాలి ఈ నాలుగూ!
భక్తి లేకుండా నీతి నడుస్తుంది, కాని
నీతి లేకుండా భక్తి నిరర్థకం!
ప్రేమ లేకపోయినా కామం ఫలిస్తుంది, కాని
కామం లేని ప్రేమ వట్టి గుడి దీపం!

## 7. ప్రేమ లేఖలు

ప్రేమికులు వ్రాసుకొనేవే ప్రేమ లేఖలు,
దంపతులు వ్రాసుకునేవి కావు.
దంపతులు ప్రేమించుకొన్న వాళ్ళే కావచ్చు, కాని
అడ్రసు తెలిసినాక అన్వేషణ ఎందుకు?
నిండు కౌగిట్లో కలిసినాక నిరీక్షణ దేనికి?

## 8. ప్రేమ - కామం

ఆ అమ్మాయి నా వంకే చూస్తున్నప్పుడు
అది పవిత్రమైన ప్రేమ,
మరొకరి కేసి ముఖం త్రిప్పిందా
అది కేవలం అపవిత్ర కామం!

ప్రేమ, కామం – ఈ రెండిటికీ నడుమ
అంత దూరం వున్నది కనుకనే
సూర్యుడు, చంద్రుడూ బ్రతకగలుగుతున్నారు,
ఎండా, వెన్నెలా ఆనందకరాలే అవుతున్నై!

## 9. స్త్రీ స్వామ్యం

ఈ సంసార రథాశ్వాల కళ్లాలను
పట్టు కోవలసిన చేయి నీదా? నాదా?
సత్య ప్రమాణకంగా నీదే!
సంసార వ్యవస్థా నిర్వహణ సర్వ హక్కులూ
స్త్రీవే, పురుషుడివి కావు.

మాతృస్వామ్యం పితృస్వామ్యమైన దుర్ముహూర్తమే
మగవాణ్ని ఇంటికుక్కగా మార్చింది!
విరాట్పురుషత్వాన్ని విరిచి పొయ్యిలో పెట్టింది!
పశు బలం తప్ప పురుషుడి కింకేం మిగిలింది?

## 10. పరదాలు

ఇల్లు స్త్రీది, రచ్చ పురుషుడిది,
రెండూ రెండు సామ్రాజ్యాలు!
పడతిని పరదాలో దాచిపెట్టే మగవాడు
మగసిరి కలవాడు కాడు నిజానికి!
అంత ప్పురాలూ, అసూర్యం పశ్యలూ
అసలు సూర్యుడికే తల వంపులు!

## 11. వి.ఐ.పి.

స్త్రీకి రక్షణ అవసరమే, అయితే అది
విఐపీ సెక్యూరిటీ దళంగా వుండాలి
జైలు గార్డుగా కాదు.
ఎందుకంటే – ఆమె చూలింతగా, బాలింతగా
విఐపీ లకే విఐపీ!

## 12. మౌన వాదం

నేను వాదిని, నీవు ప్రతివాదివి
నీకు మౌనమే భూషణ మైనప్పుడు
నీ తరఫున కూడ నేనే వాదిని!

వాదీ, ప్రతివాదీ, లాయరూ, జడ్జీ,
సాక్షి కూడ ఒకే వ్యక్తి అయినట్టిది మన కేసు!
ఇక చెప్పే దెవరు? వినే దెవరు?
న్యాయం జరిగే దెవరికి?

## 13. వెతకడం

ఎప్పుడూ వెతుక్కుంటూ వుండే వాడికి
నిజంగా ఏదీ దొరకదు!
దొరికిం దేదీ అతడికి పనికి రాదు!

నేనూ అలాంటి వాణ్నే, కాకపోతే
నీవు దొరికిన తర్వాత కూడ
ఇలా వెతకడ మేమిటి నా ముఖం?

## 14. మామిడిని

పుట్టగానే పరిమళిస్తుంది దవనం
మొగ్గ గానే కీర్తి కెక్కు తుంది మల్లె
క్రమంగా వికసిస్తుంది గులాబి
ఇవన్నీ నీవు తల మీద పెట్టు కొనేవే!
నిన్ను తల మీద పెట్టుకొనేవి కావు!

ఇక నే నంటావా?
నీ పాదాల వద్ద పుట్టి, నీతో ఎదిగి,
నీకు గొడుగు పట్టిన మామిడిని!
ఆలస్యంగా వికసించినా
అజరామరంగా ఫలించిన నీ వాణ్ణి!

## 15. పరమాత్మ బీజం

పెట్టి పుట్టడం, పురాకృతం, తల వ్రాత
వంటి వ్యూహాలు కేవలం అపోహాలు
ప్రతిభా వికాస సాఫల్యాలు బీజం తోడివి,
బీజం పరమాత్మ నుంచి మనస్సు సేకరించే
బహు ముఖ సంపదలలో ఒకటి!
ప్రతిభ బీజం తోడిది
బీజం పరమాత్మ లోనిది.

## 16. ఏకాగ్రత

"మనస్సు వికలమైతే
పగిలిన అద్ద మవుద్ది బ్రతుకు, కనుక
స్థిరంగా వుంచుకో మనస్సును" అంటాడు యోగి!
ఏకాగ్రమైన మనస్సే కదా పరమాత్మలోని బీ జాత్మ?
బీజంలోని గుణా లన్నీ పరమాత్మలోవే కదా?
మరి మనోవైకల్యం ఎక్కడిది?
ఏకాగ్రత దేనికి?

## 17. పూరణ పూరకాలు

లోకాన్ని అర్థం చేసుకోకుండా
లోల మనస్కులం కాగూడదు,
మనం ఒకరి కొకరం
పూరణ పూరకాలం
అతికితే దంపతులం,
అతక్కపోతే సహ యాత్రికులం!

## 18. రిడిల్

తండ్రి గరగర, తల్లి పీచు పీచు
బిడ్డలు రత్న మాణిక్యాలు అనేది రిడిల్
తండ్రి బూర్జువా, తల్లి లేబరు
బిడ్డలు సోషలిస్టులు అనేది వాస్తవం!
ఆ రిడిల్ ఒక శాశ్వత వాస్తవం!
ఈ వాస్తవం ఒక చక్రభ్రమణ రిడిల్!
అది సహజం,
ఇది కృతకం!

## 19. ప్రేమ - పెళ్లి

ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకోకు,
పెళ్లి చేసుకొంటే ప్రేమ నిలవదు.

ప్రేమ ఒక మధుర భావన,
పెండ్లి ఒక వాస్తవ సహజీవన ధర్మం.

ప్రేమ హృదయంలోనే దాచుకో వలసి నట్టిది
పెండ్లి లోక విహారం చెయ్య గలిగి నట్టిది.
ప్రేమను ఇంటి దాకా తేకు!
ఇంటిని వీధిపాలు చెయ్యకు.

## 20. అన్నం కావాలి

అన్నం కావా లనేది కోరిక,
కోరికకు హేతువు ఆకలి!
ఆకలిని చంపుకోవడ మెలా?
అన్నం కావాలి, తప్పదు!

## 21. అర్హత

నీవు శివు డంతటి సోషలిస్టువా?
వామను డంతటి పొలిటీషియను వా?
బుద్ధు డంతటి హ్యూమనిస్టువా?
అయితే, భిక్ష మెత్తే అర్హత నీ కుంది?

## 22. అన్నదానం

అందరికీ సమానంగా దొరకవలసింది అన్నం,
మొత్తం అన్నాన్ని ఏ ఒక్కడో సొంతం చేసుకొని
తాను కలవాడైతే, తక్కిన వాళ్ళు లేని వాళ్లు కారా?
లేనివాళ్ళకు అన్నదానం చేస్తాడా ఈ కలవాడు?

అన్నదానం చేసేవాళ్ళు దోపిడీ దొంగలు
అన్నదానం మహా పాపం!

## 23. లక్ష్య భేదం

ప్రవరు డంతటి నిష్ఠానిధి కూడ
వరూధినిని తోసి వెయ్యడానికి
చేయి ఎక్కడ వేశాడో చూశావా?
అతడే ఒక దొంగ అయి వుంటే
చేయి మెడలోని గొలుసుపై పడేది!

## 24. దేవుడే ఏడిస్తే

రాముడు సాక్షాత్తు దేవుడే అనుకొంటే
అత డేడిస్తే మనకు నవ్వు రాదా?
రాముడు మానవుడు కనుకనే
అతడి కష్టాల పట్ల మన కంత సానుభూతి!
మాయాసీత ఏమైపోతే మనకేం?
అసలు సీత బాధపడితేనే మనకు బాధ!

## 25. విశ్వ కుటుంబి

ఇతర్ల కోసం వండే ప్రజా హోటలు కాదు నాది,
నా కోసం నేను వండుకొనే స్వగృహం!
అయితే, నేను విశ్వ కుటుంబిని కనుక,
నేను వండుకొన్నది లోక మంతకూ సరిపోతుంది!

## 26. నా సాహిత్య విందు

నష్టం వచ్చిన లక్షాధికారి బిచ్చగాడు కావచ్చు,
నిధి దొరికిన బిచ్చగాడు లక్షాధికారి కావచ్చు.
మనం గుర్తించవలసింది కలిమి లేములను కాదు
మనిషిని! మనిషి అవసరాన్ని!
అందుకే నా సాహిత్య విందు అందరికీ,
కలిమి లేములు, దేశ కాలాలు లేకుండా
అందరికీ, మనిషైన ప్రతివాడికీ!

## 27. బ్రతుకుతున్న బొమ్మలు

మనిషి ఆకారంలో కనపించే ప్రతి వాడూ -
అవును, మనిషే!
అయితే, మరి - ఈ మూర్ఖులూ, క్రూరులూ,
పందలూ, బానిసలూ అంతా ఎవరు?
మనం తయారు చేసిన విగ్రహాలు!
మట్టి, రాతి, కొయ్య, పీచు బొమ్మలు!
ఆత్మ జ్యోతికి దూరంగా వుంచబడ్డ
చీకటి నీడలు.
ఎందుకు తయారు చేశాం?
మన దురాశలు తీర్చడానికి,
మనకు చాకిరీ చెయ్యడానికి!

## 28. బలి

ఏకం సత్, సోహం, తత్ త్వమసి అనే సత్యం
తెలిసిన వాళ్లకు మానవత లేదు,
మానవులుగా వున్న వాళ్లకు సత్యం తెలియదు!
తెలిసిన వాళ్ల స్వార్థానికి
తెలియని వాళ్లు బలి!

## 29. నీరు - అల

సముద్రంలో అల లేచి పడే టట్టే
పరమాత్మలో ఆత్మ పుట్టి గిడుతుంది.
అన్ని అలల లోదీ నీరే, కాని
ఒకే నీరు కాదు, దేని నీరు దానిది!
విరిగి పడిన అల నీరే సిసలుగా
తిరిగి లేచిన అలలోకి రాదు,
నీటికి అలతో వచ్చిన క్రియాశక్తి
ఆ అలతోనే పోతున్నది!
ఏ జీవితాని కా జీవితం సర్వ స్వతంత్రం,
ఇరుగు పొరుగును గమనించుకొంటూ పద!

## 30. పొరుగు వాడు

నీ వేదైనా ఒక పని చేస్తున్నప్పుడు
చూస్తూ వూరుకోడు నీ పొరుగు వాడు!
తోడ్పడ వచ్చు, అడ్డు పడవచ్చు,
పోటీ పడవచ్చు!
స్వ శక్తినీ, పర శక్తినీ అంచనా వేసుకో,
ఆత్మీయమైన ఏ పనినీ బహిరంగంగా చెయ్యకు!

## 31. వాడినాక

కాడపై కుసుమం వున్నంత వరకే
పోటీపడి చుట్టూ మూగుతై తుమ్మెదలు.
అది వాడినాక అవి ఎందుకు వస్తై?
విసర్జిత నన్న ఏడ్పు కాడకు దేనికి?

## 32. కోకిలవో, గొడ్డలివో

ఆరాధించే వాళ్లకు ఏ రాయైనా దేవుడే
ద్వేషించే వాళ్లకు ఏ దేవుడైనా రాయే!
రసాల మెప్పుడూ ఆనంద రసాల సాలమే
నీవు కోకిలవో, గొడ్డలివో నీవే తేల్చుకో!

## 33. అవిచక్షణ

ఉల్లీ పచ్చడికే, మల్లీ పచ్చడికేనా?
మేకా కూరకే, మేనకా కూరకేనా?
హలమూ దున్నడానికే, కలమూ దున్నడానికేనా?
బర్రెనూ కొనుక్కోవడమే, భర్తనూ కొనుక్కోవడమేనా?
అయితే, అలాటి వ్యవస్థ మనకు వద్దు!

## 34. ప్రతి పంది

ఏ సంస్కారమూ లేని సారా కాంట్రాక్టరుకు
సర్వ విద్యలూ నేర్చిన విదుషి సెక్రటరీ!
నోట్లతో వోట్లను కొని గెల్చిన బడాచోర్‌కు
ఐపిఎస్ మహావీరుడు సెక్యూరిటీ గార్డు!
వేద వేదాంత విద్యా పండిత పీఠానికి
పండిత పుత్రుడైన పరమ శుంఠ వారసుడు!
రత్న గర్భ ఈ ధాత్రి! అయినా, దీన్ని
ప్రతి పందీ తొక్కుకు పోతూనే వుంది!

## 35. అనంత ముఖుడు

సృష్టిలో ఎన్ని వైరుధ్యా లున్నా
అ వన్నీ ఒకే కేంద్రానికి బహుముఖాలు,
ఏక ముఖులు ప్రజ లైతే
నానా ముఖులు వారి నాయకులు!
ఏ ముఖం వాడి నా ముఖంతో పలకరించే
అనంత ముఖుడే కేంద్రాధిపతి!

## 36. బ్రతికే వున్నాం

శత్రువుల ఒరల్లోని కత్తులు తుపాకులుగా
ఫిరంగులుగా, బాంబులుగా మారుతూ వచ్చినా
మన కత్తులు ఖడ్గాలుగా కూడ మారలేకపోయినై!
మనం శతాబ్దాలపాటు బానిసలుగా పడివున్నా
జాతి సమైక్యానికి ప్రయత్నమైనా చెయ్యలేకపోయాం!
అయినా బ్రతికే వున్నాం!
అదే మన గొప్పతనం!!

## 37. ట్రాన్సిస్టరు

మెద డొక చిన్న ట్రాన్సిస్టరు,
ప్రతి మెదడూ ఏదో ఒక కేంద్రానికి
ట్యూను చేయబడి నడిచే వ్యవస్థే.
మ రొక కేంద్ర మేదో అడ్డ మొస్తే
అప్పు డది విప్లవం!
ట్రాన్సిస్టరే ట్రాన్స్మిటరు కూడ అయితే
అప్పు డది సృజనాత్మకత!

## 38. నీ పాత్ర

ప్రతి కుటుంబ చరిత్రా ఒక నవల
ప్రతి వ్యక్తి బ్రతుకూ ఒక నాటకం.
దేన్నీ మరీ సీరియస్‌గా తీసుకోకు
నీ పాత్రను నీవు ఔచితితో పోషించుకో!
పెద్ద, చిన్న, మంచి, చెడు అనే వేం లేవు
ఆస్వాదించే వాడికి అన్నీ అమృత పాత్రలే!

## 39. ఛే రస్తా

శూన్యం నుంచి సృష్టి చెయ్యలేక పోతే
జరిగిన సృష్టికి అక్షరాభ్యాసం చెయ్యి!
కుడి, ఎడమ, ముందు, వెనక, పైని, క్రింద
ఈ ఛేరస్తాలో నిలబడి
అభ్యుదయం ఎటువైపో చూపు!
పెట్ట వలసింది పెద్దలకు తద్దినాలు కాదు
పాపాలకు గోరు ముద్దలు!

## 40. నే నెటుపోతే

నా జీవితం ఒక షడ్రుచుల నౌక
నా మనస్సు ఒక నవరసాల సముద్రం
నే నెటు పోతే అదే నా మార్గం
నే నెట నిలిస్తే అదే నా గమ్యం!

## 41. రసాలంకారాలు

రసాలూ, అలంకారాలూ, శయ్యలూ
ఈ సరంజామా అంతా ఎందుకంటావా?
గ్రోలే వాళ్లకు, అలరే వాళ్లకు, చొక్కి సోలే వాళ్ళకు
వాళ్ల కోసం ఇవన్నీ!
ఆహార మాత్రుల కోసం కాదు!

## 42. దేవుడంటే

దేవుడంటే -
మేధావికి విశ్వశక్తి, భక్తుడికి ప్రసాదం,
కార్మికుడికి పని, కవికి ప్రేయసి,
దొంగకు ఒడుపు, దొరకు బాడీగార్డు,
సామాన్యుడికి సొంత వైద్యుడు.
నాకు నీవు!

## 43. విగ్రహాన్ని బట్టి

ఛందస్సు అంటే -
అ దొక రెడీమేడ్ దుస్తుల ఏర్పాటు,
అ దొక బ్యూటీ పార్లర్!
అక్కడ ప్రతి సైజుకూ యూనీఫారం లున్నై!
నీ విగ్రహాన్ని బట్టి దుస్తుల్ని ఎంచుకో!
మరీ ఎత్తరివైతే, కొత్తవి నిర్మించుకో!

## 44. సరస్వతి ఒక్కతే

ఆధునిక కవిత, ప్రాచీన కవిత అనేం లేవు,
సరస్వతి ఒక్కతే నాడూ, నేడూ.
ఆనాడు కంచి పట్టు చీరలు కట్టింది,
ఈనాడు మినీ స్కర్టులు వేస్తున్నది!

## 45. సమయ స్ఫూర్తి

జీవితం ఒక వింత జూదం,
పేకాట, రేసులు వంటివే కాదు –
రాజకీయాలు, వ్యాపారం, ధరలు,
ఎన్నికలు, ఇంటర్వ్యూలు అన్నీ జూదమే!
ఫేవరిట్ గుర్రం బోర్డు ఎక్కక పోవచ్చు!
లంచం మేపినా పని కాకపోవచ్చు!
గెలవడానికి చాణక్యం ఒక్కటే చాలదు
సమయ స్ఫూర్తి తోడ్పడాలి.

## 46. రసాద్వైతం

పెళ్లికి ముందు ద్వైతం
పెళ్లైన కొత్తలో అద్వైతం
పిల్లలు పుట్టిన తర్వాత విశిష్టాద్వైతం
ఈ అన్నిటి గుండా ప్రవహించే ఏకాత్మతే
మన రసాద్వైతం!

## 47. వెనక్కి చూచుకో

నీవు ఏ వయస్సులో ఏం చేస్తూ వచ్చావో
కొంచెం వెనక్కి తిరిగి చూచుకొంటూ వుండు!
అప్పుడు నీ జీవితంలో సుఖ శాంతులకు
ఏ దశలోను భంగం కలగదు!

## 48. వైయక్తికాలు

ఉత్తరాదికి ఉత్తరాయణం వలెనే
దక్షిణాదికి దక్షిణాయణం పుణ్యకాలం!
పుణ్యా పాపాలు, స్వర్గ నరకాలు వంటివి
దేశ కాలానుగత వైయక్తికాలు,
విశ్వ జనీన సత్యాలు కావు!

## 49. నీ పట్టు

నేను బైటికి చూచి నప్పుడు
నా అంతవాడు లే డనిపిస్తుంది
లోనికి తిరిగి నప్పుడు
నాపై నీ పట్టు కనిపిస్తుంది
కాయను కాడ పట్టిన పట్టు!
పక్షిని గూడు పట్టిన పట్టు!
గాలి పటాన్ని దారం పట్టిన పట్టు!

# 50. ఎవ రెవరో

ఎవ రెవరో, ఎంద రెందరో-
ఏ రైల్లోనో, ఏ సభలోనో
కబుర్లాడి పోతారు.
ఏ బడిలోనో, ఏ గుడిలోనో
కలిసి మెలిసి పోతారు.
ఏ క్రీడల్లోనో, ఏ ఎన్నికల లోనో
పోటీ పడి పోతారు.
ఇంటి దాకా వచ్చి పోతారు
గుండెను కూడ తట్టి పోతారు!
ఎక్కడి నుంచి వస్తారో!
ఏమై పోతారో!

## 51. నాయక లక్షణం

స్వలాభం కనిపించనిదే
ఎవడూ ఎవడి చుట్టూ చేరడు,
అనుచరులు కావా లనుకొంటే
ఆశలేవో కల్పించు.
అప్పుడప్పుడు అనుగ్రహిస్తూ వుండు,
అరచేతిలో బెల్లం పాడి వుంచుకొని
మోచేతిదాకా నాకిస్తూ వుండు!

## 52. గ్లామరు

వధూమణులు వరించేదీ గ్లామరు నటుణ్నే
వోటర్లు వరించేదీ గ్లామరు నటుణ్నేనా?
సీతాకల్యాణమూ కావ్య వస్తువే
సినీతార ఆరోపెళ్లీ కావ్య వస్తువేనా?
నటవిటులే నాయకు లైతే
నరలోకం నక్కల పాలే,
ఆలోచించండి!

## 53. ఎర

అటు వెళ్ళకు, అది ఎన్నికల సభ.
అది ఆకలి తీర్చే అన్నదాత కాదు
మత్తుగొలిపే మాటల మదిర!
విస్తట్లో కూర కాదు
వాగురలో ఎర!

## 54. కోరిక

ఒకో మనిషికి ఒకో కోరిక
అది తీరడమే పురోగమనం.
కోరికను చంపుకొన్నవాడు సిద్ధుడు
కోరికను తీర్చుకొన్నవాడు శివుడు!

## 55. సత్య సూక్తులు

దైవభీతి ఒక నిత్య కర్మ్యా
మతం ఒక జన్మ ఖైదు,
భక్తి ఒక వెట్టి చాకిరీ
ప్రార్థన ఒక అరణ్యా రోదన,
ఎప్పుడైనా సరే
ఎక్కడైనా సరే.

## 56. రెండు సంధ్యలు

బాల్యం తెలియకుండానే గడిచిపోతుంది
వృద్ధాప్యం తెలిసి బాధిస్తుంది.
చీకటి నుంచి పుట్టేదీ
చీకటిలో కలిసి పోయేదీ
రెండు సంధ్య లవి!

## 57. బలహీనతలు

కామం, కనకం, మద్యం, ద్యూతం
నాలుగూ మానవ బలహీనతలు.
వీటిని నిషేధించగూడదు
నియంత్రించాలి.
నిషేధిస్తే చీకటిలోకి పోతాయి
భూతాలై చెలరేగుతాయి.
అప్పుడంతా భూతరాత్రే
పగలే వుండదు!

## 58. గర్జించు

కుడితే తేలు
కుట్టకుంటే కుమ్మరి పురుగు.
నీవు పురుగువు కావద్దు
కుట్టను కూడ వద్దు
గర్జించు!
కనీసం మొరుగు!!

# 59. ప్రజా కవి

ప్రజా కవి అంటే ఎవరు? ప్రశ్న!
ప్రజ లంటే ఎవరు? ప్రతి ప్రశ్న!
ప్రజ లంటే -
రైతులా? కూలీలా?
ధనికులా? దళితులా?
యజమానులా? కార్మికులా?
లోభులా? దాతలా?
ఎవరు?

ఏదో ఒక వర్గం ప్రజల కోసం వ్రాసేవాడు
అపరిమితుడు కాదు, పరిమితుడు
ప్రజాకవి కాదు, వర్గ కవి.

ఏ వర్గానికి చెందిన వాడైనా
మనిషి మనిషే!
మనిషి కోసం వ్రాసేవాడే కవి!
అతడే నిజమైన ప్రజా కవి!

## 60. తేడా

"ఏమిటి ఆస్పత్రికి వచ్చారు?" అడిగాడొక మిత్రుడు
"తల తిరుగుతున్నది" చెప్పాను నేను
"వృద్ధాప్యం, పాపం" జాలిపడ్డాడతడు
వృద్ధు డనిపించుకోవడం ఇష్టం లేదు నాకు,

"ఏమిటి ఆస్పత్రికి వచ్చారు?" అడిగాడు మరో
మిత్రుడు
"ఏదో వృద్ధాప్యం కదా" అన్నాను నేను
"ఆ, మీకు వృద్ధాప్య మేమిటి?" అన్నా డతడు!
ఎంతో సంతోషపడ్డాను ఆ రిమార్కుకు.

## 61. శత్రువులు కాదు

కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు
ఆరూ మనిషికి శత్రువు లనడం
ఎంత అజ్ఞానం!
ఇవి శత్రువులు కావు
సెక్యూరిటీ గార్డులు!
ఇవి లేకపోతే
బ్రతకలేడు మనిషి
బ్రతక నివ్వదు లోకం.

## 62. అర్హత

సవర్ణులూ, హరిజనులూ ప్రక్కప్రక్కగా
ఒకే వీధిలో నివసించగల్గి నప్పుడే
ఈ దేశానికి స్వరాజ్యం వచ్చినట్టు
ఈ జాతి వీర్యవంతమైనట్టు
ప్రపంచ మానవ నాగరికత లోకి
ప్రవేశార్హత లభించినట్టు.

## 63. పాము

పదవీ రాజకీయాలు
తెల్లమార్కెట్ల నీడలలో నల్లపాములు!
కవి పాములవాడు కావాలి
తానే ఒక పాము ఆడ గూడదు.

## 64. చెంబెడు

మహా సముద్రంలో
బురద వాగూ కలుస్తున్నది
పవిత్ర గోదావరీ కలుస్తున్నది
మహాసముద్రంలో మార్పేమీ వుండదు.
అందులో చెంబెడు నీళ్లు పోసి
చెంబెడు నీళ్ళు తీయవచ్చు. కాని
అవీ ఇవీ ఒకటే కాబోవు.

## 65. కవి

నేను కవిని కాను కాని
కవి సమ్మేళనలలో పాల్గొంటాను!
నాకే సభ్యతా లేదు కాని
అన్ని సభలకు అధ్యక్షత వహిస్తాను!
నాకు ప్రజల భాష తెలియదు కాని
ప్రజానాయకత్వాన్ని డబ్బిచ్చి కొనుక్కొంటాను!

## 66. శపించడం

నేను శపిస్తే ఏం కాదు, అయినా
శపిస్తూనే వుంటాను మానవ మృగాలను.
మృగాలు కూడ నన్ను శపిస్తూనే వున్నై
నేను మానవుడిగా లేచి నిలబడినప్పుడెల్లా,
శపించడం, దీవించడం వట్టి అలవాట్లు
మురిగిపోయే వోట్లు!

## 67. లవ్ యూ లు

నేటి ప్రభుత్వ సంస్థల విద్యార్థులలో
కొద్ది మంది ఏకలవ్యులు,
చాల మంది అనేక లవ్యులు.
మొత్తం మీద అందరూ చెడిపోతున్నది
ఈ "లవ్యూ"ల (Love you) వల్లనే!

## 68. సాంకర్య భయం

వర్ణ వ్యవస్థకు కారణం
వర్ణ సాంకర్య భయం.
భయం నిజమే అయింది,
రామాయణ భారత పురాణ పురుష
లందరికీ జననావకాశం కల్పించింది.
అప్పుడే కాదు, ఎప్పుడూ కూడ
విశ్వ నరు లంతా
స్వేచ్ఛా ప్రణయ ఫలాలే!

## 69. వధ్య శిలలు

ప్రేమించిన వ్యక్తిని ధర్మంగానో, అధర్మంగానో
అనుభవించా లనుకోవడం జీవ లక్షణం.
ఈ లక్షణం ఉభయులకూ సమానమే, కాని
ఎక్కువగా మగ గుండెలే ఆడ కోరికలకు
వధ్య శిల లవుతున్నా యెందుకో?

## 70. అడుక్కు తినడం

బ్రతకడానికి పనిచేస్తున్నావు, మరి
ఏం చెయ్యడానికి బ్రతుకుతున్నావు?
దాదాగిరీలు, వసూళ్ళు, పార్టీ ఫండు,
విరాళాలు, లంచాలు వంటి వన్నీ
అడుక్కు తినడాలే కదా?
అడుక్కు తినడానికా బ్రతుకుతున్నావు?
నీ బ్రతుక్కు సర్వజనీన పరమార్థం
ఏదేని వున్నదా?

## 71. పుత్రా దిచ్ఛేత్

"పుత్రా దిచ్ఛేత్ పరాజయం" అనే పురాణ వాక్కు
ఈ నాటికి ఫలించిందో యేమో....
అధికార పీఠ మెక్కిన ప్రతి తండ్రీ
కొడుకుల చేతిలో
చావు దెబ్బలు తింటున్నాడు!

## 72. భక్తులు

మూడో కన్ను తెరిస్తే ముల్లోకాలూ
భస్మమైపోతా యనుకొంటున్న ముక్కంటిని
మూడు ముక్కలుగా నరికి పోయాడు గజ్నీ!
మరి, భక్తు లేమైపోయినట్టు?
తమ దేవుణ్ని కాపాడుకోలేని నిర్వీర్యులు
ఏమైపోతే నేం లే!

## 73. కుండలిని

ఏ జీవికైనా
కుండలినీ శక్తే జీవ శక్తి.
సామాన్యులలో అది నిద్రాళువు
అప్పుడప్పుడప్పుడు ఉలిక్కిపడి లేచి
మళ్లీ నిద్రలోకి జారిపోతుంది.
మహాయోగి దానిని బలవంతంగా లేపి
చెరిపేట్టి ఊడిగం చేయించుకొంటాడు.
అదే తనకు తానై వరించి వచ్చినప్పుడు
అవడు యోధుడు, విజ్ఞాని, మహాకవి!

# వర్షా నఖం

చెయ్యవలసిన పనీ ఎంతో వుంది
తిండిలేని నిరుద్యోగులూ ఎందరో వున్నారు
పని చెప్పి తిండి పెట్టే నాయకుడే లేడు!

చేలోని పంట ఎండీ, తడిసీ పాడైపోతున్నది
గట్టు మీది జనం ఆకలో అంటూ చస్తున్నారు!
అన్నార్తులు చేలో దిగరు
అన్నం దానంత టది గట్టు పైకి రాదు.
పని కాదు, ఆకలి పోదు!
ఎవ డయ్యా ఇక్కడ దేముడు?

## 2. ఉద్యోగ మంటే

ఉద్యోగం పురుష లక్షణం, అవునా?
మరి, ఈ నిరుద్యోగు లంతా ఎవరు?
పాపం, వాళ్లూ పురుషులే, అయితే-
ఉద్యోగ మంటే ప్రభుత్వోద్యోగమే అనుకొని
మోస పోతున్న అమాయకులు!
ఉద్యోగ మంటే నౌకరీ కాదు
స్వప్రయత్నమూ, స్వయం కృషీ ను.

## 3. క్రియా శీలత

ఎంత పెద్ద ఆఫీసర్ అయినా నౌకరే
కిళ్ళీ కొట్టువా డైనా స్వతంత్ర పౌరుడే.
జీతం ఎంత పెద్దదైనా, యజమాని ఇచ్చేది
రాబడి ఎంత తక్కువైనా స్వయంగా ఆర్జించేది.
కనుక, ఓ నిరుద్యోగులారా
అపోహలు మాని, క్రియాశీలురు కండి!

# 4. నిరుద్యోగం ఎక్కడుంది

నిరుద్యోగం ఎక్కడుంది?
ఉద్యోగ మంటే సర్కారు కొలువు అనుకోడంలో వుంది.
కూటి కోసం కోటి విద్య లున్నా యన్న వాస్తవం
విద్యావంతులకు తెలియక పోవడంలో వుంది.
ప్రజల సంపదను అనేక రూపాల్లో కొల్లగొట్టి
రాజకీయ రంగం తినేయడంలో వుంది.
కార్మికుడైనా, కర్షకుడైనా, నాయకు డైన తర్వాత
ఖామందుగా మారిపోవడంలో వుంది.
ఎవరో చెపితేనే కాని ఏ పనీ చెయ్యలేని మన
నిష్ప్రతిభలో వుంది, నిష్క్రియలో వుంది.
నిజానికి నిరుద్యోగం బై టెక్కడో లేదు
అది మన మస్తిష్కంలో వుంది!

## 5. యజమాని - బానిస

ఎంత కాలంగా బ్రతుకుతున్నా మనేది కాదు
ఎలా బ్రతుకు తున్నా మనేది ప్రశ్న.
బానిస తనకు తానుగా బ్రతకడు
యజమాని కోసం బ్రతికించి వుంచబడతాడు!
కుక్కలు, గొర్రెలు, బర్రెలు, గుర్రాలు
కోళ్ళతో పాటు పెంచబడతాడు!
నీవు బ్రతుకు తున్నది బానిస గానా?
యజమాని గా నా?

## 6. పడి చావడం

డబ్బు కోసం పడి చచ్చేవాడు నిత్య దరిద్రుడు
కీర్తి కోసం పడి చచ్చేవాడు మృత జీవుడు
పదవి కోసం పడి చచ్చేవాడు పగటి దొంగ
సుఖం కోసం పడి చచ్చేవాడు దుఃఖితుడు
ముక్తి కోసం పడి చచ్చేవాడు మూర్ఖుడు!

## 7. నేటి యువకులం

మేం విజ్ఞాన యుగంలోని యువకులం!
నల్లి కుడితే మంచాన్ని విరగ్గొడతాం
ఎలక మెదిలితే ఇంటినే తగల బెడతాం!
నల్లిని చంపలేం,
ఎలకను తరుమలేం!

## 8. సత్యాగ్రహం - యుద్ధం

యుద్ధం చెయ్యి అన్నాడు కృష్ణుడు
సత్యాగ్రహం చెయ్యి అన్నాడు గాంధి
ఇద్దరూ కరక్టే!
సాయుధుడైన వీరుడికి చెప్పా డాయన
నిరాయుధుడైన బానిసకు చెప్పా డీయన!

## 9. వీరుడవు కా

రౌడీకి భయపడే వాడివి
రాజ్య మెలా పాలిస్తావు?
రాజ్య మెప్పుడూ వీరభోజ్యమే, కనుక
నీవు ముందు వీరుడివి కా!

## 10. రౌడీ - రాక్షసుడూ

ఆనాటి రాక్షసుడే ఈనాటి రౌడీ,
వీరుడు నాడూ నేడూ వీరుడే!
మానవత్వాన్ని పెంచి
పోషించా లనుకొంటున్నావా?
రాజ్యాన్ని రౌడీ రహితం చెయ్యి!

## 11. దొర - దొంగ

దొరికితేనే దొంగ,
అంతవరకు దొరే!
ఆ ఇద్దరూ అదృష్ట వంతులే,
మధ్య ప్రజలే నష్ట భాగ్యులు!

## 12. గూండాలు

గూండాలను ఎవరు సృష్టిస్తున్నారు?
న్యాయం దొరకని ప్రజలు!
గూండాలను ఎవరు పోషిస్తున్నారు?
న్యాయానికి దొరకని దొరలు!

## 13. వీరభద్రుడివి కా

భిక్ష మడిగితే వామనుడిలా అడుగు
భిక్ష పెడితే బలి చక్రవర్తిలా పెట్టు
త్యాగం చేస్తే దధీచిలా చెయ్యి
అవమానానికి ప్రతీకారం తీర్చుకోదలిస్తే
వీరభద్రుడిలా విజృంభించు!

## 14. అదే రాజరికం

రాజరికం, ప్రజాస్వామ్యం, నియంతృత్వం
ఏ పేరుతో పిల్చినా – ప్రభుత్వం అదే!
శక్తి కలవాడే రాజు, ప్రధాని, అధ్యక్షుడు, నియంత!
బలహీనుడే బంటు, పేద, కార్మికుడు, బానిస!

## 15. హరి హరులు

చట్టాలు, పోలీసులు, కోర్టులు
ఏవీ బలహీనుణ్ని రక్షించలేవు.
చక్రమో, త్రిశూలమో చేత లేకపోతే
హరిహరులు కూడ దాసానుదాసులే.

## 16. అతిశయ పూజ

రాముడు దొంగ దెబ్బలు కొట్టాడు
కృష్ణుడు స్త్రీ లోలు డయ్యాడు
ధర్మారాజు అబద్ధా లాడాడు
వామనుడు నమ్మక ద్రోహం చేశాడు
ఇంద్రుడు చెయ్యని పాడు పనే లేదు!
అధికులు స్వాతిశయం కోసం ఏ పని చేసినా
చెడు పని కా దనేదే మన సంప్రదాయం.

## 17. ప్రకృతి నైజం

పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణం పోకడ!
నిజమే, అది ప్రకృతి నైజం.
పిల్లికి చెలగాటం, మరో పిల్లికి ప్రాణం పోకడ
నైజమా, మానవుడా?
పశు పక్ష్యాదుల గుణాలను నీ గుణాలతో
పోల్చి చూచుకొని బాగుపడు, కాని
మరొక మనిషి నీపై పిల్లిలా దూకితే
ఎలకలా ఎందుకు వీగి పోతావు?

## 18. వద్దు పశ్చాత్తాపం

ఆలోచించ కుండా ఏ పనీ చెయ్యకు
చేసిన ఏ పనికీ పశ్చాత్తాప పడకు.
నీకు అవసరమైన పనినే నీవు చేస్తావు
అందుకు పశ్చాత్తాపం దేనికి?
పశ్చాత్తాపం అనేది ఒక దుర్బలత్వం
తప్పించుకోడాని కొక సాకు!

## 19. మనిషిగా బ్రతుకు

పట్టభద్రుడ వయింది ప్రభుత్వ సేవకేనా?
ప్రజాసేవ చేసేది పదవి కోసమేనా?
వనజాక్షిని ప్రేమించింది వంట పనికేనా?
తండ్రి ఆస్తి తగలేసేది తాగడానికేనా?
అయితే, ఇక నీవు
మనిషిబ్రతికే దెప్పుడు?

## 20. ఏది దగ్గర

నీకు చేతనైన పనిని చేసుకొంటూ
ఆనందంగా ఆత్మీయులతో బ్రతుకు.
స్వర్గానికి రైతు గృహం కంటె
రాజ భవనం దగ్గరేం కాదు!

## 21. కోరవలసిన వ్యవస్థ

అడిగితేనే కాని అమ్మైనా పెట్టదు
అనే సామెత మారాలి.
ఆందోళన చెయ్యకుండానే
అవసరా లన్నీ తీరాలి.
ఏడువకుండానే ఈప్సితార్థం లభించాలి
అదీ మనం కోరవలసిన వ్యవస్థ!

## 22. నిరోధక నీతి

నీతులు మూడు వర్గాలు -
ప్రకృతి వైరుధ్యాల నుంచి రక్షించేవి
సంఘ సహజీవనానికి తప్పనివి
వ్యక్తిత్వ వికాసాన్ని నిరోధించేవి!
నేను నిరసించేది ఈ నిరోధక నీతిని!

## 23. ఇంగిత జ్ఞానం

ఇంటి గుట్టు పోక్కే రావణుడు చచ్చాడు
అబద్ధాన్ని నమ్మే ద్రోణుడు చచ్చాడు
ప్రతి పక్షంతో షరీకై భీష్ముడు చచ్చాడు
మిత్ర ద్రోహం చేసి కర్ణుడు చచ్చాడు
రాజకీయ రంగం ఎప్పుడూ ఇంతే!
నిన్ను రక్షించేది నీ ఇంగిత జ్ఞానం!

## 24. ప్రతి వాడూ

ప్రతి శిశువూ మన్ను తినేవాడే
ప్రతి విద్యార్థీ అల్లరి చేసేవాడే
ప్రతి యువకుడూ దార్లు కాసేవాడే
ప్రతి ప్రౌఢుడూ పైసలు పోగు చేసేవాడే
ప్రతి వృద్ధుడూ అసంతృప్తుడే
ప్రతి తరంలోనూ ఇంతే!
ఇక మన ప్రత్యేకత ఏమిటి?

## 25. ఉద్యోగి కథ

కాపీ కొట్టి పాసయాడు
ఉత్తర దక్షిణలతో ఉద్యోగి అయాడు .
వెంటనే హక్కుల పోరాటం మొదలు పెట్టాడు.
ప్రశ్నలు వేసి ఫైళ్లను తిప్పేస్తూ
ప నేమీ చెయ్యకుండానే జీతం పుచ్చుకుంటాడు,
పని చేసినందుకు లంచం గుంజుకుంటాడు.
ఇదీ ఒక ఉద్యోగయ్య కథ!
కథ కంచికి పోకుండా
మన కే మంచీ జరగదు!

## 26. ఏం మిగిలింది

ప్రతిభ పరా రయింది
కాపీ కొట్టడం కళ అయింది
స్వార్థం రాజనీతి అయింది
అవినీతి బ్రతుకు తెరు వయింది
త్యాగం అణాగద్రొక్క బడింది!
ఇక, ఈ జాతి బ్రతికి వున్న దనడానికి
నిదర్శనం ఏం మిగిలింది?

## 27. బానిస మనస్తత్వం

అసూయా ద్వేషాలు, క్రోధ లోభాలు,
మద మాత్సర్యాలు బానిసకే వుంటై -
తన నోటి దగ్గరి ముద్దను మరొకడు
గుంజుకు పోతా డన్న భయం అది!

## 28. ఆలోచించు

బార్లకు వెళ్లే వాళ్లంతా తాగుబోతులు కారు
భిక్ష మెత్తే వాళ్లంతా దరిద్రులు కారు
డిగ్రీ లున్న వాళ్లంతా విద్యావంతులు కారు
ఎన్నికైన వాళ్లంతా ప్రజా ప్రతినిధులు కారు
నీతులు చెప్పే వాళ్లంతా నిజాయితీ పరులు కారు.

## 29. కొత్తేం కాదు

పైకెక్కేసి నిచ్చెనను తోసెయ్యడం
ఏరు దాటి తెప్పను తగలెయ్యడం
పాలు తాగి రొమ్ము గుద్దడం
తిన్న ఇంటి వాసాలు లెక్క పెట్టడం
దివాలా తీసి శ్రీమంతు డైపోవడం
ఆశ్రయ మిచ్చిన ఇంటికే నిప్పు పెట్టడం
కొత్తేం కాదు లోకానికి!
నీ జాగ్రత్తలో నీ వుండడమే నీ సంక్షేమం.

## 30. పిల్లి పిల్లలు

పిల్లి పిల్లల్ని కనేసి
ఇళ్ల మీదకు వదిలేస్తుంది,
ఆ మీద అవి చేసే న్యూసెన్సుకు
ఆ ప్రాంతాలలో సుఖ శాంతు లుండవు!
ఇక – కుక్కల రంగ ప్రవేశం కూడ దేనికో?

## 31. గొర్రెలు కనుక

ప్రతి మనిషీ అనుకొంటాడు -
తాను రైటూ, తక్కిన అందరూ రాంగూ అని!
నిజమే కావచ్చు! అయితే
మనుషుల్లో మెజారిటీ గొర్రెలు కనుక
నక్కల ముందు నోరెత్తరు!
పులుల ముందు తలెత్తరు!

## 32. కొడవలి

పరదా వెనుక దాచబడిన రత్నం కంటె
పంటచేలో అరిగి పోయిన కొడవలి విలువైంది!
మొదటి దాన్ని సమాజం రక్షిస్తుంటే
సమాజాన్నే రెండోది రక్షిస్తున్నది!

## 33. మా జేబులు

ఇక్కడ అనావృష్టి కరువా?
నోట్ల వర్షం కురిపిస్తాం,
అక్కడ అతి వృష్టి ముంపా?
నోట్ల కట్టలతో కరకట్టలు బాగుచేస్తాం,
కరువూ - ముంపూ ఒకదాని వెనక ఒకటి రాకపోతే
మా జేబులు పండే దెట్టా?

## 34. కోట్లు - వోట్లు

కరువు పనులూ, ముంపు పనులూ
ప్రతి యేడూ అవే పనులు!
కరువు కమిటీలూ, ముంపు కమిటీలూ
ప్రతి సారీ అవే కమిటీలు!
ఈ అన్నిటికీ ఖర్చు కోట్లు,
జమ వోట్లు!

## 35. అవే మళ్లీ మళ్లీ

అవే వానలు, అవే నదులు, అవే వరదలు
అవే పల్లపు ప్రాంతాలు, అవే ముంపులు
అవే ప్రజల యేడ్పులు, అవే పలాయనాలు
అవే ప్రతి యేడూ, అవే మళ్లీ మళ్లీ!
వీటికి శాశ్వత పరిష్కారం లేదా అంటే
వుంది, కాని -
ఇ వన్నీ నిజంగానే పరిష్కార మైపోతే
ఇక, మా ముఖ మెవడు చూస్తాడు?
మాకు వో ట్లెవ డిస్తాడు?

## 36. నీతి - అవినీతి

నీతికీ, అవినీతికీ తేడా ఏం లేదు
తనకు దక్కిన సుఖం నీతి,
మరొకడికి దక్కిన సుఖం అవినీతి!
లోక దుఃఖా లన్నిటికీ కారణం
ఈ దక్కని బియ్యపు గింజలే!

## 37. భిక్ష

నీ కెవడో ఏదో చెయ్యలే దని విమర్శించకు,
నీ వెవడికైనా ఏదైనా చేశావేమో ఆలోచించుకో!
ఇతరుల నుంచి ఆశించేవాడు క్షుద్రుడు,
ఇతరుల కిచ్చేవాడు రుద్రుడు!

## 38. సమస్య కాదు

పరిష్కరించ లేని సమస్యలతో చచ్చే కంటె
అవి సమస్యలే కా వనుకొని బ్రతకడం మేలు.
వెలుగుకు నీడ సమస్య కాదు
పనస పండుకు కడుపు కోత సమస్య కాదు
పచ్చిక బీడుకు ఆల మంద సమస్య కాదు.
రవి చంద్రులకు రాహుకేతువులు సమస్య కాదు.

## 39. వేట

అత డెవరో నీకు తెలియదా?
నీ కోసం వల పన్ని కూర్చున్న వేటగాడు!
వేట అతడి వృత్తి -
నీ జాగ్రత్తలో నీ వుండడం నీ విధి.

## 40. మేధావి - రౌడీ

మేధావి పిరికి వాడు, కారణం
తన కున్న దేదో పోతుందని భయం!
రౌడీ సాహసికుడు, కారణం
తనకు లేని దేదో దొరుకుతుం దని ఆశ!

## 41. అధికార మూర్ఖత

వీధిలో తనకు గిట్టని వాడొక డున్నా డని
వీధినే రద్దు చెయ్య మన్నాడొక నియంత,
చెరువులో నీరు తన శత్రువు కూడ తాగుతున్నా డని
చెరువునే పూడ్చెయ్య మన్నాడొక హంత!

## 42. వేళ్లు సమ్మె చేస్తే

మట్టి నుంచి మస్తిష్కం దాకా వికసించిన
ఈ అడవికి తోటమాలి లేడా?
మట్టి లోతుల్లోని వేళ్లకు
పుష్ప పరిమళం అందడం లేదు.
వికసిత పుష్ప ఫల భోగ భాగ్యాలకు
అసలు తా మెవరో తెలియడం లేదు!
కింది వేళ్లు సమ్మె చేస్తే
పై రంగు లే మవుతై?

# 43. అక్షర జ్యోతి

అక్షర లక్షల ధన తైలాన్ని మింగేస్తూ
అక్షర జ్యోతి వెలిగి పోతున్నది!
దాని నీడలోని నిరక్షర కుక్షుల
గుడుంబా మత్తును సొమ్ము చేసుకొంటూ
ఫైవ్ స్టార్ హోటళ్లు పండగలు చేసుకొంటున్నై.
ఆ పండగల విందుల పరిశిష్టం కోసం
పక్క సందుల్లో ప్రతీక్షిస్తున్న పంది కొక్కులు
సెక్సు క్రైం థ్రిల్లర్లతో
కడుపులు నింపుకొంటున్నై.
ఓహో! అక్షర జ్యోతీ!
నీ కాంతి కిరణ సంపుటాల క్రీనీడల్లో
ఎంత శ్రేయో చీకటి సంపన్నత!
ఎంత సంపన్న సంక్షేమ కార్యక్రమం!

## 44. శ్రమ - సన్మానం

"సారాహార సమార్జన వేళ్లది
సన్మానము పువ్వులది"
అంటూ విమర్శించింది నేనే; అయితే -
పూలకు సన్మానాలు పెరిగే కొలదీ
వేళ్లు మరీ ఉత్సాహంతో పని చేస్తున్నాయి!
ఏమిటీ వైపరీత్యం?
వైపరీత్యం ఏం లేదు -
వేళ్లూ తానే, పువ్వూలూ తానే అనే జ్ఞానం
చెట్టు కుంది, మానవులకు లేదు!

## 45. పులుల పెత్తనం

సత్యం, అహింస, త్యాగం, పరోపకారం
నీతి శతకాలు, వేదాంత సూక్తులు ఎన్నెన్నో!
అందులో ప్రతి సూక్తీ ఒక ప్రగతి ప్రణాళికే!
ప్రణాళికలు లేక కాదు ప్రజలు చస్తున్నది,
వాటి అమలును పులులు చేబట్టడం వల్ల!

## 46. ఊడ

ఎంత ఎత్తులో పుట్టినా
ఊడ క్రిందకే దిగుతుంది,
ఎంత క్రిందులో పుట్టినా
కొమ్మ పైకే ఎదుగుతుంది.
ఎక్కడ పుట్టా వన్నది కాదు ప్రశ్న,
ఎలా పెరిగా వన్నది!
పైన పుట్టిన ఊడల్ని పైపైకి ఎక్కిస్తూ
క్రింద పుట్టిన కొమ్మల్ని క్రింది క్రిందికి తొక్కేస్తూ
సహజ ధర్మాన్ని అరికడుతున్న కులతత్వ వాదీ!
నీ సనాతన మహా వృక్షం
పుల్ల విరిగి పోతూ వుంది
గమనిస్తున్నావా?

## 47. కళాభిజ్ఞ

కళాకారుడివి కావాలనుకొంటే
ఏదో ఒక కళను ఆరాధించు,
కళాకారులకు నాయకుడివి కావా లనుకొంటే
ప్రతి కళ గురించీ ఏ కొంచెమైనా తెలుసుకో!

## 48. సేవకుడు

ఎవరు నీవు?
నేనా? తెలియదు
ఏ వూరు? - తెలియదు
నీ తలిదండ్రులు? - తెలియదు
నీ కులం? - తెలియదు
నీ మతం? - తెలియదు
ఏం చదివావు? - తెలియదు
ఏం కావాలి? - అన్నం!
లేదు, పో! - పోను!
సేవకా! వీణ్ని బైటికి గెంటు!
నేనే సార్ ఆ సేవకుణ్ని!

## 49. ఆత్మ స్థైర్యం

ఏదో ఒక రాయి ఎక్కడైనా దొరుకుద్ది,
ముందు సూటిగా విసరడం నేర్చుకో!
గురువెవరైతే నేం -
సాధించ వలసింది గురి!
ఆయుధ సంపత్తి కాదు ప్రధానం,
ఆత్మ స్థైర్యం!

## 50. ప్రభుత్వ హుండీ

ధరలు పెరుగుత్తై, పెరిగి
ఉద్యోగుల జీతాలను పైకి గుంజుకొంట్టై,
అవి మళ్లీ పెరుగుత్తై
వీటిని మళ్లీ గుంజుకొంట్టై!
ఈ వానర మార్జాల పోటీ పందాలను తిలకిస్తూ
ఉద్యోగేతర మానవ కోట్ల ఆకటి చావులు
ప్రభుత్వ హుండీకి జమ అయిపోత్తై!

## 51. బాబావు కా

నీవు దృఢంగా, పొడుగ్గా వుంటావా?
ముఖం విలన్ ముఖంలా వుంటుందా?
అయితే – గడ్డం పెంచి, పూసలు ధరించి,
రేఖలు చూస్తూ చేతులు దువ్వటం నేర్చుకో!
అప్పుడు నీ నిరుద్యోగ సమస్య తీరిపోగా
నీవే లక్ష మందికి ఉద్యోగా లిప్పించ గలవు!

## 52. గుణం మార్పిడి

సమస్త గుణ సమగ్రమైన పరమాత్మలో
ఒకొక్క గుణం ప్రధానంగా
ఒకొక్క బీజాణువు పుడుతుంది.
అచంచల ధ్యానం ద్వారా
ఆత్మ గుణాన్ని మార్చగలం,
నేరేడు గింజను పాతి
మారేడు చెట్టును మొలిపించ గలం!
బీజం ఏదైనా బ్రహ్మం నుంచి పుట్టేదే
పని ఏదైనా పైసలుగా మారేదే!

## 53. గోముఖం

నీ లక్ష్యం సుఖజీవన మైతే
నిశ్చింతగా వ్యవసాయం చేసుకో,
నీ లక్ష్యం రాజ్యపాలనం అయితే
గోముఖం ధరించి ప్రజాసేవలో దూకు,
నీ లక్ష్యం కేవలం బ్రతకడ మైతే
ఏదో ఉద్యోగంలో చేరు!

## 54. చేప - పంది

విష్ణువు మత్స్యావతారం తాల్చాడని
చేపల్ని తినడం మానేస్తామా?
వరాహావతారం ఎత్తాడని
ప్రతి పందికీ మొక్కుతామా?

## 55. మూర్ఖ మానవం

దైవ భీతి ఒక శాశ్వత కర్ఫ్యూ,
మతం ఒక జన్మ ఖైదు,
భక్తి ఒక వెట్టి చాకిరీ,
ప్రార్థన ఒక అరణ్యరోదన!

## 56. ఎవరు

దేవుడి పేరు చెప్పుకొంటూ
అతడి సృష్టిని దోచుకుతింటాడు ఆస్తికుడు,
దేవుడి ఉనికిని ప్రశ్నిస్తూనే
అతడి సృష్టిని గౌరవిస్తాడు నాస్తికుడు.
నేను తోటకూర చెట్లను తింటాను
వాటిని గౌరవంతోనూ పెంచుతాను!

## 57. ఏమీ లేకుండా

మాంత్రిక, తాంత్రిక, యాంత్రిక, నైష్ఠిక, వైజ్ఞానిక
శక్తులే మానవ మహాయాన మార్గదర్శకలు.
ఏ శక్తీ లేకుండా ఏ దిక్కూ తోచదు
ఏ శక్తినీ పొందకుండా ఏ ఫలమూ దక్కదు.

## 58. ప్రజల రాజ్యం

మంచికి చెడ్డ ప్రతిపక్షం
చెడ్డకు మంచీ ప్రతిపక్షమే.
ఏది మంచీ – ఏది చెడ్డా అనేది కాదు ప్రశ్న
ఈ ప్రజల రాజ్యంలో
దేనికి మెజారిటీ వున్నదీ అనేది!

## 59. స్వాతంత్ర్య ఫలం

స్వాతం త్ర్యానంతరం కుడి యెడములు పోగొట్టుకొన్న
భారత మహా సాధించిం దేమిటి?
తెల్లదొరల స్థానంలో నల్లదొరలను ప్రతిష్ఠించింది
జాతిపిత గాంధీజీని చంపేసింది
ఆయనకు ప్రియమైన హరిజనను నిషేధించింది
నవ భారత పిత అంబేడ్కరును తరిమేసింది
వోటు బేంకులను సృష్టించింది
కాళ్మొక్కే బానిసల ఉత్పత్తిని పెంచింది.

## 60. యువ కోరిక

వోట్ల కోసం వాగ్దానాలు కురిపించేస్తాడు
నోట్లతో రాజరికాన్ని కొనేస్తాడు
పదవి కోసం ఎంత పవిత్రతనైనా తొక్కేస్తాడు
అందితే జుట్టూ, అందకుంటే కాళ్లూ పట్టు కుంటాడు
వేట కుక్కల్ని కట్టేసి మరీ పెంచుతాడు –
"ఎవరు, సార్? ఎవరు? కాస్త చెప్పండి!
ఆయనకు పి.యే కావాలేమో వెళతాను."

## 61. నా పోరాటం

నా పోరాటం నా వారసత్వ హక్కుల కోసం
అందులో ఒకటి వేదవ్యాసుడి సారస్వత పీఠం,
రెండోది మత్స్యగంధి అనువంశిక
మహాభారత సింహాసనం!
ఇప్పుడు తెలిసిందా నే నెవరినో?
నేను మేల్కొన్న వేద విరాట్టును!

## 62. బడ్జెట్టు

కుల వ్యవస్థ లాంటిది మన బడ్జెట్టు,
ప్రపంచంలో ఎన్ని మారినా ఇది మాత్రం మారదు!
ఇందులో ఏ ముంది న్యూసు వేల్యూ -
ప్రజల ఆకటి మంటలపై ప్రభువులు
పరమాన్నాలు వండుకుతినే
నిత్య తాజా వైనం తప్ప?

## 63. ఎవ డుద్ధరించాడు?

ఏ వర్గ నాయకు డా వర్గాన్ని ఉద్ధరించాడు?
ఏ మత నాయకు డా మతాన్ని సుఖ పడనిచ్చాడు?
గొర్రెల నాయకుడు నక్క, నక్కల నాయకుడు సింహం
ఇదీ నర నాయకుల పరిణామ క్రమం
రాజూ కానీ, నియంత కానీ, ప్రజాస్వామి కానీ!

## 64. బహుముఖ

సృష్టిలో ఎన్ని వైరుధ్యా లున్నా
అవన్నీ ఒకే సమరసాత్మకు బహుముఖాలు.
ఒక్కొక్క ముఖం ఒక్కొక్కడిది అయితే
అట్టి బహు సంఖ్యాక ఏక ముఖుల తీర్థంలో
ఏకైక బహుముఖుణ్ని నేను.

## 65. స్వర్గానికి

ఇతర జీవుల కంటె ఎన్నో సౌకర్యాలూ
శక్తులూ నీకు కలిగించిన దేవుడు
నీ దుష్ట ప్రవర్తన పట్ల అసంతృప్తు డై నప్పుడు
ఓయి మానవుడా!
నీ విక చచ్చి స్వర్గాని కెలా వెళ్ళగలవు?

## 66. బుద్ధి

నీవు-
దేవు డున్నాడని నమ్ముతున్న వాడివేనా?
అయితే, నీకు దేవుడు
బుద్ధి నెందు కిచ్చా డను కొంటున్నావు?
ఇతర జీవులకు లేని ఎన్నో ప్రజ్ఞలు
నీ కెందుకు కలిగాయను కొంటున్నావు?
అవన్నీ వెర్రివాడి చేతి రాళ్ళేనా?

## 67. అసూయకు దూరంగా

నూరు కాకుల్లో ఒక కోకిల
నూరు గొర్రెల్లో ఒక గుర్రం
నూరు గుడిసెల్లో ఒక మేడ
నూరు మట్టి తలల్లో ఒక విద్వత్కళ
సుఖంగా బ్రతకడం కష్టం.
ఒంటరిగా నైనా -
దూరంగా బ్రతకడం సుఖం!

# 68. శాడిజం

పిల్లికి చెలగాటం
ఎలక్కి ప్రాణ సంకటం
అవి రెండూ రెండు జాతుల జీవులు.
అధికార గర్వపోతుకు చెలగాటం
అ దే మన్న ధీశాలికి ప్రాణసంకటం
ఈ ఇద్దరూ ఒకే జాతి యువకులు.
పిల్లి ఎలకను తినడానికి చంపుతుంది
అధికార గర్వపోతు ధీశాలిని తినడు
కాని, చంపుతాడు!
అది జంతు నైజం
ఇది జంతు చిత్తుడి శాడిజం!

# 69. కర్మణ్యేవ

"కర్మణ్యే వాధికార స్తే
మా ఫలేషు" అన్నాడు కృష్ణుడు.
ఒక్క కృష్ణుడే కాదు –
ప్రతి యజమానీ అదే అంటాడు.
పని భారం ప్రజలది
ఫలాహారం యజమానిది!
ప్రజల అధికారం వోట్లివ్వడం వరకే
దాని ఫలం రాజ్యాధికారం
అది యజమానులది!
ఇక ప్రజాస్వామిక మంటావా
అది "ప్రజల అధికారం"
అనే మాటలో వుంది.

# శరన్నఖం

రెచ్చ గొట్టేది రాజకీయం
కలత తీర్చేది కవిత్వం.
రాజకీయం కురుక్షేత్రం
కవిత్వం యమునా తీరం!
రాజకీయం పగటి కాయకష్టం
కవిత్వం రాత్రి వెన్నెల విహారం!

## 2. ప్రభుత్వ తత్వం

ప్రభుత్వం విష్ణువు లాంటిది
అంతటా వుంది, ఎక్కడా కనిపించదు,
అందరి లోనూ ప్రభుత్వం వుంది
ఏ ఒక్కరూ ప్రభుత్వం కాదు.
చట్ట గ్లాని ఎక్క డేర్పడితే
అక్కడెల్లా అది అవతరిస్తుంది,
ఎవరి కే రూపంలో కావలిస్తే
ఆ రూపంలో సాక్షాత్కరిస్తుంది!

## 3. క్లీన్ అడ్మినిస్ట్రేషన్

వంటింటిలో దూరిన పిల్లి అక్కడి పాత్రలకు
క్లీన్ అడ్మినిస్ట్రేషన్ ప్రసాదిస్తున్నది!
మరి, వాళ్ల కుక్క ఏం చేస్తున్నది?
తోకాడించు కొంటూ యజమాని చుట్టూ
సెక్యూరిటీ ఇస్తున్నది!

## 4. పని తీరు

మా మురికి పేటకు రోడ్డు మంజూ రయింది
కంకర తోలి సంవత్సర మయింది
మబ్బులు కనబడ్డై
పని మొద లయింది
వాన వెలిసింది
మురికి మిగిలింది!

## 5. పచ్చిక

ఏ ప్రభుత్వమైనా ప్రజలను తినేదే
పార్టీలు మార్చడం పదవుల కోసమే
నటించడం నేర్చిన దొంగలే దొరలు
కోసిన కొలదీ పెరిగే పచ్చికే ప్రజ!

## 6. హృదయం - మెదడు

హృదయం ప్రజలు
మెదడు రాజు.

పరిపాలించేది రాజే, కాని
ప్రజలు తిరగబడితే
రాజు చెయ్యగలిగిం దేం లేదు.

రాజూ ప్రజల
పరస్పర సదవగాహనే శ్రేయో రాజ్యం.

## 7. పంచు కోవడాలు

దొంగలు వూళ్లు పంచుకొంటారు
దొరలు పదవులు పంచుకొంటారు
ఎలకలు పంట పొలాలు పంచుకొంటై
గొర్రెలు పచ్చిక బీళ్లు పంచుకొంటై
అంత మాత్రం చేత ఏమవుతుంది లే -
గొర్రె చస్తుంది కాని, గరిక చస్తుందా?

## 8. నా కొత్త భావాలు

నేను బేంకులో ఎప్పుడు పైకం కట్టినా
రెప రెప లాడే నోట్లనే జమ కడతాను.
నే నెప్పుడు బేంకు నుంచి పైకం తీసుకొన్నా
మాసి చినిగిన పాతనోట్లే వస్తాయి నాకు!
మరి, నా కొత్త నో ట్లేమై పోయినట్టు?
అవి ఎక్కడో ఏ కార్యకర్త చేతిలోనో
చెలామణీ అవుతూనే వుంటై,
అవనీ!

## 9. ఉమ్మడి నిధి

నా మనస్సు ఒక నిత్య వ్యవసాయి
నా సృష్టి మౌలిక భావ సంపద.
నా కెక్కడా సొంత అకౌంటు లేదు
నా దైన దంతా ఉమ్మడి నిధికే జమ.
నా లాంటి ఎంద రెందరో మౌన భావకులు
పరమాత్మ క్షేత్రంలో నిత్యమూ తీసే ఫలసాయం
చేరేది ఉమ్మడి విశ్వనిధికే.
శక్తీ రక్తీ గల ఎవడో ఒకొక విశ్వశోధకుడు
డ్రా చేస్తూ వుంటాడా నిధి నుంచి
లోక కళ్యాణం కోసం!
ఏ ఒక్క విజయమూ ఏ ఒక్కడి కృషి ఫలమో కాదు,
ఎందరి శ్రమ ఫలితమో అందులో వుంది!

## 10. ఘోస్టు రైటర్

ప్రజల వోట్లు అమ్మకం సరుకు కాగానే
ప్రభువుల నోట్లకు విముక్తి లభించింది!
రాజకీయ పదవులు రౌడీల పరం కాగానే
చదువుల రాణి ఘోస్ట్ రైటర్‌గా మారింది!

## 11. లక్ష్మికి రక్షణ

నీవు ధనం సంపాదిస్తున్నావా?
అందులో కొంత శాతం కళాపోషణకు వాడు!
లక్ష్మిని రక్షించేది సరస్వతి,
పోలీసులు కాదు.

## 12. దొంగల ఉత్పత్తి

దొంగల్ని కని పెంచి పోషిస్తున్నది
ధనవంతుల లోభత్వమే.
శక్తికి మించి పై కెక్కకు
భుక్తికి మించి దాచుకోకు!

## 13. మూడు వర్గాలు

మానవులంతా మూడు వర్గాలు
గొర్రెలు, నక్కలు, పులులు.
ఈ అందరికీ బ్రతుకు తెరువులు మూడు
దాస్యం, దగా, హింస!
వీళ్లంతా ఒకళ్ల నుంచి ఒకళ్లు పుట్టుకొస్తూ
ఒకళ్ల నొకళ్లు తినేసుకొంటూ
నీతి బోధలు చేస్తున్న వాళ్లే!

## 14. సమ శక్తి

చేతి అయిదు వేళ్లూ సమానంగా వున్నాయా?
లేవు, నిజమే కాని -
వాటి అసమత్వం సైజులలోనే
ప్రయోజనంలో కాదు,
పోషణలోనూ కాదు.
అయిదు వేళ్లూ కలిసిందే హస్తం
అందరికీ అదే హస్తం
నోటి కైనా, పోటు కైనా!

## 15. ఎందుకు చేయరు?

ఈ జీవ చైతన్య మహా వారాశిలో
ఒక అల మాత్రం మానవ జాతి!
ఏ రంగు నేలలో ప్రవహిస్తే
ఆ రంగులో వుంటుం దది!
దాని మనుగడకు అవసరాలు మూడు
కూడు, గుడ్డ, కొంప!
వీటిని మూడు చట్టాలతో తీర్చవచ్చు!
మరి ఎందుకు తీర్చరు?
ఎవరు?

## 16. అధికస్య అధికం విపత్

ఎంత ఎక్కువ మంది భార్యలుంటే
అంత ఎక్కువ అవకాశం కుట్రలకు,
ఎంత ఎక్కువమంది అభ్యర్థులుంటే
అంత ఎక్కువ ప్రమాదం ఆ ఎన్నికకు!

# 17. యథా రాజా

యథా రాజా తథా ప్రజా
ప్రభుత్వంలో నీతి లేకపోతే
ప్రజలు నీతిమంతు లెలా అవుతారు?
అవినీతితో, అక్రమాలతో
దుష్టులతో, దురాక్రమణాలతో
రాజు రాజీపడుతూ వచ్చినందు వల్లనే
ప్రజానీకం పతనమౌతూ వచ్చింది!

# 18. థ్రిల్లర్

ప్రభుత్వ బడ్జెట్
సిబ్బంది జీతాలకే చాలదు
ఇక మంచి పుస్తకా లెలా వస్తై?
అందుకే లైబ్రరీలు
క్రైం సెక్సు థ్రిల్లర్లతో
కడుపులు నింపుకొంటున్నై!

అవి చదివిన పాఠకులు
అంతకంటె భిన్నంగా ఎలా వర్తించగలరు?

శాంతి భద్రతల కోసం
కోట్లు ఖర్చుపెట్టే ప్రభుత్వానికి
లైబ్రరీలలో మంచి పుస్తకా లుంచడానికి
వందలు కూడ ఎందుకుండవో?

## 19. ఎందులో పేద

"మనది పేద దేశం" అన్నాడు నాయకుడు
"ఎందులో పేద" అడిగాడు శ్రమజీవి
"బుద్ధిలో" జవాబిచ్చాడు కవి!
అంగడిలో అన్నీ వున్నై, లేని దొకటే -
అందరం కలిసి బ్రతకా లన్న బుద్ధి!

## 20. వ్యక్తి కొక రూలు

వ్యక్తి కొక రూలు, కులాని కొక న్యాయం
మతాని కొక చట్టం నడిచే దేశంలో
శాంతి బ్రతికి వున్న దంటే
మనిషి చచ్చిపోయా డన్న మాట!

## 21. ముస లాబోతీయం

రాజకీయ పదవులు ఎదోయిన పెయ్యలు,
వాటి చుట్టూ పులి ముఖాల ఆబోతులు,
ఆత్రంగా కోర చూపులు చూచే కోడెలు.
ప్రపంచ రాజకీయం
ఒక ముస లాబోతీయం!

## 22. బోర్లించిన మూకుళ్లు

ప్రతిపక్ష సభ్యుల నోళ్లకు కళ్లెం
పదవి రాకడ,
అధికార పక్ష సభ్యుల నోళ్లకు మోక్షం
పదవి పోకడ!
మరి, ప్రజల నోళ్లు?
తరువాతి ఎన్నికల దాకా అవి
బోర్లించిన మూకుళ్లు.

## 23. పక్కలో బల్లెం

కలక్టరో, కమీషనరో తీర్చవలసిన తగవులో
మంత్రి జోక్యం చేసుకొన్నా డంటే
న్యాయ దేవత పక్కలోకి
బల్లెం చేరిం దన్న మాట!

## 24. పెద్దలకు దాసోహం

నెమలి నెక్కి దౌడు తీసినా లాభం లేదు
ఎలక నెక్కి ఈడిగల బడినా ఫర్వాలేదు
నీవు జనగణాధిపతివి కావా లనుకొంటే
పెద్దల చుట్టూ ప్రదక్షిణాలు చెయ్యి!

## 25. మితిమీరిన తమో గుణం

శివు డంటే నాకు ఆరాధన
ఆ సంగతి ఆయనకీ తెలుసు.
ఆ మధ్య భస్మాసురుడు శివుడి వెంట పడ్డప్పుడు
నేను వాడికి అడ్డం వెళ్లి
చీవాట్లు పెట్టబోయాను
కృతఘ్నత ఎంత పాపమో చెప్పబోయాను.

"ఓరి, నువ్వా? పోరా, పో!
రాజకీయాలు కవిగాడికేం తెలుసు?"
అంటూ వాడు నన్ను తోసివేసి
మళ్లీ శివుడి వెంట పడ్డాడు.

"కేశవా, శివుడు! శివుడు" అంటూ
నేను అక్కడే సొమ్మసిల్లి పడిపోయాను.

తర్వా తెప్పుడో లేచి, కాళ్లీడ్చుకొంటూ
నేను కైలాసానికి చేరి చూస్తే -
శివుడు ఆనందంతో పొంగిపోతున్నాడు
భస్మాసురుడి అనుచరు లంతా
చుట్టూ మూగి భజనలు చేస్తున్నారు.!

అది లోక నైజం
అందుకు కాదు నేను బాధపడింది -
నన్ను చూచి శివుడు ముఖం
అటు తిప్పుకొన్నందుకు!
తన శత్రువైన భస్మాసురుడితో
నేను మాట్లాడా నన్న కోప మట!

## 26. నిరాశ్రయుడు

అదొక స్కూలు ప్లే గ్రౌండు
సాయం సమయం
పిల్లలంతా ఆటల్లో మునిగి వున్నారు.

చీకటి పడుతున్నది
ఒక్కరొక్కరే ఇళ్లకు మళ్లసాగారు.
కొంతసేపట్లో గ్రౌండు ఖాళీ అయింది
ఒకే ఒక పిల్లవాడు తప్ప!

"అమ్మా, ఎవరా నిరాశ్రయుడు?"
ప్రశ్నించింది పక్క చెట్టు మీది కాకిపిల్ల
అప్పుడే గూటికి తిరిగి వచ్చిన తల్లిని.

"అతడా, పాపం, అతడు
తన దంటూ ఏమీ లేని
ఇండియన్ తరహా సెక్యులరిస్టు!"

## 27. అరవై ఆబోతుల రథం

దేశాధ్యక్షుడు రెండు గుర్రాలతో నడిపించిన రథానికి
అరవై ఆబోతుల్ని పూన్చావా, రాష్ట్ర సారథీ!
రథం కదలడం సంగతి దేవు డెరుగు-
ఈ అన్నిటికీ గడ్డీ గాదం ఎక్కడ తెస్తావు?

## 28. అరణ్య రోదన

గుడుల్లో, ఆఫీసుల్లో, శాసన సభల్లో
లోనా, బైటా పరిశీలించి చెపుతున్నాను -
బైటి దంతా గొర్రెల ఎడారి రోదన!
లోని దంతా తోడేళ్ల అరణ్య శోధన!

## 29. నాయకుల జన్మ హక్కు

యువకులను ముందుకు నడిపించడం
ప్రజలకు నైతిక విలువలు బోధించడం
మేధావుల, కవుల కర్తవ్య మట!
జాతి సంపద నంతా మేసేయడం
విదేశీయ సంతల్లో విహరించడం
నాయకుల జన్మ హక్కట!

## 30. అవస్థా భేదం

నవ యువకుడా!
నీ కళ్లల్లో ఏమిటా మంటలు?
కుమిలి పోతున్నావో ఏ అన్యాయానికో?
వెతికి వేసారావో ఏ ఆత్మీయత కోసమో?
కాల్చి పారేస్తావో మాలోని అవినీతి నంతా?
నీ ముందున్న ప్రతి ముదురాకూ
నవ పల్లవంగా వున్నప్పుడు
చెయ్యాలను కొన్న పనులే అవన్నీ!

## 31. అధికార దేవత

ప్రజా స్వామిక మైనా, నియంతృత్వ మైనా
అధికారం చేసేది ఒకే ఒక వ్యక్తి!
అధికార దేవత బహు భర్తృక కాదు!

## 32. కావాలి మృగేంద్రులు

మేధావులు గోవుల్లా సాధువులై కూర్చుంటే
రౌడీలు మృగేంద్రులై విహరిస్తారు!
మేధావులే మృగ రాజులు కాలేరా అంటే
కాగలరు; కాని, కావడం లేదు!

## 33. ఎవరు - ఎటు

ఎవరు పాలిస్తున్నా రన్నది కాదు ముఖ్యం.
ఎలా పాలిస్తున్నా రనేది!
ఎవరు ముందు నడుస్తున్నా రన్నది కాదు ప్రశ్న,
ఎటు నడిపిస్తున్నా రన్నది!

## 34. ప్రతిభ

వధువులు వరించేది అందగాణ్ని
వోటర్లు వరించేదీ అందగాణ్నేనా?
అందం పనికి వచ్చేది పడకగది వరకే,
పరిపాలనకు కావలసింది రాజస ప్రతిభ!

## 35. ఎంత పోరాటం

నా గుడిసెకూ, నీ మేడకూ మధ్య ఎంత దూరం?
కేవలం పది బారలు!
ఆ మాత్రం గడిచి నీ ప్రాంగణం చేరడానికి
ఎంత ప్రతిఘటన! ఎంత పోరాటం!

## 36. బడ్జెట్ కోట్లు

"హరిజనుల కోసం కోట్లు కోట్లు అంటున్నారు
అవేవో మన దాకా వచ్చేనా?" అడిగాడు
ఒక గుడిసెవాసి హరిజనుడు!
అయ్యో, అవి బడ్జెట్ కోట్లనీ
ప్రదర్శన కోసం పెట్టిన షోరూం సరుకనీ
వోట్లను ఆకర్షించే ఎర లనీ
ఆ క్షుధార్తుడి కెలా చెప్పను?

## 37. రాబందులు - నక్కలు

పగలు రాబందులు అధికార పక్షం
నక్కలు ప్రతి పక్షం,
రాత్రి నక్కలు అధికార పక్షం
రాబందులు ప్రతి పక్షం.
ప్రజ లెప్పుడూ శవ జీవాలే!

## 38. వాగ్దాన మోహిని

"రోడ్లు ప్రయాణీయకంగా లేవు, కనుక
రోడ్డుకు పది అడుగుల ఎత్తున ఎగిరే
బస్సులను ప్రవేశపెట్టండి!"
మహా మంత్రికి వోటర్ల వినతి.
"అ దెంత పని?
వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తాం,
ఆ తర్వాత వారంలో పని మొదలు పెడతాం"
మంత్రిగారి వాగ్దానం!
వోటరు మహాశయుల హర్షధ్వానాలు!!

## 39. సాహిత్య సభలో

ఒక సాహిత్య సంస్థ వారి
వార్షికోత్సవానికి వెళ్లాను.
ముఖ్యమంత్రి అధ్యక్షులు,
గవర్నరు గారు ముఖ్య అతిథి
మహాకవి కృష్ణశాస్త్రి ప్రధాన వక్త.
మరునాటి పత్రికలలో పెద్ద వార్త –
వరదల గురించీ, వరద నిధుల గురించీ
అధ్యక్షులూ, అతిథులూ చేసిన
గంభీరోపన్యాసాలతో!
చివర్లో ఒక వాక్యం వుంది:
''కృష్ణశాస్త్రిగారు కూడ మాట్లాడారు'' అని!

## 40. స్వశక్తి

పులి తిరిగే అడవి లోనే
లేడి కూడ తిరుగుతుంది
స్వశక్తిని నమ్ముకొని!
పోలీసు రక్షణ లేకుండా
బైటికి రాలేని వాడు మానవు డొక్కడే!

## 41. ఏ కుక్కైనా

కుక్కంటే దొరగారి ఆల్సేషియన్ కుక్కేనా?
ఊర కుక్క కూడ కుక్కే!
కట్టేసి పెంచితే ఇది కూడ-
కుర్చీ లెక్క గలదు
రాజసాలు చూపగలదు
రాజ్యాలు పాలించగలదు.

## 42. బలంగా బ్రతకాలి

మృగాలను చంపగలవాడే మృగేంద్రుడు
మనుజుల్ని వంచగలవాడే మనుజేంద్రుడు
అది జనపదం కానీ, జంగిల్ కానీ.
భద్రంగా బ్రతకా లంటే
బలంగా బ్రతకాలి!

## 43. రాజకీయ వడ్డన

పంచ భక్ష్య ప్రణాళికలతో పంచాననాలు
కంచాల వద్ద కూర్చు న్నప్పుడు
నీతీ, భక్తీ, దారిద్ర్య నిర్మూలన దీక్షా,
దైవ భీతీ ఏం చేస్తున్నె?
కుర్రలకు గంజాయి మేపుతూ
గొర్రెలను వండి వడ్డిస్తున్నె!

## 44. పులి వేషం

మన వోటర్లు పట్టి గొర్రెలు కదా?
వాళ్లు కత్తిని నీ చేతి కిచ్చా రంటే
దానితో తమనే కోసుకు తినమని కాదు,
తోడేళ్ల నుంచి రక్షణ కల్పించ మని!
నీవూ గతంలో గొర్రెవే కదా?
మరి, పులి వేషం కడతా వెందుకు?

## 45. బలం

బలవంతుడు రాజు
బలహీనుడు బానిస
బానిసగా బ్రతక లేవా?
బలం సంపాదించుకో!

## 46. ప్రజాస్వామికం

గూండాకు సాధువు తలొగ్గడం
కోకిల స్థానంలో పిల్లల కోడి చేరడం
నాయకుణ్ని సృష్టించవలసిన ప్రజలు
నాయకుడి చేతిలో కీలుబొమ్మలు కావడం
పన్నుల్ని పెంచుతూ, జీతాల్ని పెంచుకొంటూ
ప్రజల చేతిలో పైసా నిలవకుండా చెయ్యడం
ఇదేనా ప్రజాస్వామిక మంటే?

## 47. రాళ్లు - దేవుళ్లు

పండగ ఊరేగింపుపై రాళ్లు
ఊరేగింపుల్ని నిషేధించాలి!
ప్రార్థన మందిరం నుంచి రాళ్లు
ప్రార్థనల్ని నిషేధించాలి!
బస్సులపై రాళ్ళు
బస్సుల్ని నిషేధించాలి!
బియ్యం నిండా రాళ్ళు
బియ్యాన్ని నిషేధించాలి!
ఓహో రాళ్లు!
మన దేవుళ్లు!

## 48. రుతురాజు లా

సృష్టిలోని సౌందర్యాన్నంతా సేకరించి
పంచుతుంది వసంతం ప్రతి లవానికీ!
ఋతు రాజులా పాలించాలి ప్రతి రాజూ,
లభించాలి అందరికీ అభ్యుదయం ప్రతి రోజూ

## 49. అధికారుల ఆయుధాలు

కేపిటలిజమో, కమ్యూనిజమో -
సగటు మనిషి కే ఇజమైనా ఒకటే;
తెలుగులో అడిగినా, ఇంగ్లీషులో అడిగినా
లభించే వస్తువు అదే;
కుడి నుంచి వ్రాసినా, ఎడమ నుంచి వ్రాసినా
ప్రభుత్వం ఇచ్చే నోటీసూ అదే!
అధికారం కోసం పోటీ పడే వాళ్ల
ఆయుధాలు ఈ భేదాలన్నీ,
ప్రజలకు కావలసింది కేవలం సుఖశాంతులు!

## 50. బలమూ - బుద్ధీ

వోటున్న ప్రతి వాడికీ
పోటీచేసే అర్హత వుంది.
పోటీలో గెలవడానికి
కోటి ఉపాయాలు పన్నుతాడు.

అందుకే చెబుతున్నాను-
నమ్మక ద్రోహం, వెన్ను పోటు వంటి మాటల్ని
రాజకీయాలలో వాడకు!
నీకు బలమూ, బుద్ధీ వుంటే
మరొకడు నిన్నెలా మోసగిస్తాడు?

## 51. రాజసం వుంటేనే

ధనం, జనం కలవాడే నాయకుడు
ఎత్తు పై ఎత్తులే రాజకీయం
గెలిచిన వాడే ప్రభువు
అ దే రకం వ్యవస్థ అయినప్పటికీ!
రాజసం వుంటేనే రాజకీయాలలో దిగు!
లేకపోతే నాకులా కవిత్వం చెప్పుకో!

## 52. ఏ బడ్జెట్టైనా

ఏ బడ్జెట్టైనా, ఎవరు ప్రతిపాదించినా
దోపిడీ ధరించిన కాషాయ వస్త్రమే
అంచనాలు, కేటాయింపులు, వాగ్దానాలు అన్నీ
బంగారు లేడి శృంగార లీలలే!
సొమ్ము ప్రజలది
షోకు ప్రభువులది!

## 53. దొంగలున్నారు

దొంగలున్నారు అని వ్రాయవలసింది
రైళ్లలోని మరుగు దొడ్లపై కాదు,
రాజకీయాల నొసళ్ల మీద!
ముఖ ప్రియుల వీపుల మీద!

## 54. దురాక్రమణ దారు

నీరు, నిప్పు, నేల, గాలి వీటిపై
ప్రతి ప్రాణికీ సమాన హక్కులున్నై.
ఇందులో దేన్ని ఏ ఒక్కడు సొంతం చేసుకొన్నా
అతడు దురాక్రమణదారే,
శిక్షార్హుడే.

## 55. పంచతంత్రం చదువుకోండి

సింహాలూ, నక్కలూ రాజ్యమేలే లోకంలో
మీరు క్షేమంగా బ్రతక దలుస్తున్నారా?
అయితే, ఓ గొర్రెల్లారా! బర్రెల్లారా!
పంచతంత్రం చదువుకోండి!

## 56. కూడు పెట్టేది కృషి

చదువు కూడు పెడుతుందా?
సద్వినియోగ పరచుకోకపోతే
ఏదీ కూడు పెట్టదు.
పొలం, వృత్తి, ఉద్యోగం, వ్యాపారం వలనే
విద్య కూడ ఒక సాధనం.
కూడు పెట్టేది సాధనం కాదు,
దానితో మనం చేసే కృషి!

## 57. మెజారిటీ రూలు

ఏది మంచి? ఏది చెడ్డ?
మెజారిటీ అవు నన్నది మంచి,
కాదన్నది చెడ్డ!

## 58. సెక్యులరిజం అంటే

మానవుల మధ్య సహజీవనం అంటే
గూండాకు సాధువు తలొగ్గడం కాదు,
ప్రజాస్వామిక విధానం అంటే రిగ్గింగు కాదు,
సెక్యులరిజం అంటే
దేవుడికి సెక్యూరిటీ పెట్టడం కాదు.

## 59. పులుల పెత్తనాలు

గణ తంత్రాలు, రాజరికాలు, ప్రజాస్వామ్యాలు
ఎప్పుడు ఎక్కడ ఏ పేరుతో పిలవబడినా – అవన్నీ
తోడేళ్ల నుంచి గొర్రెల్ని రక్షించడానికి
పెద్ద పులులు చేపట్టిన పెత్తనాలే.

## 60. రౌడీలను మేపగలిగితే

ఇద్దరు పెట్టుబడిదారుల్ని సంపాదించి
నలుగురు రౌడీల్ని మేపగలిగితే
ప్రతి నక్కా నరేంద్రుడు కాగల రాజ్యంలో
శాంతి ప్రియత్వం పిరికితనం
సత్యాగ్రహం చేతగానితనం.

## 61. దౌర్భాగ్యాలు

మనిషి తన సాటి మనిషిని నమ్మని ఫలితమే
పోలీసులూ, న్యాయ పీఠాలూ.
స్వశక్తిపై విశ్వాసం లేక చేసే పనులే
దౌర్జన్యాలు, దురాక్రమణలూ.
ఏ సుఖాలకూ నోచని దౌర్భాగ్యులే
రోడ్డు రోమియోలు, బజారు రౌడీలూ!

## 62. దృక్కోణాలు

తూర్పు పడమరలు, ఉత్తర దక్షిణాలు
క్రింది మీదులు పరస్పర విరుద్ధాలు,
వాటి మధ్య బిందువును నేను.

చూచే వాళ్ల ఉనికి తోడిది నా స్థితి!
నాలో నీకేవైనా వైరుధ్యాలు కనిపిస్తే
అవి నీ దృక్కోణానివి,
నాలోవి కావు.

# 63. మంచితనం

నీవు మరీ మంచివాడివా? అయితే
నీ మంచితనం బలహీనతగానో
అమాయకత్వంగానో కనిపిస్తుంది
నీ చుట్టూ వున్న వాళ్లకు!
వాళ్లు నిన్ను రకరకాలుగా దోచుకుంటారు!
సరే, దోచుకోనీ, ఏం చేస్తాం?

భరించలేక ప్రతిఘటించావో?
వాళ్లకు కోపాలొస్తై?
అప్పుడు వాళ్లు నిన్ను లోభి వంటారు,
స్వార్థపరుడి వంటారు, వంచకుడి వంటారు,
అహంకారి వంటారు, అపకారం తలపెడతారు!
తట్టుకోవాలి మరి!
మంచితనానికి మూల్యం అది!

## 64. మందిలో ఒకడు

ఎవరో వండి పెట్టేశారులే అని సంతోషిస్తూ
అదే తింటూ బ్రతుకుతాడు సామాన్యుడు,
గతానుగతిక మేనా జీవిత మంటే?
మన ప్రయత్నమంటూ, మన సొంత మంటూ
ఏదీ అక్కర లేదా?

మందిలో ఒకడివిగా బ్రతకడం
సుఖ వంతమే కావచ్చు,
మందికి మార్గదర్శకుడివి కావాలనే కాంక్షలో
అధి మానవ మహనీయత వుంది
గుర్తించు!

## 65. బెల్లం ముక్క

కుక్కకు అతిగా తీపి తినిపించకు
దానికి పిచ్చెక్క గలదు.
కుక్కను అతిగా విశ్వసించకు
బెల్లం ముక్కకే అమ్ముడు పోగలదు.
కుక్కను సింహాసన మెక్కించకు
సుమతినీ, వేమన్ననూ గుర్తుంచుకో.
కుక్కతో అతిగా ఆడకు
దాని దంత క్షతమూ ప్రమాదకరమే,
నఖ క్షతమూ ప్రమాదకరమే!

## 66. పరంపరా పాతిత్యం

తన గురువు నుంచి నేర్చుకొన్నదే
మా గురువు నాకు నేర్పుతున్నాడు,
మా గురువు నుంచి చేర్చుకొన్నదే
నేను నా శిష్యులకు నేర్పుతున్నాను!
ఈ గురు పరంపరకు ఆద్యంతాలు లేవు,
నేర్పుతున్న దానిలో కొత్తదనమూ లేదు!

## 67. కోకిలత్వం

నీవొక గరిక పోచవా?
అసంఖ్యాకమైన నీ జాతి మొత్తం
నీ చుట్టూనే వుంటుంది!
నీవొక వట వృక్షానివా?
మరొక చెట్టే నీ దరిదాపుల్లో కనిపించదు!
నూరు కాదు, వెయ్యి కాకులు నిన్ను తరిమి కొట్టినా
నీ కోకిలత్వాన్ని వదులుకోకు!

## 68. సమాధి రాయి

అధికార శక్తిగల నీ వోటు ఒక రాయి,
దాన్ని పెర్రివాడి చేతికిచ్చావంటే
అది నీ సమాధి రాయే కావడం తథ్యం!
తస్మాత్ ప్రజాస్వామికమా! జాగ్రత్త!

## 69. శాంతి ప్రియత్వం

శాంతి ప్రియులైన గొర్రెల మందలు
ఎన్ని కోట్లుండి ఏం లాభం?
ఒక్క నక్కకు సరితూగలేవు,
ఒక్క తోడేలును కాదనలేవు,
ఒక్క పులి పంటి కిందకు రావు!
శాంతిప్రియత్వం పిరికి తనానికి మరో పేరైతే
అది నా జాతికి వద్దు, వద్దు, వద్దు!

## 70. దురద కాళ్లు

వోట్లమ్ముకొనే పేద లున్నంత కాలం
నోట్లు వెదజల్లే పెత్తందార్లు వుంటారు
సర్దుకుపోయే నిర్లిప్తులున్నంత కాలం
స్వప్రయోజకులైన గూండా లుంటారు
కాల్మొక్కే బానిస లున్నంత కాలం
మొక్కించుకొనే దురద కాళ్లూ వుంటై.

## 71. దైవం

మంచినీ చెడ్డనూ తానే చేసినవాడు
మంచీ చెడ్డా తానే అయినవాడు
మంచికి రక్షా, చెడ్డకు శిక్షా ఎలా యిస్తాడు?
మంచి చెడ్డలు సాంఘికమైనట్టివి,
దైవపరమైనట్టివి కావు.

## 72. జాలి

సంతాప సభలకు దేవుడే హాజరైతే
జరిగిన దుర్ఘటనకు దేవుడే సానుభూతి చెపితే
ఇక అతడు దేవు డెలా అవుతాడు?
జాలిపడేవాడు సర్వసమర్థుడు కాడు.
సర్వ సమర్థుడు జాలి పడగూడదు!

## 73. కుల నిర్మూలన

అయ్యా, నన్ను మీరెరుగరు, కాని
నేను మీ కులం వాణ్నే!
జాతీయ కుల నిర్మూలన పార్టీ అభ్యర్థిని!
ఈ ఒక్క తడవకూ నన్ను మీ వోట్లతో
ఢిల్లీ పంపేశా రంటే
ఇక మళ్లీ ఈ ప్రాంతాల్లో చచ్చినా కనిపించను
మీ మీద ఒట్టు!

## 74. చేటు పెయ్యాలు

రేడియో విప్పాం, పాటల నిండా హరిజనులు!
పత్రిక తెరిచాం, వార్తల నిండా హరిజనులు!
సభకు వెళ్లాం, ప్రసంగాల నిండా హరిజనులు!
సంక్షేమ పథకాలూ, నిధి నిక్షేపాలూ
అన్నీ హరిజనులకే నట!
"పాపం, చేటుపెయ్యాలు" అన్నది మా ఆవిడ!

# 75. మనస్సాక్షి

మంచీ, చెడ్డా, పాపం, పుణ్యం
వంటివేమీ లేవన్నానని
ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించకు!
నీ మనస్సాక్షి నీలోనే వుంది,
అది పరమాత్మీయ ప్రతినిధిగా
నీ ప్రతి చర్యనూ గమనిస్తున్న వేగు!

# హేమంత నఖం

నీ ముందెక్కడో ఏదో ఒక వెలుగు లేకపోతే
నీవు ముందు కెలా పోగలుగుతున్నావు?
నీ వెనక కూడ లోకం చాల వుంది,
నీ వీపును మరీ చీకటి చేసుకోకు!

## 2. ప్రజలను అధిగమించి

ప్రజాభిప్రాయం గతానుగతికం
అదెప్పుడూ ప్రగతి నిరోధకమే,
సత్యద్రష్ట అయిన ప్రతి ప్రవక్తనూ
ఆనాటి ప్రజ వ్యతిరేకించినట్టిదే,
నీవు ప్రజలకు అభ్యుదయం తేవాలనుకొంటే
ప్రజాభిప్రాయాన్ని అధిగమించి వెళ్లు!

## 3. ఏకాకిత

నాకు దేవుడు లేడు అన్నాను
ఆస్తికులు నన్ను వదిలేసి పోయారు!
పరమాత్మ వుంది అన్నాను
నాస్తికులు వదిలేసి పోయారు!
ఉన్నదీ, లేదూ అనేదొక వ్యూహ,
నన్ను అందరూ వదిలెయ్యడం మాత్రం నిజం!

## 4. అంతా నా వాళ్లు

ఈ రిక్షాలు తొక్కే వాళ్లు
ఈ ఆటోలు నడిపే వాళ్లు
ఈ పొలాలు దున్నే వాళ్లు
ఈ ఫేక్టరీలు నడిపే వాళ్లు
వీళ్లంతా ఏ కులాల వాళ్లో
ఏ మతాల వాళ్లో! అయినా
వీళ్లంతా నా వాళ్లు
నా దేశం వాళ్లు.
వీళ్ల కోసమైనా
నా దేశాన్ని దేశంగా వుంచాలి!
ఒక్క అంగుళమైనా వదులుకోగూడదు!

## 5. మనవాళ్లు

నీ పాలు తాగి రొమ్ము గుద్దే వాళ్లను
నోట్లో ముద్ద పెడితే వేళ్లు కొరికే వాళ్లను
మౌనంగా భరించడమే సహజీవనం.
బాధతో అరిచావో-
ప్రాణాలే తీసేస్తారు!
ఎవళ్లు? మన వాళ్లే!

## 6. ప్రగతి కర్షకులు

కవి, మేధావి, కళాస్రష్ట, సంస్కర్త
ఈ నలుగురే ప్రగతిని పండించే కర్షకులు.
తక్కిన వాళ్లంతా కొనేవాళ్లు, తినేవాళ్లు
దోపిడీలు చేసే వాళ్లు
దొరతనాలు నెరపే వాళ్లు!

## 7. మహా మర్కటం

మానవ సమాజం ఒక మహా మర్కటం;
తలకూ, తోకకూ మిన్నూ, మన్నూ అంత దూరం!
తల గ్రహాల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తుంటే
తోక విగ్రహాల చుట్టూ ప్రాణాచారాలు పడుతోంది!

## 8. వోట్ల గోపికలు

రంగం మీది కృష్ణ పాత్రధారి
అదే వేషంతో ఆడియన్సులోకి వస్తే
వాళ్లందర్నీ గోపిక లనుకొంటే
ఏ ముప్పద్దీ?
ఏం కాదు-
వాళ్లంతా నిజంగానే గోపికలై
వరించి వోట్లిచ్చేస్తా రంతే!

## 9. గుడ్డి బిచ్చగాడు

చర్చి, మసీదు, మందిరం, గుడి-
దేవుడంటూ వుంటే అన్నిటా వుంటాడు,
లేకుంటే ఎక్కడా వుండడు.
దేవుడి కోసం మతాలు మార్చేవాడు
దీపావళి వీధిలో గుడ్డి బిచ్చగాడు

## 10. దైవ వేటగాళ్లు

పుర్రెకో బుద్ధి, జిహ్వకో రుచి;
నిజ మెరుగని పుర్రెలు, నిలకడ లేని జిహ్వలు!
బయల్లో స్వేచ్ఛగా విహరించే ఈ పతంగాలకై
తల కొక వలా పట్టుకొని పరుగులు తీసే
ఈ వేటగాళ్ల ఆంతర్యమేమిటో?

## 11. ఘంటసాల గొంతు

"కృష్ణా" అంటూ గొంతెత్తి పాడిన ఘంటసాల
గొంతు కాన్సరుతో మరణించాడు!
దేవుడున్నాడా లేడా అనేది కాదు ప్రశ్న,
ఉంటే, ఎవరికి ఎందుకు పనికి వస్తున్నాడనేది!

## 12. వ్యర్థ భజన

"రామా!! రణభీమా! కోదండ రామా!"
ఎవరినయ్యా, అంత గొంతెత్తి పిలుస్తున్నావ్?
ఆయన గనక నీ పిలుపు విని, నీకేసి వస్తే-
ఒకసారి ఆ పాతబస్తీకేసి వెళ్లి రమ్మను!

## 13. డబ్బే ప్రాణం

లేని వాడికి డబ్బు కావాలి
కడుపు నిండా తిండైనా తినడానికి,
కలవాడికి డబ్బు కావాలి
జీవిత సుఖా లనుభవించడానికి!
సృష్టికి మానవుడు చేసిన ప్రతి సృష్టి డబ్బు
మానవుడి ప్రాణానికే ప్రాణమై కూర్చుంది!

## 14. ఊర్వశి - రామాయణం

ఊర్వశి విశ్వ ప్రేయసి కనుక
ప్రతి కుర్ర కవీ ఆమె వెంట పడ్డాడు,
రామాయణం విశ్వకావ్యం కనుక
ప్రతి పండిత కవీ దీని వెంట పడ్డాడు!

## 15. కనీసావసరాలు

కోటీశ్వరుడెంత తింటాడో
కూలివాడూ అంతే తింటాడు.
శీత వాతా తప బాధలూ
ఇద్దరికీ సమానమే.
అందుకే చెపుతున్నాను -
మానవుణ్ని సుఖ పెట్టాలంటే ముందుగా
అతడి కనీసావసరాలు తీర్చు!

## 16. బలహీనుడి ఓర్పు

పేదవాడి పస్తు ఉపవాసం కాదు
బలహీనుడి ఓర్పు సహనం కాదు
పిరికివాడి నిష్క్రియ తాటస్థ్యం కాదు
సేవకుడి బ్రతుకు జీవితం కాదు.

## 17. దేవుడొకడే అయితే

అన్ని మతాలూ దేవుడివే అయినప్పుడు
దేవుడి కోసం మతం మారక్కర లేదు.
సుఖం బుద్ధిబలం తోడిది
శాంతి భుజ బలం తోడిది.
ఈ రెండు బలాలూ నీకుంటే-
నీ వెక్కడుంటే అదే స్వర్గం!

## 18. చిరిగే నిరోధ్

మతం ఒక నిరోధ్
మానవోత్తర జీవ సృష్టికి.
సంప్రదాయం ఒక నిరోధ్
సర్వ సద్భావనా వికాసానికి.
నిరోధ్ ఎంత గట్టిదైనా చిరుగుతూనే వుంది!
నవ ధర్మం యుగే యుగే పుడుతూనే వుంది!

# 19. దేశం మంటే

దేశ మంటే మనుషులు కారోయ్,
దేశ మంటే మట్టి యౌనోయ్!

ఇదీ నేను చెపుతున్నది,
గురజాడ చెప్పింది వాస్తవం కాదు.

దేశ మంటే ఒక భూభాగం
అక్కడ మనుషు లెవరున్నా సరే
అస లెవరూ లేకున్నా సరే!

అక్కడి మనుషులు ఏ జాతి, ఏ మతం
ఏ రంగు అనేది కాదు ముఖ్యం,
ఆ భూభాగం నీదై వుంటే
ఎంత త్యాగమైనా చేసి
దాన్ని రక్షించుకో!

# 20. ఎవరు నీవు

ఏ ప్రాణి అయినా
మనిషో, గొర్రో, పులో అవుతుంది.
ఏ మతం మనిషైనా
హిందువో, క్రైస్తవో, ముస్లిమో, మరేదో అవుతాడు.

నీవు మతాతీతుడ వైనా సరే
నీవు నాస్తికుడ వైనా సరే
లోకంలోని మెజారిటీ మనుషులు
మతం పేరుతో స్వజాతి రక్షణకై
పరజాతి హత్యలకు పాల్పడు తున్నప్పుడు
నీవూ అదే ఆయుధంతో
నీ జాతిని రక్షించుకోక తప్పదు.

విశ్వ మానవతా జ్ఞానం
ప్రతి మానవుడికీ కలిగే దాకా
నీవూ ఒక మతం వాడివే,
నీవూ ఒక జాతి వాడివే,
మరచి పోకు!

## 21. ఆయుధ పూజ

రైల్లో ముందెక్కి పడుకొన్న వాణ్ని
వెన కెక్కిన వాడు లేపడం సులభమా?
భూ మత సాంఘిక సంస్కరణలు కూడ
అలానే కష్ట సాధ్యం.

పదువుల పెత్తనాలు రుచి మరిగిన పెద్దపులి
పేరంటాలకి పెడుతుందా తేలికగా?
అన్యాయం తొలగాలంటే
ఆయుధ పూజ జరగాలి!

## 22. సమదృష్టి

భాషకు లిపి అక్కర లేదు
భావానికి భాష అక్కర లేదు
దైవానికి భావం అక్కర లేదు
మానవత్వానికి దైవం అక్కర లేదు.
సృష్టిలోని సమస్త జీవ కోటినీ
సమ దృష్టితో చూడడమే మానవత్వం.

## 23. సూర్యుడు కాదు

ఏ ప్రవక్తనైనా బ్రతికుండగా కంటె
చచ్చిన తర్వాతనే జనం కీర్తిస్తారు.
ఏ పురుషోత్తముడినైనా సజీవ మూర్తిగా కంటె
విగ్రహ రూపంలోనే జనం పూజిస్తారు!
జనానికి కావలసింది వెలుగు -
సూర్యుడు కాదు!

## 24. ఆధునిక ప్రగతి

పల్లెల్లోని ప్రతి గుంట నీరూ
పాలై ప్రవహిస్తున్నది!
పత్రలోని ప్రతి మట్టి నలుసూ
బియ్యం బస్తాల కెక్కేస్తున్నది!
రోడ్ల ప్రక్క ప్రతి కంకర్రాయీ
బస్సులనే బద్దలు కొట్టి పారేస్తున్నది!
రాజ్యాధికారాన్ని సాధించవలసిన ప్రతి వోటూ
కరెన్సీ నోటుగా మారిపోతున్నది!
ఓహో! మానవుడు సాధిస్తున్న ప్రగతి!

## 25. పదును

కత్తి వంటిది ప్రతిభ,
ఎప్పుడూ పదును పెడుతూనే వుండాలి దానికి.
కత్తి అరిగినా సరే
పదును తరగ గూడదు!

## 26. అవస రారోహణ

నేను ఢిల్లీకి
సెకండు క్లాసులో వెడదా మనుకొన్నాను
ఫస్టు క్లాసు టికెట్టు రిజర్వు చేశాను
చివరి క్షణంలో దాన్ని రద్దు చేసుకొని
విమానం ఎక్కాను!

## 27. సమకాలీనత

వాల్మీకికి రఘురాముడు తెలుసు
నాకు పాలేరు వెంకన్న తెలుసు,
సమకాలికం కానిది సత్కావ్యం కాదు
స్వానుభవం లేనిది సాహిత్యం కాదు.

## 28. పూర్వోత్తర జన్మలు

పువ్వు పుట్టగానే పరిమళించవచ్చు
మనిషి పుట్టగానే ప్రతిభ చూపవచ్చు
అది బీజ గుణ వైచిత్రి!
పరమాత్మ బీజం పాటుమరించి నప్పుడు
అది గుణాధికమూ కావచ్చు
గుణ హీనమూ కావచ్చు!
అందుకు ప్రత్యేక కారణం ఏదీ లేదు
ఆత్మకు పూర్వోత్తర జన్మలంటూ ఏం లేవు
జన్మలు తాత్కాలిక రూప గుణాలు.

## 29. నీ పక్షం

దైవం, దెయ్యం, అదృష్టం, శని
అదేదైనా నీలోదే, బైటది కాదు.
వైరశక్తుల క్రీడారంగంలో
అవన్నీ నీ పక్షమే.
క్రమశిక్షణ ప్రాతిపదికగా
కంట్రోలులో వుంచుకోవాలన్నిటినీ.
నీ మెదడు బల్బుకు గల కాంతి నైశిత్యమే
నీ జీవిత గమనంలోని విజయ వైశిష్ట్యం.

## 30. దేవుడి అస్థిత్వం

ఈ సమస్త విశ్వాన్నీ దేవుడు సృష్టించాడంటే
అంతకు ముందతడెక్కడున్నట్టు!
ఏంజేస్తున్నట్టు?
అది మానవుడి భావుకతకు
దేవుడనే వ్యక్తిని కల్పించడం ఒక ఉదాహరణ!
పరమాత్మే తనను తాను సృష్టించుకొంటున్నదని
నేనంటున్నాను, ఆలోచించండి!

## 31. ప్రతిపక్ష బలం

దేవుడు అధికార పక్షం,
సైతాను ప్రతిపక్షం, అయితే
ప్రతిపక్ష బలమే అత్యధికంగా వున్న సృష్టిలో
దేవుడింకా అధికారంలో వున్నాడా?
దేవుడు సర్వ సమర్థుడే అయితే
సైతానుకు, కర్మకు, మృత్యువుకు
ఇంత ప్రాబల్యం ఎందుకు?

## 32. చూపు బాణం

నా చూపు – బాణంలా
చీకటి గుండెల్ని చీల్చుకు పోతుంటే
స్రవిస్తున్న రక్తాన్ని చూచి
ఎవరైనా ఎందు కేడవాలి?
చీకటి పట్ల కనికరమా?

## 33. చీకటి భూతం

చీకట్లో నీకు నీ పక్కవాడు భూతం,
నీ పక్క వాడికి నీవు భూతం!
అందుకే –
మీ ఇద్దర్నీ వెలుగులోకి రమ్మంటున్నాను!

## 34. చౌర్యం కూడ కళే

చౌర్యం కూడ కళే, క్రౌర్యం శక్తే,
పైత్యం రసమే, ప్రభంజనం ప్రాణమే!
సృష్టికి గుణ దోషాలు లేవు
అవి మానవుడి సుఖ దుఃఖాల తోడివి!

## 35. దురాశా పూరిత వ్యవస్థ

సహజ ధర్మంతో ఘర్షణ పడే విధంగా
సాంఘిక నీతిని రూపొందించావు,
ప్రజల పురోహితం దెబ్బతినే విధంగా
వాళ్ల సంపదపై పన్నులు విధిస్తున్నావు,
లోకం నిండా అశాంతిని వెదజల్లిందెవరు?
నీ దురాశా పూరిత వ్యవస్థే కాదా?

## 36. దైవం చేటుపెయ్య

ప్రజా సంపదను పిండుకోవడం కోసం
దైవాన్ని చేట పెయ్యగా వాడుకొంటున్న రాజా
నీవు వేస్తున్న గడ్డి గోపు కందడం లేదు-
కట్టు తాడు కొంచెం వదులు చెయ్యి!

## 37. ఏది పులో, ఏది నక్కో

మతం, భక్తి, భజనలు అన్నీ
ప్రయోజనం లేని వట్టి కాలక్షేపాలు.
ఏది పులో, ఏది నక్కో కనిపెట్టు!
మనశ్శక్తిని పెంచుకొని మనిషిగా బ్రతుకు!

## 38. యుద్ధానికి భయపడితే

యుద్ధానికి భయపడితే శాంతి వుండదు,
శాంతి కావాలంటే యుద్ధం చెయ్యవలసిందే.
నీకు న్యాయం చేకూర్చేది నీ స్వశక్తే,
ఇతరుల న్యాయ బుద్ధి మీద ఆధారపడి
స్వశక్తిని చంపుకోకు!

## 39. కావలసింది

జనానికి కావలసింది
చౌక బియ్యపు దుకాణం
రత్నాల షాపు కాదు.
జనాభ్యుదయానికి కావలసింది
రాజకీయ విప్లవం
ఓదార్పు కాదు.
లోభికి కావలసింది బ్యాంకెకౌంటు
సాహిత్యం కాదు!

## 40. లోక మానవుడు

ప్రతిభే బీజం ఎన్ని వ్యక్తిత్వాల కైనా,
ఏ క్షేత్రంలో, ఏ రూపంలో, ఏ కళలో కానీ
ప్రతిభ వికసించినవాడే నాయకుడు
వికసించని వాడు సామాన్యుడు.
ప్రతిభ ప్రత్యక్ష పరమాత్మ
అది ఎక్కడ ఏ రూపంలో ఉన్నా
అందరికీ ఉమ్మడి ధనం.
ప్రతిభావంతుడు లోకమానవుడు
అతడిని ఉపేక్షించకు!

## 41. నాస్తికుడే ఉత్తముడు

ఆస్తికుడా, నాస్తికుడా అనేది కాదు ప్రశ్న,
ధర్మపరుడా కాదా అనేది.
స్వార్థపరుడైన ఆస్తికుడి కంటె
ప్రజాక్షేమం కోరే నాస్తికుడే ఉత్తముడు!

## 42. లక్ష్యానికి దారి

మంచిని బుజ్జగిస్తూ, చెడ్డను ఉజ్జగిస్తూ
ముందుకు సాగిపోవడమే జీవితం!
ఎటు, ఎక్కడికి అనుకొంటూ నిలబడిపోకు,
నీవెటుపోతే అదే నీ లక్ష్యానికి దారి!

## 43. మానవజాతి చరిత్ర

అవిద్య, పేదరికం, భయం ఇవి
ప్రజల నుంచి ఎన్నటికీ తొలగించబడవు.
ఇవి నిజంగానే తొలగించబడితే
ఆపైని పులులకు గొర్రెలు దొరకవు!
మానవజాతి పురోగమన చరిత్ర ఇదీ!
అర్థం చేసుకొని అడుగులు వెయ్యి!

## 44. హంస-సింహం

హంస వాహన హంసకేనా తిండి కావలసింది?
సింహ వాహన సింహానికీ కావాలి తిండి!
ధర్మ సూక్ష్మాలు తెలియాలంటే
ఆశ్రయించవలసింది ధర్మ వ్యాధుణ్ని
శుష్క నీతి బోధకుణ్ని కాదు!

## 45. పాత గొంగళి

దేవు ళ్ళవతరించారు, ప్రవక్త లుద్భవించారు,
నెత్తురు చిందించారు, నీతులు బోధించారు,
అయినా ఏం జరిగింది?
మానవ నైజం మాత్రం పాత గొంగళిలా
ఎక్కడి దక్కడే పడి వుంది!

## 46. మేక - మేకపాలు

ఏ పనీ చెయ్యని సర్వోదయ నాయకుడికి
మేక పాలు చాలు.
అన్ని పనులూ తానే చెయ్యవలసిన కార్మికుడికి
మేకే కావాలి!

## 47. శాసకుడెవరు

తల రాతలు రాసే వాడు
తన రాతకు తానే విచారపడితే-
ప్రజల ఆకటి చావులకు
ప్రజాపతే సంతాపం ప్రకటిస్తే-
ఇక ఈ సృష్టిని శాసించేదెవడు?

## 48. గతం నుంచి నేర్చుకో

పేరు తెలియకుండా ఏ వంటైనా తినేస్తారు
కులం తెలియకుండా ఏ జంటైనా కనేస్తారు
అగస్త్యుల్నీ, వశిష్ఠుల్నీ, పరాశరుల్నీ
ఆదర్శ పురుషులుగా ఆరాధిస్తున్న నీవు
గతం నుంచి నేర్చుకోవెందుకు?

## 49. ఘాట్ రోడ్

ఈ జీవితం ఒక పలు వంపుల ఘాట్‌రోడ్,
నీకెంతో కింద వున్నట్లు కనిపించే వాళ్లు
నీ వెంట వస్తున్న వాళ్లే!
లక్ష్యం కొండ శిఖరం,
క్రిందు మీదుల ఉచ్ఛ నీచాల
తల నొప్పి దేనికి?

## 50. ఒకే పనికి

వెంకన్న సామి హుండీలో వేస్తే – అది ముడుపు
వెంకన్న దొర గారి కిస్తే – నజరానా
వెంకన్న మంత్రికి సమర్పిస్తే – పార్టీ ఫండు
వెంకన్న వరుడికి ధారపోస్తే – కట్నం
వెంకన్న గురువు కర్పిస్తే – దక్షిణ
వెంకన్న ఆఫీసరు కిస్తే – లంచం!
ఎందుకో ఒకే పని కిన్ని పేర్లు!

## 51. అన్నదానం పుణ్యమా?

అందరికీ సమంగా అందవలసిన అన్నాన్ని
మొత్తం ఒక్కడే సొంతం చేసుకొని
తాను కలవాడైన వ్యక్తి
లేని వాళ్లకు అన్నదానం చేస్తాడట!
అన్నదానం పుణ్యమనే వాళ్లకంటే
అభివృద్ధి నిరోధకు లెవరు?

## 52. సైనిక శిక్షణ

మంచివాడు మౌనం వహించాడు
చెడ్డవాడు చెలరేగాడు
ఫలితం –
రౌడీలకు రాజ్యం
మేధావులకు సేవకత్వం!

గత్యంతరం?
మంచివాడు విజృంభించాలి
చెడ్డవాడు శిక్షించబడాలి

అందుకు –
దేశంలోని ప్రతి మనిషీ
సైనిక శిక్షణ పొందాలి!

## 53. ఏది ప్రగతి

ఆనాటి రామాయణ కాలం నుంచీ
ఈనాటి రాకెట్ల యుగం దాకా
మానవుడు సాధించిన ప్రగతి ఏమిటి?
అదే కామక్రోధాదుల నిరంకుశ పాలన!

యంత్రరంగం పెరిగింది!
అంతరంగం తరిగింది!
బకాసురత్వం విజృంభించింది,
ప్రతిపల్లే ఒక ఏకచక్రపురం అయింది!

## 54. దెయ్యం తట్టు

దైవం మంచి, దెయ్యం చెడ్డ
దైవం ప్రకృతి, దెయ్యం వికృతి
దైవం వెలుగు, దెయ్యం చీకటి
దైవం ధర్మం, దెయ్యం దోపిడీ
దైవం జీవం, దెయ్యం మృత్యువు
మంచివాడు పూర్ణకుంభం
చెడ్డవాడు దెయ్యం తట్టు.

## 55. పరిమితి

ప్రతి మతమూ జీవనదికి కట్టిన ఒక ఆనకట్ట,
వరద నీటి విడుదలకు అవకాశం ఎంతగా వుంటే
అంతగా వుంటుంది ప్రయోజనం దాని నిలవనీటికి!
కట్ట ఎత్తు పెంచే కొలదీ
కరకట్టలు కొట్టుకుపోత్తై,
నీరు పొంగి పొరే కొలదీ
ఏళ్లూ వూళ్ళూ ఏకమువుతై!

## 56. నేటి రాజకీయం

ఈనాడు స్వతంత్ర భారత్‌లో
ప్రతివాడికీ ప్రధాన వృత్తి రాజకీయమే!
ఆకలి దప్పులు సరికొత్త పాత సమస్యలే!
అందులో కొంత ముస లాబోతీయం,
కొంత నపుంసక వధూ కాంక్షీయం.

## 57. హరిహరా ద్వైతం

ఈ సృష్టి, ఈ గమనం, ఈ నియంత్రణ
రెండు విరుద్ధ శక్తుల నిత్య ఘర్షణ ఫలాలు!
అవి స్నేహంతో కలిస్తే పడక గది
వైరంతో కలిస్తే కాటిదిబ్బ!
ఈ స్థితి లయాల సమైక్యతే
హరి హరాద్వైతం.

## 58. ఎమర్జెన్సీ

తాను నాటిన కంచెలే తన చేలను మేసేస్తుంటే
ఎమర్జెన్సీ ప్రకటించాడు రైతు.
ఎమర్జెన్సీ రక్షణలో రైతుభయం కూడ పోయి
భూసారాలనే పీల్చేసినై ఆ కంచెలు!

## 59. పదవీ లక్ష్మి

ప్రతి అవతారమూ ఒక ఎమర్జెన్సీయే,
దుష్ట శిక్షణ లక్ష్యంగా వచ్చినట్టిదే.
అయినా – ఏం చెయ్యగలిగాడు వైకుంఠుడు?
పెరికెయ్యలేక, నరికేసి పోయాడు!
మళ్లీ మళ్లీ తలెత్తుతూనే వుంది ప్రతి మోడూ!
వైకుంఠుడే లేచి రాలేకపోతున్నాడు
పదవీ లక్ష్మికి పాదా లొత్తుతూ!

## 60. పులివేషం

మన వోటర్లు వట్టి గొర్రెలు కదా?
వాళ్లు ఖడ్గాన్ని నీ చేతిలో పెట్టా రంటే
దానితో తమనే కోసుకు తినమని కాదు,
తోడేళ్ల నుంచి రక్షణ కల్పించమని!
నీవూ గొర్రెవే ఖడ్గం చేతికి రాకముందు,
పులివేషం కడుతున్నావు, జాగ్రత్త!

## 61. నమ్మకం

పులిని నమ్మి లేడి బ్రతుకుతుంది అదే అడవిలో,
మనిషిని నమ్మి తన పొరుగు మనిషే బ్రతుకలేడు
పోలీసులూ, జైళ్లూ లేకుండా!
మనిషి స్వశక్తిపై నమ్మకం లేకపోవడమే
కారణం అక్రమాలకూ, హత్యలకూ, దుఃఖాలకూ.

## 62. ఈశ్వర అల్లా

"ఈశ్వర్ అల్లా తేరే నాం
సబ్‌కో సన్మతి దే, భగవాన్"
గాంధీజీకి ప్రియమైన ఈగేయాన్ని
ఉభయ దైవ మందిరాలలోనూ పాడించు!
అప్పుడు దానంతట అదే ఏర్పడుతుంది
జాతి మత సమైక్యం.

## 63. గొర్రెలు

మెజారిటీ మానవులు గొర్రెలెలా అయ్యారు?
ఇదిగో - ఇలా - అయారు -
దుశ్శాసకుల సాహసాలను ఎదిరించలేక
మంచివాళ్లు బానిసలయ్యారు,
బానిసలు నిర్వీర్యులు చేయబడ్డారు,
వాళ్ల బుర్రల నుంచి మెదడు తీసివేయబడి
దేహంలో కొవ్వు పెంచబడ్డారు.

## 64. వెన్నెల

నీకు వెలుగు కావలసింది
ఇంట్లోనే కాదు, వీధిలో కూడ.
నీవు అధికారం చూపవలసింది
పెళ్లాంపై కాదు, పండితలోకంలో.
నీ కీర్తి చంద్రికలు వెన్నెల కాయవలసింది
నీ కులం మీదో, పేట మీదో కాదు
మొత్తం లోకం మీద!

## 65. మెజారిటీ

ఎంతటి గొప్ప వస్తాదులూ, మేధావులూ అయినా
తాము మైనారిటీగా వున్నప్పుడు
మెజారిటీ అభిమానాన్ని పొందాలి, లేక
మెజారిటీకి తా విచ్చి పక్కకు తప్పుకోవాలి.
మెజారిటీ ఏంచేస్తే అదే చట్టం
మొత్తం అందరూ దాన్ని శిరసావహించడం విధి.

## 66. నిరాశ

సెక్సు పాట లెందుకు పాడుతున్నావంటే
శ్రోతలు కోరుతున్నా రన్నది అశరీరి!
సెక్సే కోరతారు - ఇస్తావా అంటే
నా కంత అదృష్టమా అంది, పాపం!

## 67. విగ్రహ మతం

జగ్జీవనరాం హిందువుడే, కోటీశ్వరుడే,
భారత ఉప ప్రధానే, అయినా
ఆయన ఆవిష్కరించిన విగ్రహం మైలపడిందని
గంగా జలంతో శుద్ధి చేసుకొన్న మతంలో
ఆయన స్థానం ఏమిటి?
ఆర్థికాభివృద్ధీ అధికార పదవులూ
సాంఘిక సమత్వాన్ని సాధించలేవు.

## 68. రైటూ, రాంగూ

ప్రతి మానవుడూ అనుకొంటాడు
తాను రైటూ, తక్కిన అందరూ రాంగూ అని.
అయితే మానవుల్లో మెజారిటీ గొర్రెలు కనుక
నక్కల ముందు నోరెత్తరు
పులుల ముందు తలెత్తరు.
తమలో తాము కుమ్ముకు చస్తుంటారు!

# 69. నిర్వచనాలు

కారాగారం అంటే
దుర్జనులకు ఉచిత భోజనశాల.
కూలిపేట అంటే
సజ్జనులకు శ్మశాన ద్వారం.

రాజకీయం
ఎడాపెడా సంపాదించే ఒడుపు.
దేశభక్తి
ఏ దేశంలో వుంటే ఆ దేశం పట్ల రక్తి.

పల్లెటూర్లో మేడ
ఆకలి చూపుల్లో ఎడారి ఓడ.
పట్టణంలో గుడిసె
భద్రత ప్రక్కలో బరిసె!

# 70. చుట్టలు

మీరు "చుట్ట చుట్టుకొనే పడుకుంటారా?"
అన్నానొకసారి మహాకవి కాటూరి వారితో-
రాత్రి పడుకునే ముందు పక్క మీద కూర్చుని
ప్రొద్దుటి కోసం పొగచుట్ట చుట్టుకొంటుండగా.

కృష్ణశాస్త్రిగారు చుట్టలు
పిఠాపురం నుంచి తెప్పించుకునే వారు,
కాటూరి వారు తమ చుట్టలు
తామే చుట్టుకునే వారు.

అపుడు వెంటనే కాటూరి వారన్నారు-
"నేనే కాదు, ఆ వేయి పడగల వాడు కూడ
చుట్ట చుట్టుకొనే పడుకుంటాడు"
కవి చేతి పొగచుట్టకు కూడ అంతటి భోగం!

## 71. దూరమే సారం

ప్రకృతి పురుష సంబంధం ఎంత దూరమైందైతే
అంత వీరజాతి పుడుతుంది దాని నుంచి!
వర్ణాంతర సంబంధాలను బహిష్కరించి
పుట్టు కులానికి పట్టం కట్టినప్పటి నుంచే
భారతజాతి నీరసజాతి అయింది!

## 72. లోక మూఢత

వర్గపోరాటం తెస్తామంటున్నాం యువకులం
వర్ణాలను పునరుద్ధరిస్తామంటున్నాం వృద్ధులం.
ఈ దేశంలో మనమే ఇంత మూఢులం కదా?
ఇక అంత లోకమౌఢ్యాన్నెలా తొలగించగలం?

## 73. డబ్బు

డబ్బంటే ఏమిటి?
నోట్లా? నాణాలా?
అవి కొనగలిగిన తిండిగింజలే డబ్బు.
తిండి గింజలను పండించే రైతు కూలీలే
జాతికి డబ్బిచ్చే శ్రీనివాసులు!

## 74. రక్తపాతం

రక్తపాతం లేకుండా భారతకు
స్వాతంత్ర్యం వచ్చిందని బొంకకు,
అంతకంటె ఎన్నో రెట్లు రక్తపాతం
ఆ తర్వాత జరిగింది
ఇంకా జరుగుతూనే వుంది!

## 75. విలువలు

మహితమైన కృషీ, శ్రమా లేకుండా
మధురమైన అనుభూతులు లభించవు.
రాబడి పోయినప్పుడు ఆదుకొనేవి
బేంకులలోని నిల్వలే
కనిపెంచిన పిల్లలు కాదు.

కనుక-
వృద్ధాప్యంలో సుఖశాంతులు కావాలంటే
ఇప్పుడే కృషిచెయ్యి, శ్రమపడు, దాచుకో!

## 76. తేడా

సూర్య గమనం మిథ్య
భూమి గమనం సత్యం.

మనకు సూర్యుడు ఉదయించడం లేదు
మనం సూర్యుడి కుదయిస్తున్నాం.

సూర్యుడు లోక బాంధవుడు కదా?
మన ఆరాధ్య దైవం కదా?
మరి, మనం ఇలా తన్నుకు చస్తున్నామేం?

## 77. శివ మోహిని

నా అనుభవాలు చేదు కషాయాలు
నా జ్ఞాపకాలు పులి తేన్పులు.
హలాహలం మింగి, అమృతం పంచిపెట్టే
జగద్ధిత శివమోహిని నా జీవితం!
లోకంతో కలిసి వినోదిస్తూ
లోకాతీతంగా ప్రమోదించే మౌన మురళి!

## 78. అరూపత

నా కంటి నిండా కాంతి, నా ఒంటి నిండా పరిమళం,
నా గుండె నిండా అనురాగ రసం కదా?
కేళీ వినోదాలకు నా చుట్టూ
రూప లతలు లేకపోతే – మరి –
అరూప సౌందర్యమే నా ఆనంద నందనం!

# శిశిర నఖం

బాల్యం లాలిస్తుంది
వృద్ధాప్యం పీడిస్తుంది.

బాల్యం పోటు
వృద్ధాప్యం ఆటు.

ఏళ్లనూ, పూళ్ళనూ తోసుకుపోతూ
సృష్టికే ఆశాదీప మవుతుంది బాల్యం
ఒక్కొక్క శక్తీ ముక్తమై పోతూ
మూలబ్రహ్మలో కలిసిపోతుంది వృద్ధాప్యం.

## 2. ఆటు పోటులు

పరమాత్మ ఒక శక్తి సముద్రం
దాని నుంచి వచ్చే పోటే జీవనం,
తిరిగిపోయే ఆటే మృత్యువు.
ఈ ఆటు పోటులు నిత్యానుభవాలే అయినా
ఈ మధ్యలో ఎంత కల్లోలం!
ఎంత ఉద్వేగం! ఎంత నిర్వేదం!

## 3. తెలుసుకో

కోట్లు సంపాదించడం ప్రధానం కాదు
నీవు గెలవకపోతే మునిగే కొంపేదీ లేదు.
నీ స్వార్థం కోసం దేశద్రోహులతో షరీకు కాకు,
జాతి రక్త మాంసాలతో
నీ అధికార తృష్ణను తీర్చుకో జూడకు.

## 4. కాదేమో

దుర్మార్గుడి దుశ్చేష్టలకూ
సన్మార్గుడి సత్క్రియలకూ
గమ్యం ఒకే శ్మశానమా?
కాదేమో అనిపిస్తుంది నాకు - ఈ
పురుగుల్నీ, పువ్వుల్నీ చూస్తున్నప్పుడు!

## 5. దిగుడు మెట్లు

లక్షలు దోచుకొంటూ
పైసలు దానం చేస్తే – అవి
స్వర్గానికి నిచ్చెన మెట్లా?
నరకానికి దిగుడు మెట్లా?
స్వర్గ నరకాలు ఎక్కడో వుంటే
ఇక్కడ ఈ తాపత్రయాలు దేనికి?

## 6. కుగ్రామాల రద్దు

మంచి నీళ్లు, కరెంటు, కాలేజీ, గ్రంథాలయం,
ఆస్పత్రి, సినీహాలు, టెలిఫోను, రేడియో,
బేంకు, బస్ రోడ్డు, న్యాయ స్థానం
ఈ మాత్రం సౌకర్యాలైనా ప్రతి మనిషికీ
అందుబాటులో వుండాలంటే –
కుగ్రామాలను రద్దుచెయ్యి!
ఆదర్శపట్టణాలను వృద్ధి చెయ్యి!

## 7. పూల వనంలోనే

తుమ్మల్లో పొద్దు గూకితే
సూర్యుడి వొళ్లంతా కంటక క్షతాలే,
పూల వనంలో ప్రొద్దు గూకితే
చీకటే పరిమళిస్తుంది, చూడు!
తుమ్మల్లో పొడిచినా పర్వాలేదు
పొద్దు పూల వనంలోనే గూకనీ!

## 8. నలుపు

శివుడి కంఠం నలుపు
పార్వతి వొళ్లంతా నలుపు!
ఆ నలుపు జగద్రక్షణకు సంకేతం
ఈ నలుపు జగత్తుకే సంకేతం!

## 9. అక్షర జ్ఞానం కాదు

శంకరుడు ఎనిమిదేండ్లకే పండితుడు,
అతడి గురువు చండాలుడికి అక్షరాలు రావు.
వాల్మీకికి వచ్చిన భాష ఎవరు నేర్పింది?
కావలసింది ఆత్మజ్ఞానం, అక్షర జ్ఞానం కాదు!

## 10. కాలువ మీద లాకులు

సమాజం ఒక గోదావరి కాలువ,
వర్గాలు దాని పొడవునా వున్న లాకులు.
క్రింది లాకు కంటె పై లాకు గొప్పదేం కాదు
మెరక భూమి కంటె పల్లపు భూమి తక్కువా కాదు.

## 11. విశ్వాసం

ఎవడి విశ్వాసం వాడి దైవం,
ఎవడి పిచ్చి వాడి కానందం.
ఒకడి సమాధి మరొకడి దేవాలయం,
ఒకడి పుర్రె మరొకడి భోజన పాత్ర!

## 12. జీవ లక్షణం

కోరిక జీవ లక్షణం,
కోరికే జీవోజ్జీవన హేతువు;
జీవి కర్తవ్యం నిత్య కార్మికత్వం,
నిత్య కార్మికత్వమే సచ్చిదానందం.

## 13. సూక్తుల ప్రయోజనం

వేదాలను, వివిధ మత గ్రంథాలను
ప్రవక్తల సూక్తులను, నీతి సూత్రాలను
శోధించిన మేధావుల్ని అడుగుతున్నాను -
అందులో ఏ ఒక్కటైనా అమలు జరిగిందా?
మరి, అవి మన కెందుకు పనికి వస్తున్నట్లు?

## 14. పాపం దేవుడు

దేవుడు - మానవుడి
భావ లతలకు ప్రాపు,
పాపాలకు విరుగుడు,
బాధలు తీర్చే డాక్టరు,
ఇంటికీ, ఒంటికీ కాపలాదారు,
పిలిచినప్పుడెల్లా పలికే నౌకరు!
పూజ గదిలో చిక్కుకు పోయిన ఖైదీ!
పాపం, దేవుడు!

## 15. వృద్ధాప్యం - బాల్యం

వృద్ధాప్యం రెండో బాల్యం,
మరణ శయ్యే పురిటి మంచం.
అయితే - అతిథిని
వచ్చేటప్పుడు ఎంతో ముద్దుచేసి
పోయేటప్పుడు ఈసడించడం ఏం న్యాయం?

## 16. కన్నవాళ్లు

శిశువు సేవ అతణ్ని కన్నవాళ్లు చేస్తారు,
వృద్ధుడి సేవ అతడు కన్నవాళ్లు చెయ్యాలి!
శిశువూ, వృద్ధుడూ ఒక్కరే –
రాక పోకల్లో తేడా!

## 17. కరెంటు పోతే

బల్బులోని కరెంటు లోకానికి వెలుగిచ్చేది
అది బల్బులో వున్నంతసేపే!
కరెంటు పోతే –
వెలుగెక్కడికి పోయినట్టు?

## 18. వెలుగుండగానే

వెలుగుండగానే ఇల్లు సర్దుకోకపోతే
చీకట్లో దేవులాట తప్పదు!
పడుచుతనంలోనే పది కాసులు వెనకేసుకో!
బ్రతుకు బరువుల తిరునాళ్లలో
స్వాగత సంరంభాలే తప్ప
వీడ్కోలు ముచ్చటలుండవు!

## 19. ధీరోదాత్తత

అంతర్ముఖుడై కూర్చున్న మేధావికి
బహిః ప్రపంచం బాధాకరమైనప్పుడు
ఎవరి పక్షం వహిస్తావు?
ఆ ఒక్కణ్ణీ వదిలేస్తావా?
ప్రపంచాన్నే ఎదిరిస్తావా?

## 20. నిజాయితీ

ఎంత దరిద్ర దేశాన్నైనా సంపన్నం చెయ్యడానికి
రెండు పంచవర్ష ప్రణాళికలు చాలు -
పేదల కోసం కేటాయించిన పైసల్ని
పై వాళ్లు మేసెయ్యకుండా వుంటే,
నీతులూ, నినాదాలు కాక
నిజాయితీ రాజ్యమేల గల్గితే!

## 21. పని చెయ్యడమే

పనిచేసినంత కాలమే జీవిత కాలం,
తక్కిన దంతా నడ పీనుగ తనం!
యువకుడా, వృద్ధుడా అన్నది కాదు ప్రశ్న
పని చేస్తున్నాడా, లేదా అనేది!

## 22. చిరంజీవులు

వేల సంవత్సరాలుగా జీవిస్తున్న
చిరంజీవు లున్నా రంటై పురాణాలు!
ఉంటే వుండవచ్చు, కాని
ఏమిటి ప్రయోజనం?

## 23. కలలు

నాకొక అందమైన కల వచ్చింది
అది వాస్తవ మన్నంత స్ఫుటంగా వుంది.
మళ్లీ నే నందులోకి వెళ్లాలని వుంది
వెళ్లజాల నందుకు చింతగా వుంది!

కల కూడా ఒక అనుభవమే,
వ్యక్తి బయోడేటాలో ఒక అంశమే.

కాల ప్రవాహంలో అలల వలెనే
కలలు కూడ వచ్చి పోతూ వుంటై!

## 24. సత్యం - మిథ్య

లేని దాని నుంచి ఏదీ పుట్టదు,
పుట్టిన దేదీ లేనిది కాదు.
బ్రహ్మ సత్యం జగత్తు మిథ్య అనడం అపోహ,
రెండూ ఒకటే రాగా లాపన!

## 25. అలా - అంబుధీ

అల పుట్టి పెరుగుతూ క్లైమాక్సు చేరడానికి
పట్టే కాలాన్ని నిర్ణయించే దెవరు?
దాని బీజ శక్తా? పరిసర ప్రభావమా?

అది క్షణికి కావేశ రస బిందువా?
సహస్ర చంద్ర పూర్ణ కలశమా?
ఏదైతే నేం? ఎంతైతే నేం
దాని పరిధిలో అది పరిపూర్ణమే!

## 26. సూపర్ మేన్

భౌతిక శక్తి బాగా వున్నంత మాత్రాన
ఎవడూ సూపర్ మేన్ కాడు.
విష్ణువును పురుషోత్తముణ్ని చేసింది
దుష్ట శిక్షణ కాదు,
శిష్ట రక్షణ!

## 27. వృద్ధాప్యంలో

నే నే వృద్ధుడి ముఖంలో కైనా చూచినప్పుడు
నాకు కనిపించేది అతడి యవ్వనంలోని ఔద్ధత్యం.
శరీరం శుష్కించే కొలదీ
మేధావిత పెరుగుతూ వుంటుంది!

జాతి అగ్రేసరం కావాలంటే
యువ దేహాలకు వృద్ధ మస్తిష్కాలను జోడించు!

## 28. గీతా సోషలిజం

నీకే పనిలో ఆసక్తి వుంటే
అదే నీ ప్రతిభా, లక్ష్యమూ,
ఆ పనిలోనే లగ్నం చెయ్యి నీ సర్వశక్తుల్నీ.
నీ పని ఫలితాన్ని పంచుకో
తోటి పనివాళ్ల పని ఫలితాలతో
అదే భగవద్గీత!
అదే సోషలిస్టు వ్యవస్థ!

## 29. గాంధీ తాత కాదు

ఏ వ్యక్తినైనా మనం ఎందుకు ఆరాధిస్తాం?
అత డేదో లోకోపకారం చేసినందుకు!
ఆ పని అతడే వయస్సులో చేశాడో
ఆ వయస్సు రూపాన్నే నిల్పుకోవాలి
చిత్రంలోగాని, శిల్పంలోగాని.

గాంధీజీని తలచుకోవలసింది
స్వాతంత్ర్యోద్యమ నాయకుడుగా
తాతగా కాదు.

## 30. దొంగా - వాల్మీకీ

మనం ఆరాధించేది రామాయణ వాల్మీకిని,

దారులు కొట్టి బ్రతికిన ఆటవికుణ్ని కాదు!

ఆనందించేది సీతాకోక చిలుకను చూచి

దాని పూర్వాశ్రమపు గొంగళిని చూచికాదు!

వికృతిని పరిహరించి

సుకృతిని పరిగ్రహించడం రసజ్ఞత!

## 31. చీకటిని ద్వేషించకు

నీకు వెలుగు కావాలా?

ఎంతైనా వుంది, తీసుకో!

అయితే -

చీకటి కావలసిన వాళ్లు కూడ వున్నారు,

దాన్ని వాళ్లకు వదిలెయ్!

వెలుగు చీకట్ల సహజీవనమే

సుఖ జీవనం!

## 32. ముందున్నవాడే

మానవుడుగా పుట్టి, మహాత్ముడిగా బ్రతికి,
మానవోద్ధరణకు కృషిచేసిన ఏ గొప్పవాణ్నీ
దేవుణ్ని చేసి దూరం చేసుకోకు!

దీపం ఎంత చిన్న వెలుగిచ్చినా
అది కరదీపం, సూర్యబింబం కాదు!
మనిషికి మార్గదర్శకుడు
తనకంటె ముందున్న పెద్ద మనిషే!

## 33. పిడికెడు మెదడు

మానవుడి మెదడు పిడికెడు
అది సాధించగల విజ్ఞానం దోసెడు
నింపుకోవలసిన పొట్ట జానెడు
కావలసిన జాగా బారెడు!
మరి, ఈ దొంగ డబ్బంతా దేనికి?

## 34. వి.ఐ.పీలూ - కార్మికులూ

ఆ సైంటిస్టు, ఆ ఆచార్యుడు, ఆ వి.ఐ.పి
తిండి కోసం కార్మికుడి వలె పని చెయ్యవలసి వుంటే
అంతటి గొప్ప వాళ్లయ్యే వాళ్లేనా?
మరి, కార్మికుణ్ని దోచుకు తింటున్న వాళ్లకు
ఈ విగ్రహాలూ, సన్మానాలూ ఎందుకు?

## 35. అన్నీ శవాలే

గిల్లి పారేసిన గోరు
లాగి పారేసిన దంతం
గొరిగి పారేసిన వెంట్రుక
కోసి పారేసిన అవయవం
అన్నీ శవాలే కదా?
అందులో ఏది కుళ్లి మట్టయిందో
ఏది కాలి బూడిదయిందో

ఎవరికి గుర్తు?

## 36. వృద్ధాప్య తత్వం

కొందరు పుట్టుకతోనే వృద్ధులు
కొందరు చచ్చినా వృద్ధులు కారు
బ్రహ్మ వృద్ధుడు –
అతడి బాబు యువకుడు!

## 37. ఉదయం చేసిన కృషి

సాయంకాలం హాయిగా సుఖపడాలంటే
ఉదయం పూట బాగా శ్రమపడాలి
సాయంత్రం సంతలో నీకు విలువ తెచ్చేది
ఉదయం నీవు పొలంలో చేసిన కృషే!

## 38. ఎంత పాతదైతే

కళాఖండం ఎంత ప్రాచీనమైనదైతే
అంత ఎక్కువగా వుంటుంది దాని విలువ,
ప్రతిభకూ వర్తిస్తుందీ వాస్తవం. -
కనుక, మిత్రమా!
యవ్వనాన్ని వ్యర్థం చేసుకోకు!

## 39. రేడియోసెట్టు

సహజమైన రేడియో సెట్టు ఈ మెదడు,
ఆను చేసి ట్యూను చేసి వుంచు ఎల్లప్పుడూ -
వాణి వాద్యమో, లక్ష్మి గాత్రమో, వేణు గానమో
ఎక్కడి నుంచి ఎప్పుడేది లభిస్తుందో యేమో!

## 40. నా ప్రగతి

చీకటికి తోడుగా పుట్టాను
మట్టితో నేస్తం కట్టాను.
ఎటో ఎందుకో తెలియకపోయినా
నేను వేసిన ప్రతి అడుగూ
ముందడుగే అయింది!
నన్నాకర్షించిన ప్రతి తారా
ఉదయం కేసే నడిపించింది!
నేను చేసిన ప్రతి పనీ
పంట చేసే అయింది!

## 41. వెంకటేశ్వరుడు

"వెంకటేశ్వరుడు మిమ్మల్నడిగాడు" అన్నాడు
తిరుపతి వెళ్లి వచ్చిన ఒక మిత్రుడు నాతో
"ఆయన నిన్న నా సభకు వచ్చాడే,
మీరు కలిసినట్లు చెప్పనే లేదు!"
అన్నాను నేను ఆలోచిస్తూ.

## 42. సొమ్ము చేసుకోవడం

చచ్చిన వాడి శవంపై పూలగుత్తులు,
గొప్ప వాళ్ల సమాధులకు నిత్య పూజలు!
ఇది గతం పట్ల మూఢ భక్తా?
చావును సొమ్ము చేసుకొనే కుయుక్తా?

## 43. బ్రహ్మైక్యం వద్దు

నేను -

పండే వరకూ పచ్చికాయను,

పండగానే రాలిపోతాను!

ఇక -

పండిన ఆనందం నాకేది?

నేను కోరేది -

రాలి నీలో కలిసి పోవడం కాదు

రాలకుండా నీతోనే వుండిపోవడం!

## 44. పాతకు భద్రత

పాత కట్టెను శుభ్రపరచి

ఒక మూల భద్రపరస్తూ వుంటే

అ దెంత కాలమైనా అలానే వుంటుంది!

దానితో ఏ పనైనా చెయ్యబోయావో

విరిగి చక్కా బోతుంది!

ఏ కట్టెకైనా, అ దెంతటి గట్టి దైనా

పాతబడే కొలదీ ప్రత్యేక శ్రద్ధ అవసరం.

## 45. రాక్షసులు - ఛాందసులు

పరబ్రహ్మ ఆనాడే కాదు
ఈనాడు కూడ వుంది,
పరమ ఋషులు ఆనాడే కాదు
ఈనాడు కూడ వున్నారు,
వేదాలు ఆనాడే కాదు
ఈనాడు కూడ పుడుతున్నై.
నాటికీ, నేటికీ తేడా ఒకటే -
నాటి వేద విరోధులు రాక్షసులు
నేటి వేద విరోధులు ఛాందసులు!

## 46. సుఖం ఎక్కడ వుంది

జీవిత పరమార్థం సుఖంగా జీవించడం!
సుఖం ఎక్కడ వుంది?
సుఖం నీ లక్ష్యంలో వుంది,
నీ కృషిలో వుంది, దాని సిద్ధిలో వుంది,
నీ తృప్తిలో వుంది, నీలోనే వుంది!

# 47. వృద్ధోపదేశం

పుట్టి పెరిగి పెద్దదైన అల
విరిగి తరిగి లయించి పోతుంది
ఇది సహజ క్రమం.

మృత్యువు ఒక హఠా ద్ఘటన కాదు
అమావాస్య హఠాత్తుగా రాదు
అదొక క్షణక్షణ క్షీణానుక్రమణిక.

ఒకొక్క శక్తే ముక్తమై పోతూ తుదకు
మూలశక్తిలో కలిసిపోతుంది.
ఎలా వచ్చిందో అలానే పోతుంది జీవితం,
తర్వాతేం లేదు తన్మయత్వం తప్ప!

వృద్ధులకిదే నా సిద్ధోపదేశం –
ఆందోళన పడకండి!
ఆత్మైక్యం సహజ మండి!

## 48. మంచి చెడ్డల రహస్యం

మంచినీ, చెడ్డనూ తానే చేసిన వాడు
మంచీ చెడ్డా తానే అయిన వాడు
మంచికి రక్షా, చెడ్డకు శిక్షా ఎలా ఇస్తాడు?
మంచి చెడ్డలు మానవ కల్పితాలు,
దైవ దత్తాలు కావు.

## 49. సర్వ ధర్మాన్ పరిత్యజ్య

సర్వ ధర్మాలనూ వదిలేసి
తననే ఆశ్రయించు మన్నాడు భగవంతుడు!
వ్యక్తి ధర్మం, వర్ణ ధర్మం, కుల ధర్మం, మత ధర్మం
అన్నిటినీ వదిలెయ్యాలి కదా ఏ భక్తులైనా?
మరి, ఏదీ? ఎక్కడ?

## 50. వ్యక్తిగతం

ప్రతి వ్యక్తికీ వ్యక్తిగత జీవితం వుంటుంది
అదే అతడి పరధ్యాన పరమైశ్వర్యం!
దాని వివరాలను గురించి అడగకు
అది అతడిది, నీది కాదు
అతడు చెప్పినా నీ కర్థం కాదు!

## 51. కురుక్షేత్రం

చార్వాకుడో, కృష్ణుడో, క్రైస్తో
మార్క్సో, మహాత్ముడో, అంబేద్కరో
ఒకొక్క మహా పురుషుడి జీవితం
ఒకొక్క కురుక్షేత్రం!

## 52. ఇచ్చేవాడు

ఇచ్చే వా డుంటే అతడి వెంట
పడతారు కోరే వా ళ్ళసంఖ్యాకంగా!
అందుకే కాబోలు -
ఇచ్చేవాడు కనబడడు,
కనబడే వాడు ఇవ్వడు!

## 53. మాలిన్యం

మానవుడున్న చోటనే మాలిన్యం
పనిచేసే వాడికే పొరపాట్లు
పైకెక్కే వాడికే పడిపోయే ప్రమాదం
కనుక, ప్రకృతి ధర్మం తెలిసి
ప్రశాంతంగా బ్రతుకు!

## 54. జనరేషన్ గేప్

తండ్రి చెప్పినట్టు వినడం
తండ్రి లాగే జీవించడం
జనరేషన్ గేప్ కాదు.
తండ్రి మాట వినకుండా
గాలికి తిరగడమూ
జనరేషన్ గేప్ కాదు.
సంప్రదాయాన్ని ప్రశ్నించడం
కాలదోషాలను పరిహరించడం
జనరేషన్ గేప్.
స్వార్థ కులతత్వాన్ని నిర్మూలించి
సోషలిస్టు కావడం
జనరేషన్ గేప్!

## 55. దండ ధరుడు

దేవుడున్నాడా, లేడా అనేది కాదు ప్రశ్న
న్యాయం ఉన్నదా, లేదా అనేది.
ఒకణ్ని అణగద్రొక్కి మరొకడు పైకి పోయే సంఘంలో
తులాదండ ధరుడు దండధరుడు మాత్రమే!

## 56. ఒక పి.ఏ. కథ

తెలివైన పేద విద్యార్థిని చేరదీసి
అతడి సాయంతో ప్యాసై, ఆఫీసరై
అతడికి తన వద్ద పియే పని ప్రసాదించాడు
ఒక దొరగారి మొద్దబ్బాయి!
అదీ తొలి కథ!
ఆఫీసరు ప్రధాని వరకు ఎదిగి పోయాడు
పియే తన బాస్‌కు నిచ్చెనగా నిలబడి
వెన్ను విరిగి పడిపోయాడు!
ఇది మలి కథ!

## 57. వృద్ధ సంపద

వృద్ధుల్ని అవమానించే యువత
ఎన్నటికీ వృద్ధి పొందదు.
వృద్ధాప్యాన్ని సుఖవంతం చెయ్యని జాతి
ఎప్పటికీ ఫలవంతం కాదు.
ఏ జాతి కీర్తి గౌరవ సుఖ సంపదలైనా
ఆజాతి వృద్ధుల నిర్విరామ కృషి ఫలితాలే.

## 58. వార్థ్యక్య లక్షణం

ఇరవై ఏళ్ల వాడికి ముప్పై ఏళ్లవాడు వృద్ధుడు
ముప్పై యేళ్ల వాడికి నలభై ఏళ్లవాడు వృద్ధుడు
ప్రతి వాడికీ తనకంటే ముందున్నవాడు వృద్ధుడు!
నా దృష్టిలో మాత్రం
పనిచేసే ప్రతివాడూ యువకుడే,
పని చెయ్యని ప్రతివాడూ వృద్ధుడే!

## 59. కర్రలు

జీవిత సాఫల్యానికి జ్ఞానం ఊత కర్ర
వ్యాపారం చేతి కర్ర
కృషి ములు కర్ర
రాజకీయం కాటి కర్ర.

## 60. నిచ్చెన

ప్రశ్న నిచ్చెన ఎంత పెద్దది అనేది కాదు,
పండబెట్టి వున్నదా నిలబెట్టి వున్నదా అనేది
ఎన్ని మెట్లు గడిచా వన్నది కాదు,
క్రింద నడుస్తున్నావా, పై కెక్కుతున్నావా అనేది.

## 61. రెండు తలలు

నేడు దేశాన్ని పట్టి పీడిస్తున్నది
ఒక రెండు తలల మహా సర్పం.
పై తల రాజకీయ పదవీ వ్యామోహం
క్రింది తల కులమత మూర్ఖోద్రేకం.

## 62. కుల తత్వం

పూర్వం కులా లున్నై, కుల తత్వం లేదు
స్వార్థం ఒదిగి, మెరిట్‌కు తావిచ్చేది.

ఇప్పుడు కులాలు లేవు, కులతత్వం వుంది
జాతి జీవశక్తి సమస్తమూ పీల్చేస్తూ,
సస్య సుక్షేత్రాలను
ఎడారులుగా మార్చేస్తూ!

## 63. హేయ కృత్యాలు

పెళ్లి వంట చెయ్యడం కోసమే
చదువు ఉద్యోగం చెయ్యడం కోసమే
రాజకీయాలు పదవుల కోసమే
దేవుడు అడిగిన వరా లివ్వడం కోసమే
అయితే -
అవి నాకు వద్దు.

## 64. సౌప్తిక పర్వం

కలెక్టరో, కమీషనరో తీర్చవలసిన తగవులో
మంత్రి జోక్యం చేసుకొన్నాడంటే
ధర్మం జయించవలసిన కురుక్షేత్రంలో
సౌప్తిక పర్వం ప్రవేశించిందన్న మాటే!
న్యాయానికి నడుం విరిగిందన్న మాటే!

## 65. ఇంజనీరు?

మట్టి నుంచి మస్తిష్కం దాకా వికసించిన
ఈ సంక్లిష్ట జీవ యంత్రాంగానికి ఇంజనీరెవరు?
పుష్పం పరిమళానికి మట్టిలోతు అందుతున్నదా?
మట్టిలోని వేళ్లకు మింటి ఫలం దక్కుతున్నదా?
పరిమళాన్ని పీల్చేస్తూ, మట్టిని తొక్కేస్తూ
ఎవరయ్యా ఆ ఇంజనీరు?

## 66. మన దేశంలో?

నరమాంస భక్షకుల నుంచి
బానిస వ్యాపారుల నుంచి
భూస్వామిక కర్కోటకుల నుంచి
మతపిచ్చి పిశాచాల నుంచి
మానవతను విడిపించుకొంటూ యువకులు
మహా విప్లవాన్ని సాధిస్తున్నారు విదేశాలలో.
మరి మన దేశంలో
మన యువకులో?

## 67. అవే పాత కత్తులు

మహమ్మద్ ఘోరీ ఫిరంగులు,
పృథ్వీరాజు పరాజయం.
తర్వాత వందేళ్లకు
అల్లా ఉద్దీన్ ఖిల్జీ ఫిరంగులు,
చితోడ్ కోట ధ్వంసం.
మళ్లీ రెండు వందల పాతికేళ్లకు
బాబర్ ఫిరంగులు,
సంగ్రామ సింహుడి ఓటమి.
తదుపరి ఎనిమిదేళ్లకు
బహదూర్ షా ఫిరంగులు,
మనవద్ద అవే పాత కత్తులు!
గతం నుంచి ఏం నేర్చుకొన్నాం?
ఇప్పుడేం నేర్చుకొంటున్నాం?
మీసాలు కాదురా, బ్రదర్!
ఎదగవలసింది రాజసం!
విరియవలసింది ప్రతిభ!

# 68. శిశిర వాగ్దానాలు

అకాడమీలను మూసి వేస్తా
కళాక్షేత్రాలను కల్లు కాంపౌండ్లుగా మారుస్తా
కవుల చేతికి గొడ్డళ్లిస్తా
ఉద్యోగులందర్నీ ఊడ బీకేస్తా
పరీక్షలు రద్దు చేస్తా
వోటుంటే చాలు ఉద్యోగ మిస్తా
ఏ పనీ చెయ్యక్కర లేకుండానే
ఉచిత భోజన వసతులు కల్పిస్తా-
ఇవి నా ఎన్నికల వాగ్దానాలు!
ఆరుకోట్ల అంధ మహాశయులారా!
తెండీ, తెండీ మీ వోట్లన్నీ!
గెలిపించండీ, మీ అభిమాన నాయకుణ్ణి నన్ను!

## 69. ఆడా, మగా?

దైవం ఆడదా? మగవాడా?
చర్చిస్తున్నారు ప్రపంచ మేధావులంతా!
నీవు నే నంటున్నావు,
నేను నీ వంటున్నాను!
మనిద్దరమూ కలిసిందే కదా దైవం అంటే!

## 70. అత్యాశ

సృష్టి క్రమవికాసం చెందుతున్నదా?
జీవధర్మం మారుతున్నదా?
మానవ ప్రతిభ ఉత్తమ తర మవుతున్నదా?
లే దనేది చరిత్ర చెప్పే జవాబు.
కారణం –
మానవుని అత్యాశ!

## 71. రాజకీయం

రాజకీయం, అదెవడి రాజకీయమైనా
రాజమార్తాండుల దైనా
ప్రజానాయకుల దైనా
అది కేవలం అధికార పదవి కోసమే.
అది పులి కానీ – నక్క కానీ,
గొర్రెల్ని ఆకట్టుకోనేదే!

## 72. శరణాగతి

పరమ నిరంకుశ నియంతృత్వంలోని
ప్రజల దాస్యానికి రూపకల్పనే
సంపూర్ణ శరణాగతి సూత్రం.
దొరల ముందు గ్రామీణుల
దాసోనుదాస వైఖరి.
రౌడీలకు కాల్మొక్కే
నిర్వీర్యుల వినయ శీలత.

## 73. తిరుపతి గుండు

మతం మార్చ గలవు
దేముణ్ని మార్చగలవు
యజమానిని మార్చగలవు
తల్లి దండ్రుల్ని మార్చగలవా?
చెట్టు సంతానం తల్లిని మార్చగలదు
నీ వదీ చెయ్యలేవు!
పదవి కోసం పార్టీలు మారిస్తే
స్థిరత కోసం తిరుపతి గుండే గతి అవుద్ది
ఆలోచించి అడుగెయ్!

## 74. రాబందులు

"సర్వాత్మా సుఖినః సంతు"
అనే ధర్మలక్ష్య మే మయింది?
అంత ఎత్తు ఆదర్శ శిఖరం నుంచి
ఇంత లోతు అవినీతి కూపంలోకి
పడిపోయాం కదా-
మళ్లీ ఆ ఎత్తుకు ఎక్కగలమా?
ఇక్కడే ఇలాగే ఒకళ్ల నొకళ్లం తినేస్తూ
నశించి పోతామా?

ఎవడి మట్టుకు వాడు చివరకు
తానే మిగులుతా ననుకొంటున్నాడేమో
అదిగో ఆపైన ఆకాశంలో
మనం పట్టువదిలిన లక్ష్య శిఖరం ప్రాంతంలో
ఆశగా తిరుగుతున్నె ఏమి టవి?
దిక్కుమాలిన దేశి గొడ్లను తిని బలిసిన
అణుబాంబుల రాబందులు!

## 75. పరమాత్మనే

నేను పరమాత్మ నుంచి పుట్టాను
పరమాత్మనే పీలుస్తూ, తాగుతూ, తింటూ
తన్మయమై ఆనందిస్తూ పెరిగాను,
పరమాత్మలోనే కరిగిపోతున్నాను
నీటిలో మంచు బొమ్మలా!
పరమాత్మనే అయివున్నాను
ఎల్లప్పుడూ!

## 76. కరెంటు పోతే

ఆకాశవాణి, దూరదర్శిని, ఉపగ్రహ తారలు
అందరూ నీ గృహ సేవకులే,
లైట్లు, ఫ్యాన్లు, మిక్సీలు, హీటర్లు
అందరూ నీ సేవా సైనికులే,
నీ అదృష్టం స్వర్గ తుల్యమే, కాని –
అన్నీ కరెంటు పోతే పోయేవి!
నీ ఆధునిక జీవిత మహాసౌధంలో
స్థిరమైన వే మున్నై?
అక్షర కృతు లెన్నున్నై?

## 77. విషాదాంత

మానవుడు భావుకు డైనప్పటి నుంచీ
ప్రపంచ సాహిత్యం సృష్టించిన
కావ్య నాయకులలో
అత్యుత్తమ పాత్ర దేవుడు!
అత్యంత విషాదాంత కావ్యం రామాయణం!

## 78. బహుత్ అచ్ఛా

జేబులో పర్సు
సూదితో నర్సు
పెదవిపై వెర్సు
నుదుటిపై కర్సు
బ్రతుకె బేవార్సు!

ఒక చిరుగాలి కెరటమైనా
ఇటు మళ్లించగలనా ఇప్పుడు?
ఇప్పుడు నాలో మిగిలి వున్నదొక్కటే – ఆశ!
నిర్గుణ నిరాకార నిరాలంబమైన ఆశ!
బుగ్గపై ఎవరా గిచ్చింది?
ఒళ్లంతా పులకాంకురాలు!
ఎక్కడి వీ ఎర్రని గాట్లు!
చిలుక ముక్కుల్లా చివుళ్లు, మొగ్గలు!

## 77. విషాదాంత

మానవుడు భావుకు డైనప్పటి నుంచీ
ప్రపంచ సాహిత్యం సృష్టించిన
కావ్య నాయకులలో
అత్యుత్తము పాత్ర దేవుడు!
అత్యంత విషాదాంత కావ్యం రామాయణం!

## 78. బహుత్ అచ్ఛా

జేబులో పర్సు
సూదితో నర్సు
పెదవిపై వెర్సు
నుదుటిపై కర్సు
బ్రతుకే బేవార్సు!

ఒక చిరుగాలి కెరటా స్తైనా
ఇటు మళ్లించగలనా ఇప్పుడు?
ఇప్పుడు నాలో మిగిలి వున్నదొక్కటే – ఆశ!
నిర్గుణ నిరాకార నిరాలంబమైన ఆశ!
బుగ్గపై ఎవరా గిచ్చింది?
ఒళ్లంతా పులకాంకురాలు!
ఎక్కడి వీ ఎర్రని గాట్లు!
చిలుక ముక్కుల్లా చివుళ్లు, మొగ్గలు!

## 2. ఊహా పోహాలు

"చంచలం హి మనః కృష్ణ"
అంటూ వాపోయాడు అర్జునుడు,
"ఔను, నిజమే" అన్నాడు కృష్ణుడు, కామ్ గా!
ఏమిటీ అర్జునుడు?

కన్ను చూస్తుంది, చెవి వింటుంది,
మనస్సు ఆలోచిస్తుంది,
ఇవి ఆయా జ్ఞానేంద్రియాల గుణ కర్మలు
ఇందులో వింత ఏముంది?

మనస్సు చంచరీకంలా చంచలం కాకపోతే
విశ్వ విశ్వాంతరాలలో విహరించ జాలదు
వివిధ రసాలను సేకరించి
ఆత్మకు అందీయ జాలదు!

# 6. అనుబంధం

విత్తనం చెట్టు నుంచి రాలేవరకే
చెట్టుకు విత్తనంతో సంబంధం,
విత్తనం రాలిపోయినాక
అవి రెండూ దేని కదే
సర్వ స్వతంత్రాలు !

తన విత్తనం మొలకై, చెట్టై
తనకు ప్రాపుగా నిలవా లని
ఏ చెట్టూ అనుకోదు.

ఏ చెట్టుకైనా –
తన స్వార్జిత నిధి నిక్షేపాలే
తన జీవిత విధి విక్షేపాలు.
కనుక, మనిషీ!
ప్రకృతి ధర్మాన్ని అనుసరించు!

## 2. ఊహా పోహలు

"చంచలం హి మనః కృష్ణ"
అంటూ వాపోయాడు అర్జునుడు,
"ఔను, నిజమే" అన్నాడు కృష్ణుడు, కామ్ గా!
ఏమిటీ అర్జునుడు?

కన్ను చూస్తుంది, చెవి వింటుంది,
మనస్సు ఆలోచిస్తుంది,
ఇవి ఆయా జ్ఞానేంద్రియాల గుణ కర్మలు
ఇందులో వింత ఏముంది?

మనస్సు చంచరీకంలా చంచలం కాకపోతే
విశ్వ విశ్వాంతరాలలో విహరించ జాలదు
వివిధ రసాలను సేకరించి
ఆత్మకు అందీయ జాలదు!

## 6. అనుబంధం

విత్తనం చెట్టు నుంచి రాలేవరకే
చెట్టుకు విత్తనంతో సంబంధం,
విత్తనం రాలిపోయినాక
అవి రెండూ దేని కదే
సర్వ స్వతంత్రాలు !

తన విత్తనం మొలకై, చెట్టై
తనకు ప్రాపుగా నిలవా లని
ఏ చెట్టూ అనుకోదు.

ఏ చెట్టుకైనా –
తన స్వార్జిత నిధి నిక్షేపాలే
తన జీవిత విధి విక్షేపాలు.
కనుక, మనిషీ!
ప్రకృతి ధర్మాన్ని అనుసరించు!

# 7. చావు - బ్రతుకు

చావునూ, బ్రతుకునూ విడదీసేది
ఒక చిన్న తటస్థ సీమ
ఆ సీమే సుషుప్తి.

మేల్కొన్న జీవుడు
ఇటు దిగివస్తే బ్రతుకు,
అటు దిగిపోతే చావు.
ఇటు అమ్మ ఒడి,
అటు నాన్న మడి.
ఇదొక నిరంతర వ్యవసాయ వృత్తి!

## 11. శాంతి శాంతి శాంతి

ఒక శాంతి సుషుప్తి,
దాని కవతల సచ్చిదానంద జీవితం
రెండో శాంతి.
దాని కవతల బ్రహ్మైక్యం
మూడో శాంతి.
ఎందుకీ శాంతులు?
వీటి కోసమేనా మనం పుట్టింది?

## 12. వ్యక్తి, రక్తి

నామ రూప గుణాలతో అంకురించి
వికసించిన పరమాత్మ బీజమే వ్యక్తి,
దాని మనోరథ విన్యాసమే రక్తి,
దాని పూర్ణోపశమనమే ముక్తి.

ముక్తి కాదు వ్యక్తి లక్ష్యం,
వ్యక్తి లక్ష్యం ఆనంద రక్తి!

# 7. చావు - బ్రతుకు

చావునూ, బ్రతుకునూ విడదీసేది
ఒక చిన్న తటస్థ సీమ
ఆ సీమే సుషుప్తి.

మేల్కొన్న జీవుడు
ఇటు దిగివస్తే బ్రతుకు,
అటు దిగిపోతే చావు.
ఇటు అమ్మ ఒడి,
అటు నాన్న మడి.
ఇదొక నిరంతర వ్యవసాయ వృత్తి!

## 11. శాంతి శాంతి శాంతి

ఒక శాంతి సుషుప్తి,
దాని కివతల సచ్చిదానంద జీవితం
రెండో శాంతి.
దాని కవతల బ్రహ్మైక్యం
మూడో శాంతి.
ఎందుకీ శాంతులు?
వీటి కోసమేనా మనం పుట్టింది?

## 12. వ్యక్తి, రక్తి

నామ రూప గుణాలతో అంకురించి
వికసించిన పరమాత్మ బీజమే వ్యక్తి,
దాని మనోరథ విన్యాసమే రక్తి,
దాని పూర్ణోపశమనమే ముక్తి.

ముక్తి కాదు వ్యక్తి లక్ష్యం,
వ్యక్తి లక్ష్యం ఆనంద రక్తి!

# 13. వైకల్యం

నీవు మత విశ్వాసివా?
మతం పేర్కొంటున్న దేవుణ్ని నమ్ముతున్నావా?
అయితే, ఆ ఒక్క దేవుడికే
విశ్వాస పాత్రుడివై జీవించు!

చచ్చిన తర్వాత ఆత్మ శాంతికై
అన్ని మతాల దేవుళ్లనూ ప్రార్థించడం
ఏ ఒక్క దేవుడికీ చెందక పోవడమే!

ఏకాగ్రతను చంపుకొని
లక్ష్య రహితంగా పయనించడం
ఏ ఎడారిలోనో అంతరించి పోవడమే!

# 17. సణుగుడు

అస్తమిస్తున్న సూర్యుడూ
ఉదయిస్తున్న సూర్యుడూ -
అతడు వృద్ధుడు,
ఇతడు బాలుడు,
అతడి వెనక చీకటి
ఇతడి ముందు వెలుగు,
అతడి పట్ల ఉపేక్ష
ఇతడి పట్ల ఆపేక్ష,
అతడు పోతున్న వాడు
ఇతడు వస్తున్నవాడు!
తెలిసి కూడ ఎందుకా సణుగుడు?

# 13. వైకల్యం

నీవు మత విశ్వాసివా?
మతం పేర్కొంటున్న దేవుణ్ని నమ్ముతున్నావా?
అయితే, ఆ ఒక్క దేవుడికే
విశ్వాస పాత్రుడివై జీవించు!

చచ్చిన తర్వాత ఆత్మ శాంతికై
అన్ని మతాల దేవుళ్లనూ ప్రార్థించడం
ఏ ఒక్క దేవుడికీ చెందక పోవడమే!

ఏకాగ్రతను చంపుకొని
లక్ష్య రహితంగా పయనించడం
ఏ ఎడారిలోనో అంతరించి పోవడమే!

# 17. సణుగుడు

అస్తమిస్తున్న సూర్యుడూ
ఉదయిస్తున్న సూర్యుడూ -
అతడు వృద్ధుడు,
ఇతడు బాలుడు,
అతడి వెనక చీకటి
ఇతడి ముందు వెలుగు,
అతడి పట్ల ఉపేక్ష
ఇతడి పట్ల అపేక్ష,
అతడు పోతున్న వాడు
ఇతడు వస్తున్నవాడు!
తెలిసి కూడ ఎందుకా సణుగుడు?

# 18. అఖండత్వం

పాంచభౌతిక జీవ యంత్రం ఈ శరీరం
ఏక జాతి స్వతంత్ర రాజ్యాల ఫెడరేషన్
ఈ యంత్రాన్ని యధావిధిగా నడిపించడంలో
ఒకో రాజ్యానిది ఒకో బాధ్యత!

ఏ ఒక్క రాజ్యమూ స్వయం పోషకం కాదు
ఏ ఒక్క దానికీ సర్వాధికారం లేదు.
గుండె ఆహారాన్ని అందజేస్తుంది
మెదడు శాంతి భద్రతల్ని పాలిస్తుంది.

ఇది ఫెడరేషనే అయినా
యూనిటరీ వ్యవస్థగా నడిచి నప్పుడే
ఆరోగ్యమూ, ఐశ్వర్యమూను.

అఖండత్వమే అస్తిత్వం
నీ యంత్రం మీద పర పెత్తనం సహించకు,
నీ మట్టిలోని ఒక రేణువునైనా
పరాధీనం గానీయకు!

## 19. ప్రాణేంధనం

నీ జీవ యంత్రాని కివ్వబడిన ప్రాణేంధనం
నూరు వసంతాలకు సరిపోగలట్టిది!
ఆదా చేసి యాత్రావధి పెంచుకొంటావో
దుబారా చేసి దారిలోనే పడిపోతావో
అది నీ చేతిలో వుంది!

## 20. ఉదయ సాయంత్రాలు

ఉదయ సంధ్యకూ సాయం సంధ్యకూ
తేడా ఏం లేదు,
ఉదయ సంధ్య చైతన్య రథం
సాయం సంధ్య విశ్రాంతి సౌధం!

ఉదయం రెక్కలు విప్పి పయనమైన చైతన్యం
ఏవేవో అనుభవాలు పొంది, అనుభూతులు గడించుకొని
సాయంత్రం హాయిగా గూటికి చేరుకొంటుంది.
చైతన్య రథమూ, విశ్రాంతి సౌధమూ ఒక్కటే
ఆగితే సౌధం, సాగితే రథం!

## 21. నేను రాలిపోతే

నా ఈ కన్నీటి బొట్టు ఆ
రాలి పడిన పండుటాకు కోసం కాదు,
నా కోసమే.
ఆ పండుటాకు అక్కడే ఎరువై
వచ్చే వసంతంలో ఆ చెట్టుకే
చిగురాకై వెలయవచ్చు!
మరి - నేను రాలిపోతే?

## 22. త్రి ధా

ఎక్కడో వుండే దేవుడి కోసం
తపస్సు చేశాను.
ఆయన ప్రత్యక్షం కాగానే
అభయం కోసం ప్రార్థించాను.
అభయం లభించగానే
నేనే దేవుడినై కొలువు తీరాను!

## 23. సుత్తి

ఎన్నో సందర్భాలలో, సభలలో
ఎంతో మంది నన్ను పొగుడుతూ వుంటారు.
నేను వింటూ వుంటాను.
అది పొగడ్త అని కూడా అనుకోను
నాకు ఏ ఫీలింగూ వుండదు.

అయితే, ఆ పొగడ్తల సుత్తిని వాళ్లు
అక్కడే వదిలేసి పోతే మాత్రం
దాని కంటిన నెత్తురు నన్ను చూచి
బెదురుతుంది,
బాధపడుతుంది.

## 24. అల్ప సంతోషి

అల్ప సంతోషి అన్నారు నన్ను,
సంతోషానికి అల్పం, అనల్పం అనేదేమి?
ఎంత చెట్టు కంత గాలి
గాలి ఒకటే, చెట్లలోనే తేడా!
నేను మర్రి చెట్టును కాదు
మల్లె తీగను!

# 25. చెట్టు మెదడు

చెట్టుకు మెదడున్నదా?
లేకపోతే - అది
తన విత్తనాలనే సృష్టించుకొంటున్న దెలా?

పరువంలో పూచినన్ని పూలను
కాచినన్ని కాయలను
ముసలిదై పోయే కొలదీ వెలయించ దెందుకు?
క్రమంగా ఎండిపోతూ
తానేమై పోతున్నదో చెట్టుకు తెలుసు,
మనిషికి తెలియదు!

చెట్టుకు మెదడుంది
కాని, కనిపించదు.
మనిషికి మెదడున్నట్టు కనిపిస్తుంది
కాని, లేదు!

# 26. విత్తనాల వైవిధ్యం

ఒక్క కార్తెలో పుట్టి పోయేవి
ఆరుద్ర పురుగులు
ఒక్క ఋతువులో పూచిపోయేవి
ఆస్టరు పువ్వులు
ఆరు నెలలలో పండి పోయేవి
వరి మొక్కలు
ఆ రేండ్ల నుంచి ఫలితం ఇచ్చేవి
కొబ్బరి చెట్లు
వందల సంవత్సరాలు బ్రతికేవి
రావి, మర్రి వృక్షాలు
అన్నీ ఒకే మడిలోని విత్తనాలు
విత్తనాల వైవిధ్యమే
సృష్టిలోని సౌందర్యం.

## 27. ఇదీ నాదంటే

నాకు తెలిసిన సంస్కృతి ఋగ్వేదికం
నాకు తెలిసిన వేదాంతం రసాద్వైతం
నాకు తెలిసిన చరిత్ర కురుక్షేత్రం!
నాకు తెలిసిన భారతదేశం
ఉత్తర కురు భూముల నుంచి
మాలదీవుల వరకు,
బలి ద్వీపం నుంచి
సింధు సముద్రం వరకు!
నేనెంత విశ్వాత్మనైనా
నా వ్యాప్తి ఇదే
నా వేళ్లు ఇక్కడివే!

## 28. భయపడేది

మనిషి భయపడేది మృత్యువుకు కాదు
మృత్యు సమయంలో కలిగే బాధకు!
బాధ ఆ వ్యక్తికి తెలియకపోవచ్చు
తెలుసుకొనే స్పృహ లేకపోవచ్చు!
అయితే-
చూచే వాళ్లను మాత్రం
ఆ బాధ బెదర గొట్టి పారేస్తుంది!
చావును చావగొట్టా లనిపిస్తుంది!

## 29. పురోగమనం

ఏ ప్రాణి అయినా
ప్రపంచంలో ప్రవేశించిన క్షణం నుంచే
ప్రారంభ మవుతుంది దాని ప్రయాణం
ఎటో, ఏ దారి వెంటనో, ఏ గమ్యం వైపో!
మానవుడు కూడా ఒక ప్రాణి మాత్రుడే
గమ్యం చేరడమే యాత్రకు పరమార్థమైతే
గమ్యం చేరు వవుతున్నప్పుడు
సంతోషించక ఏడ్వడం దేనికి?

## 30. ముగ్గిన పండు

జీవిత వృక్షాగ్ర శాఖల్లో
ఎర్రగా ముగ్గిన పండును నేను!
ఏ కాకి అయినా ముక్కుతో పొడిచి
క్రిందికి పడద్రోయగలదు నన్ను,
ఏ చిరుగాలి కైనా రాలి పడిపోగలను కూడ!
రాలిపోక ఎలాగూ తప్పదు, కాని, దేవీ!
నేలపై పడి చిట్లిపోకుండా
నీ పమిటె కొంగులో పట్టుకోలేవా నన్ను?

## 31. వేట

అతడెవరో నాకు తెలియదా?
నా కోసం వలపన్ని కూర్చున్న వేటగాడు!
వేట అతగాడి వృత్తి
తప్పుకొంటూ ముందుకు సాగడం
నా శక్తి యుక్తుల ప్రతిపత్తి!

## 32. రక్షణ

పరదా వెనక సుఖించే భాగ్యశాలిని కంటే
ప్రజల మధ్య కష్టించే పేదరాలే గొప్పది.
మొద టామెను సమాజం రక్షిస్తున్నది
సమాజాన్ని రెండో ఆమె రక్షిస్తున్నది!

## 33. గుర్తింపు

నీ ఉత్సవం పొడుగునా పోలీసు బందోబస్తు లేకపోతే
నిన్ను నీవు రక్షించుకోలేవా, గణనాయకా?
మైకూ, లౌడు స్పీకరూ లేకపోతే
నీ ప్రార్థన దేవుడికి వినపడదా, మత నాయకా?
ఏదో ఒక రాయి వెయ్యడానికి కాకపోతే
ప్రజల మధ్యకు వెళ్లలేవా, మంత్రి వర్యా?
దూర దర్శినిలో ముఖం కనబడకపోతే
నిన్ను సరస్వతి గుర్తించదా, మహాకవీ?

## 34. నా తాత

ద్రౌపదికి ఐదుగురు భర్తలుండవచ్చు నన్నా డొకచోట!
బహుభర్తృక బంధకి అవుతుంది కనుక
సభలో అవమానించవచ్చు నన్నాడు మరో చోట!
వ్యాసుడు సాక్షాత్తూ నారాయణుడు కదా?
అతడేమి చెపితే అది వేదం,
ఏమి వ్రాస్తే అది తలరాత!
వైరుధ్యాల సృష్టిలో వాస్తవాల నేత!
ఆయన నా తాత!

## 35. కన్ను

లూయీ బ్రెయిల్ తాను గుడ్డివాడైనా
గుడ్డి వాళ్లకు కళ్లిచ్చాడు!
మాల వెంకడు మాన్యశ్రీ వెంకట్రాముడై
మళ్లీ తన పేటవంక కన్నెత్తి చూడలేదు!
కన్నుండ వలసింది మనస్సుకు,
మనో నేత్రం కలవాడే మానవుడు!

## 36. కర్తవ్యం

దేశాన్ని పాలించడమంటే
రూల్సు ప్రకారం తింటూ కూర్చోవడం కాదు.
జాతిని శాసించడమంటే
సర్వజన సంపన్నత వైపు నడిపించడం.
ప్రజా నాయకుని కర్తవ్యం
ప్రజలు చెప్పినట్టెల్లా చెయ్యడం కాదు
తాను మార్గదర్శకుడై ముందుండడం!

## 37. ఉత్తముడు

ఆస్తికుడా, నాస్తికుడా అని కాదు ప్రశ్న
సత్యవాదా, అసత్యవాదా అనేది,
సన్మార్గుడా, దుర్మార్గుడా అనేది,
పరోపకారా, పర పీడకుడా అనేది.
స్వార్థ సంకుచితడైన ఆస్తికుడి కంటె
సంఘ సంక్షేమం కోరే నాస్తికుడే ఉత్తముడు.

## 38. అదుపు చెయ్యి

లంచానికి బాధ్యుడు లంచం ఇచ్చేవాడే,
పుచ్చుకొనేవాడు నిమిత్త మాత్రుడు!
లంచాలూ, లాభార్జనలూ ఎప్పుడూ వుండేవే
వాటికి మంచి పేర్లు పెట్టి చట్టబద్ధం చెయ్యి!
మానవ బలహీనతలను నిషేధించడం వ్యర్థం
అదుపుచేసి అభ్యుదయం సాధించు!

## 39. అనుభూతి

మెదడొక దీపం -
దీపం వెలుగుతూ వున్నప్పుడు
దాని శక్తిని బట్టి ఆవిష్కరిస్తూ వుంటుంది
ఎన్నో ఎన్నో దృశ్యాలను!

దీపం ఆరిపోయినప్పుడు
దృశ్యాలన్నీ దానితో పోతాయా?

పరమాత్మ కూడ
ఆత్మానుభూతి నుంచి జాగృతమువుతూ
ఉన్నవోన్నవంగా వికసిస్తూ వున్నది!

## 40. వంశోద్ధారకులు

రాజకీయ స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశంలో
అవతరించిన భారత వంశోద్ధారకులు
రవి తేజులా? పైరవీ దాసులు!
రోమియోలా? రైనోలు!
ఫలవృక్షాలా? బదనికలు!

## 41. నెగిటివ్‌లు

హరిశ్చంద్రుడు, రఘురాముడు, ధర్మరాజు
పదవీరాజకీయాలకు నమూనాలు!
ఇంద్రుడు, సుగ్రీవుడు, కర్ణుడు, వామనుడు
హిపోక్రసీకి ప్రతిబింబాలు!
దుర్యోధనుడు అరసికతకు
రావణుడు మూర్ఖ పట్టుదలకు ప్రతీకలు!

## 42. జాలి కాదు

చీకట్లో బ్రతికే వాళ్ళకు సానుభూతి చెప్పడం
ఆకలితో చచ్చే వాళ్ళపై జాలి పడడం
కాదు నా కవితా లక్ష్యం.
వాళ్లను నయానో, భయానో, బలవంతానో
అక్కడి నుంచి వెలుగులోకి రప్పించడం!
మార్కెట్‌లోని భోజన శాలల వైపు
వేలెత్తి చూపించడం!

## 43. ధర్మవైరుధ్యాలు

ప్రకృతిని అనుసరించి సాగేదే ధర్మం
యంత్రం, మంత్రం, తంత్రం ఏదైనా పరిమితమే,
అది ఎంతో కాలం ధర్మాన్ని నిరోధించలేదు.

నీతులు, నియమాలు, నిష్ఠలు, నిర్బంధాలు
అన్నీ దెబ్బతిని పోవడానికి కారణం
అవి సహజ ధర్మాన్ని అరికట్టే లాఠీలై
ప్రజలపై విరుచుకు పడడమే!

## 44. బంగారు లేడి

బంగారు లేడి నిజం లేడి కాదని
రాముడికీ తెలుసు, మారీచుడికీ తెలుసు.
మరెందుకా పరుగు పందెం?
భూమి పుత్రికోసం
భూమి పుత్రులం మనకోసం!

ఓ మాయలేడీ!
పరిగెత్తు! పరిగెత్తుతునే వుండు!
నీ రక్షణ కోసమే మా సమస్త నిధులూ,
మా సర్వసైన్యాలూ!

# 45. కుక్కా పిల్లీయం

కుక్కకూ, పిల్లికీ స్నేహం కలుస్తుందా?
మేం కలపడాని కొచ్చాం!
అన్నాడొక నాయకుడు.

పులీ, మేకా ఒక రేవులో నీళ్లు తాగుతయా?
మేం తాగించడాని కొచ్చాం!
అన్నాడు మరొక నాయకుడు.

అందుకు కోట్ల రూపాయలు ఖర్చు
మంజూ రయిం దన్నారు
అదంతా బస్తీ వాళ్లే పెట్టుకోవా లన్నారు.

అనగానే కలకలం బయలుదేరింది
చర్చలు ప్రారంభమైనై.

ఈ గొడవంతా చూస్తున్న
ఒక అమాయకుడు లేచి అన్నాడు –
"అయ్యా! తమరు చెబుతున్నది
పలు తెగల జంతువులను గురించి.
మరి, ఈ బస్తీ వాళ్లంతా మనుషులే కదా!"

## 46. నేర కారణం

అఘాయిత్యాలు, అక్రమాలు, అత్యాచారాలు
జరుగుతున్నా యంటే - కారణం
నేరస్థుల దౌర్జన్యం కాదు
సజ్జనుల పిరికితనం.

సంఘంలోని ప్రతి వ్యక్తికీ
ఎదుర్కొనే ధైర్య సాహసాలుంటే
నేరాలు వుండవు
నేరస్తులూ వుండరు.

సహన గుణమే మనిషిని
చావగొట్టి పారేస్తున్నది.

# 47. కాలం

కాలం ఒక్కటి కాదు
విశ్వ మంతటా ఒకేలా వుండదు,
ఆయా గ్రహతారాదుల గతుల్ని బట్టి
కాలప్రమాణం మారుతూ వుంటుంది.
మన సూర్య కుటుంబంలోనే
కాలం గ్రహానికో రకం.
మన భూగోళం మీదనే
కాలం క్షణానికో విధం!

కాలం స్థిరం కాదు, శాశ్వతం కాదు
వ్యక్తి కాదు, శక్తి కాదు
దానికే విలువలూ లేవు.

## 48. ప్రవక్తలు సర్వజ్ఞులు కారు

సృష్టి స్థితి లయాలను గురించి
ఈనాడు మనకు తెలిసినంత భోగట్టా
ఆనాటి వేద ఋషులకు తెలియదు.
మధ్య మధ్య అవతరిస్తూ వచ్చిన
మత ప్రవక్తలకూ తెలియదు.

భూమి తిరుగుతున్నదో, సూర్య తిరుగుతున్నదో
తెలియని కాలంలో పుట్టిన ఎవళ్లైనా
సర్వజ్ఞులని అనుకో నక్కరలేదు.

మారుతుండే కాలంలో
ఒకానొక మార్పుకు నాయకుడైన ప్రముఖుడు
ఆ కాలానికి ప్రవక్త కావచ్చు.
అతడి ప్రవక్తత్వం
మరొక మార్పు వచ్చే వరకే.

ప్రపంచంతోపాటు ప్రజలూ మారతారు
ప్రజలతోపాటు ప్రవచనాలూ మారతై
మారేది పురోగమిస్తుంది
మారనిది నశిస్తుంది.

# 49. మనో బలం

దేవుడంటే ఎవరు?
నీ మనస్సే నీ దేవుడు!

నీ మనస్సు ఎంత బలమైనదైతే
నీ దేవుడు అంత బలంగా వుంటాడు!

నీ శత్రువుల దేవుణ్ని
నీ దేవుడు గెలవా లనుకొంటున్నావా?
నీ శత్రువుల దీక్షను మించిన దీక్షను
నీ మనస్సుకు సంపాదించుకో!

మనస్సే దేవుడు
ఎవడి మనస్సుకు వాడే దేవుడు!
మతం కూడా అంతే
ఎవడి అభిమతం వాడి మతం!

## 50. నినాదం

ప్రపంచ గొర్రెల్లారా! ఏకం కండి!

ఎవరి దా నినాదం?

పులుల పెట్టుబడితో

నక్కలు చేస్తున్న నినాదం!

పదండి, తోసుకు పదండి అంటూ నక్కలు

గొర్రెల్ని లారీల కెక్కించేస్తున్న నినాదం!

గొర్రెల రాజ్యం అంటూ నక్కలే పులులై

ఎక్కడి కక్కడే సింహాసనా లధిష్ఠించి

గొర్రె నెత్తురు బ్రాందీగా సేవిస్తూ

మత్తెక్కి కక్కుతున్న నినాదం!

## 51. రామిగాడు కాదు

ఏం రోయ్, రామిగా!
యేసం మార్చావ్! ఏంటి కత?
గోచిపాత తీసేసి
గళ్ల లుంగీ కట్టావే?

చిత్తం, దొరా!
ఇపుడు నా పేరు రామిగాడు కాదండి!
రహీం ఖాను!
తురక మతంలో చేరావా యేంటి?
రాముడి కంటె రహీం
గొప్పో డనుకొంటున్నావా?

అంతే కదండి, మరి?
రాముణ్నిగాడు అంటున్నారు,
గాడిదా అని తిడుతున్నారు!
రహీంని అనగలరా?

అంటే నో?

ఈ గళ్లలుంగీ

అందుకే కదండి, మరి?

మీ అంబేద్కరు

బౌద్ధ మతంలో చేరమన్నాడుగా?

అది పొరపాటని

మీ దొరలేగా నిరూపిస్తున్నారు?

ఏది ఏమైనా – ఈ పిరికి దేశంలో

గళ్ల లుంగీలు కట్టకుండ బ్రతకడం

సాధ్యం కాదు లెండి!

# 52. చచ్చి స్వర్గానికి

ముగ్గురు భక్తులు చచ్చి
స్వర్గానికి బైలు దేరారు.

ఆ ముగ్గురి ధ్యానాలు ఇలా ఉన్నై
ఈశ్వర్ అల్లా తేరే నాం -
ఈశ్వర్ ఏకీ తేరే నాం -
అల్లా ఏకీ తేరే నాం.

స్వర్గ ద్వారం దగ్గర ఎకె 47తో
ఎవరో అపరిచిత ఆజానుబాహువు!
అప్రతిభులై మూగవోయా రా ముగ్గురూ!
వాళ్ల రాక ముందే తెలిసిన వాడిలా

చిరునవ్వు నవ్వి అన్నాడా ద్వార పాలకుడు
"ఇస్సలాం, ఫకీర్ జీ!
తమరు ఈ రస్తాలో వెళ్లండి,
అక్కడ సింధునదీ ముఖ ప్రాంగణంలో
ఏర్పాటై ఉంది మీ స్వర్గం"

"నమస్కారం స్వామీజీ!
మీరు ఆ మార్గంలో వెళ్లండి,
అక్కడ గంగాపాద పద్మాలయ సీమలో
వుంది మీ స్వర్గం"
అల్లా ఏకీ గారూ, ఈశ్వర ఏకీ గారూ
లోపలికి వెళ్ళిపోయారు.

మూడో ద్వారం లేదు!
స్వర్గలోకాలకు దిగువగా, దూరంలో
వైతరణీ నది ఒడ్డున, గుడ్డిగా
గుడారాలేవో కనిపిస్తున్నై!

చంచల మనస్కులకు
ద్వంద్వ ప్రకృతులకు
గోడమీద పిల్లులకు అట!

అటుకేసి చూస్తూ నిలబడ్డాడు
ఈశ్వర్ అల్లా అస్థిత ప్రజ్ఞుడు!
భారత రాజకీయ మేధావుడు!

## 53. గణపతిపై రాళ్ళు

"గణపతి ఊరేగింపుపై
రాళ్లు పడుతున్నై, బాస్!
ఎక్కడి నుంచో తెలీడం లేదు"

"సందులు, గొందులు గాలించండి!"
"పక్క సందులు, ప్రార్థన మందిరాలు కూడ
ఏదీ వదలిపెట్టలేదు, బాస్!

"క్లూలు?"
"రాళ్లు సూటిగా
తొండాలకు తగులుతున్నై
సాగర్ చేరే ఏ విగ్రహానికీ
తొండం వుండడం లేదు"
"విగ్రహ విధ్వంసక వర్గం నాయకులను
అదుపులోకి తీసుకోండి"
"ఆవిధంగా గురి చూచి కొట్టడం
ఒక్క కుమారస్వామికి తప్ప
మరెవరికీ సాధ్యం కాదంటున్నారు వాళ్ళు"

"ఆయనెవరు?"

"గణేశ్వరుడి తమ్ముడట, బాస్!"

"ఆయనెందుకు విసురుతాడు రాళ్లు?"

"ప్రైమాఫేసీ కేసుంది, బాస్!
న్యాయంగా ఓపెన్ కాంపిటీషన్‌లో
ఆయనకు రావలసిన గణాధిపత్యాన్ని
పైరవీ ద్వారా ఈయన కొట్టేశాడుట!
అప్పటి నుంచీ కోపావేశుడైన ఆయన
ఈయన పట్ల బెర్రరిష్టే అయాడుట!"

"హరి దేవుడా! ఇపుడేమిటి చెయ్యడం?"

"ఏం చెయ్యక్కర లేదు, బాస్!
ఆయన పనులకు ఈయన విఘ్నాలు కల్పించడం
ఈయన ఊరేగింపులపై ఆయన రాళ్లు రువ్వించడం
ఇదంతా అన్నదమ్ముల మధ్య
కుటుంబ రాజకీయాలు, బాస్!
మనం చెయ్యవలసిం దేం లేదు"

## 54. ఏ జాతి పితవు?

బాపూజీ! మహాత్మా! జాతిపితా!
జిన్నాగారి ద్విజాతి సిద్ధాంతం నిజమైనాక, ఇపుడు
నీవు ఏ జాతికి పితవు?

స్వాతంత్ర్యోద్యమ నిర్మాతవు
ఉద్యమ సారధివి, విజయభద్రుడవు
నీవే భారత రాజ్య పట్టభద్రుడవై యుంటే
మా అదృష్టం ఎలా వుండేదో యేమో!

జీవిత సుఖ శాంతులన్నిటినీ త్యాగం చేశావు
జైలే నిత్యవసతిగా తపించావు
రవి అస్తమించని సామ్రాజ్యపు అస్త్ర శస్త్రాలను
చేతి కర్రతో చిన్నాభిన్నం చేశావు
నీ అహింసా సత్యాగ్రహాలే లేకపోతే
బ్రిటిష్ సింహాన్ని తరిమి కొట్టగలిగే వాళ్లమా?

"వందే మాతరం" అని నీ వంటే?
అదే మాకు సమర నినాదమయింది.
"రామరాజ్యం తెస్తా"నని నీవు ఉద్ఘాటిస్తే
మేమంతా రామదండుగా నీ వెంట కదిలాం.
"ఈశ్వర్ అల్లా తేరే నాం" అని నీవు గానం చేస్తే
తన్మయత్వంతో నీకు తాళం వేశాం.
ఖద్దరు టోపీలు పెట్టుకొని బుర్రలు
బద్దలు కొట్టించుకొన్నాం కాదా?

కృతజ్ఞతగా నిన్ను చంపి
నీ కృషి ఫలితాన్ని అందుకొని తింటున్నాం!
నీ ఆనవా ళ్లన్నింటినీ తుడిచివేస్తూ
హరిజన పదాన్ని అంటనే కూడ దంటూ
నిన్ను మళ్లీ మళ్లీ చంపుతున్నాం!
ఇపుడు మా జాతి ఏది?
జాతి పితా!
నీ విపుడు ఏ జాతికి పితవు?

# 55. భూతాలు

గాలి, దెయ్యం, ఘోస్టు, స్పిరిటు, సైతాను
వంటి మాటలతో పిలువబడే వన్నీ భూతాలే
ప్రకోపించిన పంచభూతాలు.
ఇవి శరీరం బైటా, లోపలా కూడ వుంటై
కనుక –
దేవుడు లేడు అనగలం కాని
దెయ్యం లేదు అని ఎలా అనగలం?
ప్రకృతి శక్తులన్నీ పరమాత్మ గుణాలే
అందులో ఏది ఉద్రేకించినా ఉత్పాతమే
ఏది ప్రకోపించినా దెయ్యమే!

## 56. నిరుద్ధ వేద భారతం

సంపంగి పువ్వును
ఎన్ని షట్పదాలు ఎంతగా నిషేధించినా
బంగారానికి తావి అబ్బిన
స్వర్ణ పుష్పం అదొక్కటే!
నా కథ కూడ అలాంటిదే
నిరుద్ధ వేద భారతం!

## 57. దొర - దోమ

దొరకు దొరసాని ప్రియురాలు
దోమకు దోమసాని ప్రియురాలు!
దొర చస్తే ఎంతో
దోమ చచ్చినా అంతే!
శివుడు బిచ్చగాడు
నేనూ బిచ్చగాణ్నే!
అయితే...
శివుడికి కోరికలు లేవు
నాకున్నై!

## 58. రాబందు

ఎవరు నేస్తం!
ఏమిటి చేస్తున్నావక్కడ?
పావురాన్ని దువ్వుతూ ముద్దుగా
ముద్దు పెట్టుకుంటున్నావే!
ఏమిటి కథ?
ప్రేయసికి ప్రేమ సందేశమా?
ప్రపంచానికి శాంతి సందేశమా?
ఈ నీరెండ వెలుగు నీడలలో
సరీగ్గా కనిపించడం లేదు నాకు -
ఎవరు నీవు?

ఏ కులం వాడివో!
ఏ మతం వాడివో!
ఏ పార్టీ వాడివో!
ఏ ప్రాంతం వాడివో!
ఎవరునీవు?

ఎవరి వైతే నేం లే-
నీవు మనిషివి!
అంతే నాకు కావలసింది!
మనిషి నా నేస్తం!
"మనుషుల్లా కనిపించే అందరూ
మనుషులు కారు" అంటున్నావా?
నా అంచనా పొరపాటైతే -
అందుకు నేనేమీ చెయ్యలేను
తెల్లనివన్నీ పాలు అనుకునే శిశువును నేను.

ఇంతకూ, నేస్తం!
నీ చేతిలోది పావురమేనా?
అలా కనిపిస్తున్న డేగ కాదు కదా!
ఎంత గొప్పవాణ్ణైనా వంచించవచ్చు!
రాముడంతటి మహిమాన్వితుణ్నే
మారీచుడు వంచించాడు!
మన జాగ్రత్తలో మనం వుండాలి!

సరే, నేస్తం!
నీ కృషి ఫలించుగాక
నీ కోరిక తీరుగాక!

అయితే - నేస్తం -

అటు చూశావా?

ఆ ప్రక్క తాటిచెట్టుపై చేరి

సాధు సుభగమైన నీ పావురం కేసి

ఆకలిగా చూస్తున్న ఆ రాబందును

గమనించావా?

నీ వద్ద -

చంపే తుపాకీ వుండదులే.

కనీసం -

బెదిరించే ఉండేలు బద్ద అయినా వున్నదా?

లేకపోతే -

నీ పావురం ఎలా బ్రతుకుద్ది?

## 59. తప్పేమిటి?

నమ్మక ద్రోహం, వెన్నుపోటు పొడవడం
వంటి మాటలు గొంగళిలో వెంట్రుకలు.

రాజకీయ మార్కెట్లో అవి
పనికి రాని పుచ్చులు.
వోటున్న ప్రతి వాడూ ప్రధాని కాగలవాడే,
అందుకతడు ప్రయత్నిస్తే తప్పేముంది?

నీకు తగు బలమూ, బుద్ధీ వుంటే
మరొకడు నిన్నెలా మోసగిస్తాడు?

# 60. అన్న - తమ్ముడు

దేవుడున్నాడనే వాడు నా అన్న
అతడికి నేను నచ్చ చెప్పలేను.

దేవుడు లేడనే వాడు నా తమ్ముడు
ఇతడు నా మాట వినిపించుకోడు.

ఉన్నాడనే వాడు ముక్కుమూసు క్కూచున్నాడు
లేడనేవాడు తన నీడ వెంట తానే పడ్డాడు.
వీణ్ని ఆపి, వాణ్ని లేపడం కోసమే
ఈ నా కుడి ఎడమల ధనుర్బాణాలు!

## 61. కృషిని బట్టి

కొందరు తమ కష్టానికి ప్రతిఫలం
అడిగి పుచ్చుకుంటారు.
కొందరు ఇస్తే పుచ్చుకుంటారు,
కొందరు ఇస్తామన్నా పుచ్చుకోరు.

మరికొందరు ఏ పనీ చెయ్యకుండానే
దేశ సంపద అంతా తమకే కావాలంటారు!
కృషిని బట్టి సంపదను పంచాలి ప్రభుత్వం
అప్పుడే అది ప్రజల ప్రభుత్వం.

## 62. నిత్య సత్యం

ఇదేదో కవిత్వం అంటూ తీసివెయ్యకు
నిజమైన కవిత్వం నిరంతర సత్యం
సత్యం విశ్వైక జీవస్రవంతి.

దేశాన్ని బట్టి పేరూ, కాలాన్ని బట్టి రంగూ
వేగాన్ని బట్టి గుణమూ ఏర్పడొచ్చు.

సత్యం ఆకాశం, నక్షత్రాలు కవితలు
అవి భూమికి నిత్య సత్యాలు.

## 63. అవే

నాలుగు వర్ణాలన్నది హిందూయిజం
రెండు వర్గాలన్నది కమ్యూనిజం
మూడు అంతరాలంటున్నాను నేను.
ఇది – పులీ నక్కా గొర్రె ఇజం!

వేదయుగం మనిషికీ, నేటి మనిషికీ
తేడా ఏముందు గుణకర్మలలో?
అదే పులీ, అదే నక్కా, అవే గొర్రెలూ!

## 64. విలువలు

లక్షపూలు పెట్టుకొన్న గయ్యాళి కంటె
ఆ పూలలో ప్రతి ఒక్కటీ కమనీయమే,
కోటి గొంతులు కోసిన కత్తి కంటె
ఆ గొంతులలోని ప్రతి ప్రాణమూ కమనీయమే!

## 65. మళ్లీ వసంతం

ప్రతిభ పరారయింది
కాపీ కొట్టడం కళ అయింది
స్వార్థమే రాజనీతి అయింది
అవినీతే బ్రతుకు తెరువయింది
నిరసనలే నిత్యకృత్యాలైనై!

ఇప్పుడు మళ్లీ వసంతం వచ్చింది
ఎందుకు? ఎవరు గుర్తిస్తారని?

## 66. లోభీ

జేబులో పైసల కంటే ఎన్నో రెట్లు
బేంకులో వున్నప్పుడే అతడు ధనికుడు.
ఉన్నదంతా జేబులోనే వుండకూడదు
మొత్తమంతా బేంకులోనూ వుండకూడదు.

సముద్రజలం వర్షంగా మారినప్పుడే
పంటలూ, ఫలసాయాలూ!
కనుక – లోభీ
ఊబి నుంచి బైటికి రా!

## 67. వెలుగులోకి

భగవంతుడు వేదకాలం నాడే కాదు
ఈనాడు కూడా వున్నాడు
ఋషులు నాడే కాదు, నేడూ వున్నారు.
కనుక – వేదాలు ఆనాడే కాదు
ఈనాడు కూడ పుడుతున్నై
కనుక – ఛాదస్తుల్లారా!
చీకటి ఊబి నుంచి
వెలుగులోకి రండి!

## 68. విపత్తులు

భూకంపం కలిగితే కూలేవి మేడలే
తుఫాను వస్తే విరిగేవి మహావృక్షాలే
దొంగలు పడితే పోయేవి ధన కనకాలే!

కనుక గుడిసెల్లోని ఓ పేద మొక్కల్లారా!
అలాంటి విపత్తులు పైని పడతాయేమో నని
మీ రెక్కడి వాళ్ళక్కడే వుండిపోతారా?

## 69. వలలు

వద్దు మతం, వద్దు మతబోధలు
వద్దు భక్తి, వద్దు భజనలు.
అవేవీ నిన్ను రక్షించలేవు
అవన్నీ నీకోసం పన్నిన వలలు.
ఏది పులిదో, ఏది నక్కదో కనిపెట్టు!
మనశ్శక్తిని పెంచుకొని మనిషిగా బ్రతుకు!

## 70. అవసరాలు

అడిగితే కాని అమ్మైనా పెట్టదు
ఏడిస్తేనే ఏదైనా లభిస్తుంది
ఆందోళన చేస్తేనే కాని
అవసరాలు గుర్తించబడవు –
కవిరాజైనా అంతే,
కూలిరాజైనా అంతే!
అది జీవ నైజం!

## 71. బతకమ్మ

వేద ఋషులు ఆరాధించిన ప్రకృతి శక్తులే
నేడు మే మారాధించే గ్రామదేవతలు.
ఆనాడు అవి హోమ జ్వాలలు
ఈనాడు ఇవి నిప్పు కణాలు.
ఆనాటి హవ్యాలే
ఈనాటి బోనాలు!
ఆనాటి విజయదుర్గమ్మే
ఈనాటి మా బతకమ్మ!

## 72. అహింసా మెహర్బానీ

రక్తం రుచి తెలిసిన నక్కలకు
తెలియని గొర్రెలు కాల్మొక్కడం ఎందువల్ల?
మన అహింసా మెహర్బానీ నాయకుడు
నక్కలకు కాల్మొక్కుతూ
మనల్ని గొర్రెలుగా మార్చుకోవడం వల్ల!

## 73. పారమ్యం

ఈ పారమాత్మిక శక్తి సముద్రంలో
నా మనస్సు ఒక మైనాకం!
నా పరిధి గుండా పోయే విప్రలంభ సందేశాలకు
నిలిపి నీడ నిచ్చే అశోకం!
ఈ నా మనోగతాలన్నీ
ఏత త్సందేశాల హృదయ స్పందనలే!
ఒకొక్క స్పందన ఒకొక్క క్షతం
మధుర బాధే ఆనంద ఋతం!

## 74. స్పష్టత

భావం ఎంత స్పష్టంగా వుంటే
భాష అంత నిశితంగా వుంటుంది,
భావం తన సొంతం అయినప్పుడే
భాష తన స్వాంతాన్ని అర్పిస్తుంది.

# 75. ఆత్మవిశ్వాసం

ఆత్మ విశ్వాసమే శక్తి
ఆత్మ విశ్వాసమే రక్తి
ఆత్మ విశ్వాసమే భక్తి
ఆత్మ విశ్వాసమే భుక్తి, ముక్తి.

గ్రీష్మంలో ఎండిపోయినా
వర్షంలో పొంగిపోయినా
హేమంతంలో గడ్డకట్టుకుపోయినా
తిరిగి నీకు వసంతాన్ని ఇచ్చేది
నీ ఆత్మ విశ్వాసమే!
నీ ఆత్మకు పరమాత్మ
నీ విశ్వాసమే!

# 76. అస్తిత్వం

శిశిరంలో నీ అవస్థ ఏమిటి?
గడ్డకట్టుకుపోయావా?
పచ్చదన మంతా దళితమై
మోడై పోయావా?
జీవమే పోయిన ఎండు కట్టె వయావా?

ఏమైనా పర్వాలేదు
నీలో నీదైన అస్తిత్వ ముంటే
కరిగి ప్రవహించగలవు
విరిసి విస్తరించగలవు.
గుడిలో, బడిలో, మడిలో అంతటా
వెలుగు జిలుగులు పండించగలవు!
నీ కోసమే కదా
వసంతం మళ్లీ వచ్చింది?

## 77. స్వార్థ రూపం

నేను, నాది, నాకు, నా వాళ్లకు అనే వైఖరిని
స్వార్థముని నిరసించకు.
స్వార్థమే కృషికి ప్రోత్సాహకం
స్వార్థమే పరమాత్మకు ఆత్మ.
వైయక్తిక స్వార్థాల సమన్వయమే సమాజం
వాటి వికారాల పరాక్రమ యత్నమే విధ్వంసం,
మనం వద్దనేది విధ్వంసక స్వార్థాన్ని
అవసరానికి మించి కూడ బెట్టుకునే వికారాన్ని.

## 78. రూపగుణాలు

పువ్వు, ముల్లు, పులి, లేడి, మనిషి
వంటి వన్నీ భౌతిక రూపాల పేర్లు.
వాటి ఆత్మ చైతన్యం ఒక పరమాత్మది,
గుణాలు మాత్రం రూపాలను బట్టి సంక్రమిస్తై.

మనిషి ప్రత్యేకత ఏమిటంటే –
అన్ని జీవాత్మల గుణాలూ మనిషిలో వుంటై
వైరుధ్యాలూ, వైరాలూ, హింసలూ, హత్యలూ
ఆయా గుణప్రకోపాల ఫలితాలే!

## 79. మానవత్వం

మానవత్వం అంటే ఏమిటి?
మానవత్వం దైవత్వం లాగే ఒక దురూహ!

మానవత్వం ఒక బంగారు లేడి
అది స్వాతంత్ర్యోద్యమ వాగ్దానం వలె
భూపుత్రులను మోసగిస్తుంది
భూస్వాములకు తోడ్పడుతుంది.

లేడికీ, బాణానికీ
సమానావకాశాలు కల్పించేది దైవత్వం,
బాణంతో లేడిని చంపడం మానవత్వం.

మానవ గుణ చర్యలే మానవత్వం
అది ప్రతి మనిషికీ సహజధర్మం.
కావలసింది మానవత్వం కాదు
స్వపర పక్షపాతం లేని సాంఘిక న్యాయం!

# 80. వందే మా "తరం"

అరుణోదయ వదనంతో
ఉదయారుణ తిలకంతో
కను దమ్ముల కాటుకతో
చిరునవ్వుల వేకువతో
నీవు వస్తున్నావని గుర్తించిన ఈ యెడారి
వసంతోద్యానంగా లేచి నిలబడింది!

నీ మణి మంజీరాల గలగలలే
ఈ శుక పిక శారికా సరిగమలు!

అప్పుడు నీతో నిష్క్రమించిన వైభవం
సుజల సుసుమ సుఫల పుష్కల శోభ
ఇపుడు మళ్లీ వచ్చింది నీతోనే!
ఇక నిన్ను పోనీయం
ఈ తోటను ఎడారి కానీయం!

## 81. కావ్యానందం

కావ్యం చదవడం రసానందం కోసం
అందులోని పాత్రలను
అనుసరించడం కోసం కాదు.
దృశ్య కావ్యం కనుక, హరిశ్చంద్రుడితో పాటు
ప్రేక్షకులూ ఏడుస్తున్నారు
నిజ జీవితంలో అయితే-
నక్షత్రకుణ్ని చంపి
విశ్వామిత్రుణ్ని జైలుకు పంపేవాళ్లు!

## 82. మళ్లీ మళ్లీ

ఇపుడు నేను చెపుతున్న మాటలన్నీ
గత వసంతంలో నేను పాటలుగా పాడినవే,
గత శరత్తులో పద్యాలుగా పలికినవే,
నాటకాలుగా, నాట్యాలుగా ఆడినవే.
అవే అక్షరాలు, అవే వాక్యాలు, భావాలు
అవే రాగాలు, అభినయాలు మళ్లీ మళ్లీ!

ఈ మళ్ళీ మళ్ళీ లోనే వుంది ఎంత సొగసైనా,
రసజ్ఞులకు ఎంత మధువైనా!

## 83. పుట్టపర్తి బాబా

నే నెవరికీ భక్తుణ్ణి కాదు
భక్తి తత్త్వం నా స్వభావంలోనే లేదు.
అయితే, తమకు
బీజాత్మకంగా లభించిన శక్తి యుక్తులను
ప్రజలకోసం వినియోగించే ఉదారులపట్ల
నాకు గౌరవం వుంది.
అట్టి ఉదార చరిత్రుడు పుట్టపర్తి బాబా!

విష్ణువు దశావతారా లెత్తి
ప్రజలకు చేసిందేమీ లేదు.
విష్ణువు కంటె గొప్పవాడు
పుట్టపర్తి సత్యసాయి!

## 84. ఎవరు భర్త

తానే పరమాత్మకు ఆత్మీయ ప్రతినిధినని
మనస్సుకు మహా అహంకారం!
అందుకే నేమో -
నా మనస్సు నా మాట వినదు.
విశ్వ విశ్వాంతర విపణి వీధుల్లో
విచ్చలవిడిగా సంచరిస్తూ
తన గయ్యాళి గంప నిండా ఏవేవో
తెచ్చి నా ముందు పోస్తుంది!
ధర్మంగా నేను దాని భర్తను, కాని
అదే నాకు భర్త అయి కూర్చుంది!

## 85. అపకారం వద్దు

ఉపకారం చేస్తే అది ప్లస్ పాయింటు,
అపకారం చేస్తే మైనస్ పాయింటు.
ప్లస్ పాయింటు సెక్యూరిటీ గార్డు
మైనస్ పాయింటు కేన్సర్!

## 86. చావు లేకుండా

చావు లేకుండా పుడుతూనే వుండడం
పుట్టుక లేకుండా చస్తూనే పోవడం
ప్రొద్దు గూకకుండా పొడుస్తూనే వుండడం
ఎక్కడైనా వుంటుందా?
అందుకే –
కొడుకు పుట్టాలంటే
తాత చనిపోక తప్పదు!

## 87. ముఖ్య అతిథి

ఏ సాహిత్య సభకైనా ముఖ్యాతిథిగా
ఒక పూజ్య విఐపి గార్ని పిలవడం
తమ సర్వజ్ఞతను ప్రదర్శించి
ముందే లేచిపోవడానికి కాదు.
సభలో పాల్గొనే పండిత గజేంద్రులు
ప్రజల గోడును వినిపిస్తుంటే – ఆలించి
తమ ఆర్తత్రాణ ప్రాభవం చూపడం కోసం
చివరి వరకూ కూర్చోవా లని!

## 88. హృదయవీణ

లతలన్నీ ఒక తోటలోనివే,
పూలన్నీ అందమైనవే,
రుచులన్నీ తృప్తినిచ్చేవే.
నీ జీవితంలో ఏదైనా అసంతృప్తి కనిపిస్తే
అది నీ హృదయ వీణ పలికే అపశృతే!
వీణ తీగలు సరిదిద్దుకో!

## 89. ఆశీర్వాదం

దశ దిక్కులు, నవ రత్నాలు
అష్ట లక్ష్ములు, సప్త స్వరాలు
షట్చక్రాలు, పంచ భూతాలు
చతురుపాయాలు, త్రిధాతువులు
సూర్య చంద్ర గ్రహ తారాదులు
ఏకేశ్వరీయ మైన సమస్తమూ
మీకు ప్రసన్నమై, ప్రపద్యమై
ఆయు రారోగ్య విద్యా సౌభాగ్యాలతో
ఆశీర్వదించుగాక!

❋ ❋ ❋